ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 120 | మంగళవారం | 31-03-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం

'తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు' శాసనసభ, శాసనమండలి ఉభయ సభలలో సోమవారం రాత్రి ఆమోదం పొందింది. ద్రవ్య వినిమయ బిల్లును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉభయ సభలలో ప్రవేశపెట్టారు. బిల్లుపై జరిగిన చర్చలో బిజెపి శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం ఎంఎల్ఎ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎంఎల్ఎలు సి.విజయరమణ రావు, బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. అనంతరం ద్రవ్య వినిమయ బిల్లును సభ ఆమోదించగా, సభను స్పీకర్ గడ్డం ప్రసాద్ నిరవరధికంగా వాయిదా వేశారు.

## హైడ్రా, ఈగల్ మాదిరిగా

# ఆహార కల్తీపై స్వతంత్ర వ్యవస్థ

### అసెంబ్లీలో సన్నబియ్యం బిర్యానీ, బగారా

రాష్ట్రంలో సన్నబియ్యం పథకం ప్రారంభించి ఏడాది పూ ర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ సెంట్రల్ హాల్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, మీడియా పాయింట్ సమీపంలో మీడియా ప్రతినిధులకు సన్న బియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు హాజరయ్యారు. సన్న బియ్యం తో వండిన మటన్ దమ్ బిర్యాని, వైట్ రైస్, బగరా రైస్, పుదీనా రైస్, పులిహోర, సన్న బియ్యం ఖీర్, కొబ్బరి పేడ తదితర వంటకాలు అద్భుతంగా ఉన్నాయని సిఎం తో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు కొనియాడారు.

### 50 శాతం సీట్లు పెంచితే ద్వితీయ శ్రేణిపౌరులుగా దక్షిణ భారతీయులు

- ప్రజలందరికీ త్వరలో కేన్సర్ పరీక్షలు
- వంద శాతం జనాభాకైనా సన్నబియ్యం ఇచ్చేందుకు సిద్ధం
- పంట మార్పిడి చేస్తే రైతులకు ప్రభుత్వం సహకారం : సిఎం రేవంత్‌రెడ్డి

### సన్నబియ్యం పథకానికి ఏడాది పూర్తి



అసెంబ్లీలో ఎంఎల్‌ఎలతో కలిసి సన్నబియ్యం బిర్యానీ తిన్న సిఎం

ప్రజాపక్షం / హైదరాబాద్

చెరువులను కాపాడేందుకు హైడ్రా, డ్రగ్స్ రవాణాను చేధించేందుకు ఈగల్ తరహాలో ఆహార కల్తీని నియంత్రించేందుకు స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 50 శాతం నియోజకవర్గాల పెంపు, పునర్విభజన ప్రతిపాదన నూటికి నూరు శాతం దక్షిణ భారత పౌరులను దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చుతుందని అన్నారు. ఈ ప్రతిపాదన దక్షిణ భారతదేశానికి వ్యతిరేకమని, ఇది రాజకీయ పార్టీల సమస్య కాదని, ప్రజల సమస్య అని అన్నారు. లోక్‌సభ నియోజవర్గాలు పెంచినా, ప్రస్తుతం ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య ఎన్ని సీట్ల తేడా ఉందో అన్నే సీట్ల తేడా ఉండాలా పెంచాలని సూచించారు. ఆహార భద్రత కింద ఏడాదిగా రాష్ట్రంలోని 85 శాతం జనాభాకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఇకపై విద్యా, ఆహారం నాణ్యత లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఒకప్పుడు విద్య, భోజనం లేదని, ఇప్పుడు విద్య ఉన్నప్పటికీ, ప్రజలు నాణ్యత, సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకునే విద్యను కోరుకుంటున్నారని, అలాగే భోజనంలో పౌష్టికాహారం, ఆర్గానిక్ (సేంద్రియ) ఆహారం అందించే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సన్న వడ్లకు బోనస్, అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ ద్వారా ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు లబ్ధి జరుగుతోందని, సన్న బియ్యం సాగు కూడా పెరిగిందన్నారు. ఇకపై రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలని, ఇందుకు ప్రభుత్వం సహకరిస్తుందని, ఇప్పటికే మూడేళ్ళ తరువాత పంట వచ్చే పామాయిల్ రైతులకు సహకరిస్తోందన్నారు. సన్న బియ్యం పథకం ప్రవేశపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా పౌర సరఫరాల శాఖ మంత్రి తరువాయి 2లో

## విద్వేషపూరితమైన ప్రసంగం బిల్లు

# సెలక్ట్ కమిటీకి

- అసెంబ్లీలో తీర్మానం
- బిల్లులో నిబంధనలు, శిక్షలు, పౌర హక్కుల అంశాలపై సభలో భిన్నాభిప్రాయాలు
- బిల్లును ఉపసంహరించుకునేందుకు పునరాలోచన చేయాలని సిపిఐ సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ విద్వేష ప్రసంగం, ద్వేషపూరితమైన నేరాల నివారణ బిల్లు 2026'ను సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేస్తూ శాసనసభ తీర్మానం చేసింది. సిఎం రేవంత్ రెడ్డి తరపున ఈ బిల్లును మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులోని నిబంధనలు, శిక్షలు, పౌర హక్కుల అంశాలపై సభలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు కాంగ్రెస్ సభ్యులు, బిజెపి, ఎంఐఎం సభ్యులు సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని కోరగా, సిపిఐ మాత్రం ఈ బిల్లును ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించింది. తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్ బిల్లును ప్రవేశపెడుతూ ఈ బిల్లు భావ ప్రకటన స్వేచ్ఛకు, వాక్ స్వాతంత్ర్యానికి ఎటువంటి భంగం కలిగించబోదని, రాజకీయ కక్ష సా ధింపు చర్యలు ఉండబోవని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు దేశ వ్యాప్తంగా ఈ చట్టం అమలులో ఉన్నదని, ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో ఈ బిల్లును ప్రవేశపెట్టామని వివరించారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, ఈ చట్టం అందరి కీ వర్తిసుందని స్పష్టం చేశారు. సభలో ఈ బిల్లుపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో తరువాయి 2లో

### పశ్చిమ ఆసియాలో యుద్ధ నివారణకు

### కేంద్రం చొరవ తీసుకోవాలి

*తీర్మానానికి శాసన సభ ఏకగ్రీవ ఆమోదం*

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కొనసాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ శాసనసభ కోరింది. ఈ మేరకు సోమవారం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఒక తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పశ్చిమ ఆసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య మొదలైన ఈ యుద్ధం అనేక రూపాంతరాలు చెంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుందన్నారు. క్రూడాయిల్ తరువాయి 2లో

### ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా సెక్షన్లు : కూనంనేని

సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ బిల్లులలోని సెక్షన్లు ప్రజాస్వామ్యానికి వ్య తిరేకంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాన్ని ప్రవేశపెట్టే విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు. 5వ నిబంధన ప్రకారం తమ సిపిఐ వాట్సాప్ గ్రూప్‌లో ఎవరైనా పోస్ట్ చేస్తే అందుకు బాధ్యులుగా పోస్ట్ చేసిన వ్యక్తితో పాటు మొత్తం పార్టీని, పార్టీ కార్యదర్శిపై కూడా కేసు నమోదు చేస్తారని వివరించారు. ప్ర స్తుతం ఉన్న చట్టాలు సరిపోతాయని, ఈ బిల్లులోని అనే క అంశాలపై స్పష్టత లేదన్నారు. తప్పు చేసిన వారికే వర్తిస్తుందని చెబుతున్నారని, ఇంతకు ఆ తప్పుకు నిర్వచనం ఏమిటని తరువాయి 2లో

## తెలంగాణలోఏ ఒక్క ప్రాజెక్ట్‌కూ జాతీయ హోదా ఇవ్వలే



కేంద్రంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపాటు

రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధనకోసం అందరం కలిసి ఢిల్లీకి పోదామని శాసన సభలో సభ్యులకు సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదాను సాధించుకునేందుకు అందరం కలిసి ఢిల్లీకి పోదామని, ఆ దిశగా ప్రయత్నిద్దామని సూచించారు. రాష్ట్రాల హక్కు ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాకుండా చేస్తున్నారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము సమాఖ్య స్ఫూర్తితో కొనసాగిస్తూ ప్రజాస్వామికంగా ముందుకు వెళ్తున్నామని భట్టివిక్రమార్క అన్నారు. శాసనసభలో సోమవారం 'తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు' పై జరిగిన చర్చకు, పలువురు సభ్యులు ప్రస్తావించిన అంశాలకు భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా తరువాయి 12లో

## బస్తర్‌లో నక్సలిజాన్ని దాదాపు నిర్మూలించాం



- ఈ ప్రాంతంలో రేషన్ షాపులు,స్కూళ్ళు తెరుస్తాం
- నిర్మూలన ఘనత భద్రతాదళాలు,గిరిజన ప్రజలదే
- లోక్‌సభలో అమిత్ షా ప్రకటన

**న్యూఢిల్లీ:** బస్తర్‌లో నక్సలిజాన్ని దాదాపు నిర్మూలించామని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభలో ప్రకటించారు. వామ పక్ష తీవ్రవాద కార్యకలాపాలనుండి విముక్తి చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా సమాధానం చెబుతూ, దేశంలో నక్సలిజం నిర్మూలనకు చేసిన కృషి ఘనత,గొప్పతనం కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు ప్రత్యేకించి కోబ్రా, సిఆర్‌పిఎఫ్, సెక్యూరిటీ ఏజన్సీలు,ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డిఆర్‌జి సిబ్బంది,గిరిజన ఆవాస ప్రజలకే దక్కుతుందని ప్రశంసించారు. ఈనాడు దేశంలో నక్సలిజాన్ని ముఖ్యంగా బస్తర్ ప్రాంతం నుండి దాదాపుగా నిర్మూలించామన్నారు. ఈ ప్రాంతంలోని ప్రతి గ్రామంలో నూ స్కూలు భవనాలు నిర్మిస్తామని, ఈ మేరకు విస్తృత ప్రచారం చేశామన్నారు. బస్తర్‌లోని ప్రతి గ్రామంలోనూ తరువాయి 12లో

## అసంఘటిత కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- 58 ఏళ్ల తర్వాత వారికి కనీస పెన్షన్ రూ.10-15 వేలు అమలు చేయాలి
- గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లు-2026పై చర్చలో ప్రభుత్వానికి సిపిఐ శాసన సభాపక్షనేత కూనంనేని విజ్ఞప్తి
- న్యాయవాదుల రక్షణకు చట్టం తేవడం అభినందనీయమని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 2 కోట్లకు పైగా ఉన్న అసంఘటిత కార్మికులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు 58 ఏళ్ల తర్వాత వారికి కనీసం రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు పెన్షన్ అమలు చేయాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో సోమవారం తెలంగాణ ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లు2026పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిక్కు మొక్కు లేని గిగ్ కార్మికుల కోసం ప్రభుత్వం చట్టం తీసుకురావడం అభినందనీయమన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు భద్రత కల్పించడం వారికి ఎంతో మేలు చేయనుందన్నారు. వ్యక్తి కేంద్రంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని, అలా ఉంటే ప్రతి వర్గానికి న్యాయం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న అసంఘంటిత రంగ కార్మికులందరిని పిఎఫ్ పరిధిలోకి తీసుకురావాలని, 58 ఏళ్ల తర్వాత వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇది తరువాయి 2లో



## టూరిజంలో అక్రమాలు

- ఏడాది కాలంలో బోటింగ్ రంగం ద్వారా రూ.1.48 కోట్లకు గండి
- నాగార్జున సాగర్ బోటింగ్ కేంద్రంలో నకిలీ టిక్కెట్ బుక్కులతో లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయం కొల్లగొట్టిన ఇన్‌చార్జ్
- విధుల నుంచి తొలగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణ పర్యాటక శాఖలో బయట పడుతున్న వరుస కుంభకోణాలు ఆ శాఖ అధికారులను విస్మయానికి గురి చేస్తున్నాయి. రెండేళ్ల వ్యవధిలోనే నాలుగు కేసులు నమోదు కావడం, మరోపక్క ఆరుగురు అధికారులపై వేటుపడడం జరిగింది. తాజాగా బోటింగ్ రంగంలో కోటిన్నర రూపాయలు నష్టం జరిగింది. ఈ కుంభకోణంపై ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తున్నారు. తెలంగాణలోని 27 పర్యాటక కేంద్రాల్లో దాదాపు 99 బోట్లను నడిపిస్తున్న పర్యాటక శాఖ 2024లో బోటింగ్ ద్వారా రూ.14.60 తరువాయి 12లో

## వ్యక్తిగత సమాచారం గోప్యం

పథకాల లబ్ధికి ఉపయోగించొద్దు : జనగణన కమిషనర్

05



### శాసన మండలి సభ్యత్వానికి..

## నితీశ్ రాజీనామా

**న్యూఢిల్లీ :** పాట్నా: బిహార్ సీఎం నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇటీవల రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వదులుకున్నారు. సిఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చేయనున్నారు. మార్చి 16న బిహార్ స్థానాలకు జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో నితీశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే రెండు సభల్లో సభ్యత్వం కలిగి ఉన్నప్పుడు, తరువాయి 12లో




### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

## సింగరేణి సిరిని దోచుకుంటున్నాయ్

12



సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి: తీవ్ర ఉద్రిక్తం

సింగరేణి నేతలు, కార్మికులు - పోలీసుల మధ్య తోపులాట

## పరస్పర దాడులు విస్తృతం

# పెరిగిన యుద్ధ భయం



- ట్రంప్ గగనతల మార్గంలో కలకలం సృష్టించిన డ్రోన్,పౌర విమానం
- ఫ్లోరిడాలో ఎలర్ట్‌ఃరంగంలోకి ఎఫ్-16 విమానాలు
- ఇజ్రాయెల్ పారిశ్రామిక వాడపై క్షిపణి దాడులు
- అమెరికా-ఇజ్రాయెల్ అధికారుల ఇళ్ళపై దాడులు:ఐఆర్‌జిసి హెచ్చరిక
- ఇజ్రాయెల్ హైఫా ఆయిల్ రిఫైనరీ ధ్వంసం
- తబ్రిజ్ నగరంలో కెమికల్ ప్లాంట్, ఏర్‌పోర్ట్ ధ్వంసం

**దుబాయ్:** పశ్చిమాసియాలో అమెరికా కొత్త సేనలను మోహరించడంతో యుద్ధ భయం మరింతగా విస్తరించింది. 31వ రోజు సోమవారం యుద్ధంలో గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలు,మౌలిక సదుపాయాలపై ఇరాన్ విస్తారంగా డ్రోన్లు, క్షిపణి దాడులు చేసింది. ఇరాన్, హెజ్బొల్లా క్షిపణి దాడులతో ఉత్తర ఇజ్రాయెల్ కోస్తా రేవు నగరం హైఫాలోని బాజన్ ఆయిల్ రిఫైనరీలో మంటలు చెలరేగాయి. ఆకాశంలో నల్లటి పొగలున కమ్ముకున్నాయి. ఇరాక్‌లో ఉన్న విక్టరీ బేస్‌పై ఇరాన్ దాడులు చేయగా, ఇరాన్‌లో ప్రభుత్వ మౌలిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ విధ్వంసానికి పాల్పడింది. దీంతో ఇరాన్‌లో విద్యుత్ సంక్షోభం తలెత్తింది. టెహ్రాన్‌లో క్రీడా మందిరం, స్కూలుపై అమెరికా గగనతల దాడులు చేసింది. ఉత్తర ఇరాన్‌లో వరుస పేలుళ్ళు సంభవించాయి. విధ్వంసం కొనసాగుతుండగా, వాయువ్య ఇరాన్‌లోని అతిపెద్ద తరువాయి 2లో

## సైకిల్‌పై వెళ్ళి పారిస్ మేయర్‌గా

# బాధ్యతలు చేపట్టిన వామపక్షనేత

**పారిస్:** ఫ్రాన్స్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరీ మోగించిన వామ పక్ష, సోషలిస్టు నాయకులు పదవీ బాధ్యతలు తీసుకోవడం ప్రారంభించారు. ఇందులో భాగంగా మళ్ళీ విజయం సాధించిన పారిస్ సిట్టింగ్ మేయర్ ఇమ్మాన్యుయెల్ గ్రెగోయిర్ ఎంతో ఉన్నత విలువలు పాటించారు. ఎలాంటి ఆర్భాటాలు,మందీమార్బలం వెంట లేకుండా తాను ఒక్కడే సైకిల్ తొక్కుకుంటూ నిరాడంబరంగా సిటీ హాల్‌కు చేరుకుని పదవీ బాధ్యతలు తీసుకున్నారు. మార్చి 22వ తేదీన జరిగిన పారిస్ మేయర్ ఎన్నికల్లో గ్రెగోయిర్ 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సంపాదించారు. గ్రెగోయిర్ విజయం ద్వారా దేశ రాజధానిలో సోషలిస్టులకు సుదీర్ఘకాలంగా ఉన్న ఆధిపత్యాన్ని నిలబెట్టి ఆ వారసత్వాన్ని కొనసాగించారు. ఆయన విజయం పారిస్‌లో వామపక్షాలు 25 సంవత్సరాలుగా కొనసాగిస్తున్న పరిపాలనకు చిహ్నం.



పారిస్, మార్సెయిల్, లియోన్ నగరాలలో మేయర్ పదవులను తిరిగి చేజిక్కించుకుని తమ ప్రాధాన్యతను, నియంత్రణను,ఆధిపత్యాన్ని రుజువుచేశారు. లిల్లే,రెన్నెస్ వంటి కీలక నగరాలలో సోషలిస్టులు ఆధిపత్యం నిలబెట్టుకున్నారు. అతిపెద్ద నగరాల్లో మేయర్ పదవులను వామపక్షాలు తిరిగి కైవసం చేసుకున్నాయి.ఈ విజయాలు అత్యంత ఉత్తేజకరమైనవిగా పేర్కొంటూ ''పారిస్ నగరం ఎన్నటికీ మితవాదుల వశం కాబోదు'' అని గ్రెగోయిర్ వ్యాఖ్యానించారు. పారిస్ నగరం తన గత చరిత్రకు కట్టుబడే ఉంటుందని అన్నారు. మార్సెయిల్ నగరంలో కూడా ప్రస్తుత మేయర్ బెనోయిట్ పాయన్ అత్యంత సునాయాసంగా తిరిగి విజయం సాధించారు. వచ్చే ఏడాది దేశాధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరింతగా జరుగుతాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. హవ్రేలో మళ్ళీ ఘన విజయం సాధించిన ఎడ్వర్డ్ ఫిలిప్ వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో మితవాద నేషనల్ ర్యాలీకి వ్యతిరేకంగా అత్యంత శక్తిమంతమైన అభ్యర్థిగా బరిలోకి రానున్నారు.నేషనల్ ర్యాలీ తరపున మెరైన్ లీపెన్ లేదా జోర్డాన్ బార్డెల్లా అభ్యర్థిగా ఉండే అవకాశం ఉంది.

## మనీ లాండరింగ్ కేసులో ముగ్గురు

# నేపాల్ మాజీ ప్రధానులపై విచారణ ప్రారంభం

కాఠ్మండు: మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై ముగ్గురు మాజీ ప్రధానమంత్రులతో సహా మరో ఇద్దరు మాజీ మంత్రులపై కూడా నేపాల్‌లో సమగ్ర విచారణ ప్రారంభమైంది. ఒకవైపు మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి, మాజీ హోంమంత్రిపై కేసులు నమోదయ్యాయి. జనరేషన్ జెడ్ ఉద్యమాన్ని అణచివేసి మానవతా ఉల్లంఘనకు పాల్పడ్డారని కె.పి.శర్మ ఓలీ,మాజీ హోంమంత్రిపై పెట్టిన కేసులు చట్ట విరుద్ధమైనవని పేర్కొంటూ ఆ దేశ సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లపై సుప్రీంకోర్టు విచారణ జరుపనున్నది. ఇదే సమయంలో మనీ లాండరింగ్ కేసు దర్యాప్తు కూడా మొదలైంది. నేపాల్‌లో ఈ విధంగా పాలక రాజకీయ అధిపతులు మనీలాండరింగ్ కేసు విచారణ ఎదుర్కోవడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి.

ఈ కేసులో మాజీ ప్రధానమంత్రులు కె.పి.శర్మ ఓలి, పుష్ప కమల్ దహల్ (ప్రచండ), షేర్ బహదూర్ దేవ్‌బా, మాజీ మంత్రులు అర్జూ రాణా దేవుబా, దీపక్ ఖడ్కాలపై నేపాల్ పోలీసుల సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో సహాయంతో మనీ



లాండరింగ్ విభాగం ఈ విచారణ ప్రారంభించింది. పోలీసు ప్రధాన కార్యాలయానికి మనీలాండరింగ్ విభాగం రాసిన లేఖ మేరకు పోలీసులు ఆదివారం మంత్రి ఖడ్కాను ఆయన నివాసం నుండి అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. ఈ కేసు ఈ స్థాయికి చేరుకోవడానికి ముందు గత ఆరునెలలుగా చాపకింద నీరుగా ముమ్మరంగా ప్రాథమిక దర్యాప్తు కొనసాగింది.

2025 సెప్టెంబరునెలలో జనరేషన్ జెడ్ ఉద్యమ సమయంలో ఉద్యమకారులు ఈ నాయకుల ఇళ్ళపై దాడులు చేశారు. ఇళ్ళను దగ్ధం చేశారు. ఈ సమయంలో కాలిపోయిన కరెన్సీ నోట్లు బయట పడటంతో అప్పటినుండీ అధికారులు తమ దర్యాప్తు ముమ్మరం చేశారు.

# విద్యుత్ కేంద్రాలు, చమురు బావులు నేలమట్టం

మాకు ఆయిల్ కావాలి

ఖర్గ్‌ను స్వాధీనం చేసుకుంటాం

ఇరాన్‌కు మళ్ళీ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్ :** వీలైనంత త్వరగా ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లో ఉన్న విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తామని, చమురు బావులను బాంబు దాడులతో తుడిచిపెడతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక జారీ చేశారు. ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్ నుండి వాషింగ్టన్‌కు వెళుతూ విమానంలో సోమవారం పాత్రికేయులతో ట్రంప్ మాట్లాడారు. ఒకవేళ మొజ్తాబా ఖమేనీ బ్రతికి ఉంటే ఆయన చాలా తీవ్రంగా గాయపడి ఉంటారని ట్రంప్ అన్నారు. ఇరాన్ సర్వాధినేతగా నియమితుడైన మొజ్తాబా చాలా సురక్షితంగా రష్యాకు చేరుకుని శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారని విస్తారంగా వార్తలు వెలువడుతున్న తరుణంలో ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు. తాను ప్రతిపాదించిన 15 అంశాల ప్రణాళికపై ఒప్పందానికి రావాలని, లేకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించిన ట్రంప్ ఇప్పటివరకూ మూడు విడతలుగా ఇరాన్‌కు మొత్తం 16 రోజులపాటు గడువు పొడిగించారు. ఈ గడువు ఏప్రిల్ ఆరో తేదీనాటికి ముగిసిపోతుంది. ఇరాన్‌లో కొత్త,హేతుబద్ధమైన ప్రభుత్వంతో అమెరికా చర్చలు కొనసాగిస్తోందని చెప్పారు. తమ ప్రణాళికను అంగీకరించి కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే ఇరాన్‌లో తాము ఇంకా తాకని ప్రదేశాలను నేలమట్టం చేస్తామని



అన్నారు. హోర్ముజ్ సమీపంలో ప్రపంచ దేశాలకు రవాణా చేసేందుకు ఎంతో అనుకూలంగా ఉన్న ఖర్గ్ ద్వీపంలో ఉన్న ఇరాన్ చమురు నిల్వల కేంద్రాన్ని స్వాధీనం చేసుకుంటామన్న హెచ్చరికను కూడా పునరావృతం చేశారు. ''మాకు ఇరాన్ చమురు కావాలి, ఇరాన్‌కు ఎంతో కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం'' అని చాలా స్పష్టంగా ఆయన అసలు రంగు బయట పెట్టారు. కాగా ఇంతకుముందు ట్రంప్ చెప్పినవిధంగానే 15 అంశాల ప్రణాళికకు ఇరాన్ అంగీకారం తెలియజేసిందని, త్వరలోనే ఒక ఒప్పందం కుదురుతుందని మరోవైపు మళ్ళీ వార్తలు రావడం ప్రారంభమయ్యాయి. చాలా డిమాండ్లను ఇరాన్ ఒప్పుకుందని, పాలనా మార్పుల దిశగా ఇరాన్ ప్రయాణం చేస్తోందని ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పినట్లు ఫైనాన్సియల్ టైమ్స్ (ఎఫ్.టి) పత్రిక పేర్కొంది. ఇరాన్ చమురు తమకు కావాలి,ఖర్గ్‌ను ఆక్రమిస్తాం అని ట్రంప్ చెప్పారని ఎఫ్.టి. పేర్కొంది.

**పశ్చిమాసియాలో 60వేలకు పెరిగిన అమెరికా సైనికుల సంఖ్య**

పశ్చిమాసియా ప్రాంతానికి కొత్తగా వేల సంఖ్యలో భూతల ఉభయచర సామర్థ్యంగల సైనికులను తరలించడంతో అక్కడున్న మొత్తం అమెరికా సైనికుల సంఖ్య 50,0000 దాటిపోయిందని న్యూయార్క్ టైమ్స్ (ఎన్‌వైటి) పత్రిక ప్రకటించింది. అణుసామర్థ్యంగల యుఎస్ఎస్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర నౌకతోపాటు 5000 మంది ఆదివారంనాటికి పశ్చిమాసియాకు చేరుకున్నారు. ఉభయచరాల తరహాలో భూతలంపైన, సముద్రరంగంలోనూ పోరాటం చేయగల ప్రత్యేక నైపుణ్యంగల ఈ సైనికులంతా హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు, ఖర్గ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే ఆపరేషన్‌లో పాల్గొంటారు. న్యూయార్క్ టైమ్స్ సమాచారం ప్రకారం 2,500 మంది మెరైన్లు, మరో 2,500 మంది నావికులు పశ్చిమాసియా జలాల్లో అడుగుపెట్టినట్టు ఎన్‌వైటిని ఉటంకిస్తూ రష్యన్ వార్తాసంస్థ టాస్ ప్రకటించింది.పశ్చిమాసియాలో ప్రస్తుతం సాధారణంకంటే 10,000 మంది అమెరికా సైనికులు ఎక్కువగా ఉన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాల్లో ఎప్పటినుండో 50,000 మంది సైనికులు తిష్ఠవేసి ఉన్నారు. ఐతే గెరాల్డ్ ఆర్.ఫోర్స్ నౌకలో ఉన్న 4,500 మంది సైనికులను కూడా కలిపితే ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. మార్చి రెండోవారం తర్వాత ఈ నౌకపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో నౌక బాగా దెబ్బతింది. ఈ నౌకకు మరమ్మతులు చేసేందుకు క్రొయేషియా అడ్రియాటిక్ తీరంలో ఉన్న స్ప్లిట్ ఓడరేవుకు తరలించారు.

# క్యూబా చేరుకున్న రష్యా చమురు నౌక

సంక్షోభ సమయంలో మానవతా సాయం

క్యూబాకు దూరంగా ఉండాలని

కోస్టారికాకు ట్రంప్ బెదిరింపు

**హవానా :** క్యూబాను లొంగదీసుకునేందుకు ట్రంప్ అష్టదిగ్బంధన జూదం ఆడుతున్నప్పటికీ సోషలిస్టు దేశాలు ఆ దేశానికి అండగా నిలబడుతున్నాయి. ఈ చర్యల్లో భాగంగా రష్యా నుండి ఒక చమురు నౌక క్యూబా ప్రత్యేక ఆర్థిక మండలి ప్రాంతానికి చేరుకుంది. రష్యా నౌక క్యూబా వెళ్ళి ఆ దేశానికి ఇంధన సహాయం చేసేందుకు ట్రంప్ తన అంగీకారం తెలియజేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని న్యూయార్క్ టైమ్స్ (ఎన్‌వైటి) పత్రిక ఒక కథనం రాసుకొచ్చింది.మానవతా దృక్పథంతో అప్పుడప్పుడు ఇతర దేశాలు క్యూబాకు చమురు,ఇతర విధాలుగా సహాయం చేస్తే అమెరికా ఎప్పటికీ వ్యతిరేకించదని డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు ఎన్‌వైటి పేర్కొంది. ''మా ట్యాంకర్ ఒకటి అక్కడ ఉంది, ఎవరైనా ఓడనిండా చమురు తెచ్చుకోవడానికి మాకు అభ్యంతరం లేదు, క్యూబా కూడా బ్రతికాలి కదా'' అని ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్ బీచ్ నుండి వాషింగ్టన్‌కు వెళుతూ విమానంలో పాత్రికేయులకు ట్రంప్ చెప్పారని ఎన్‌వైటి పేర్కొంది. ''ప్రస్తుతం క్యూబాకు ఏ దేశమైనా చమురు, ఇతర సహాయం పంపాలనుకుంటే నాకు ఎలాంటి అభ్యంతరం లేదు, అది రష్యా కావచ్చు, మరో దేశం కావచ్చు...'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ''ఈ తాత్కాలిక ఇంధన సరఫరాల వల్ల క్యూబాలో సంక్షోభం పరిష్కారం కాదు, ఈ సరఫరాలు ఎలాంటి ప్రభావం చూపించవు, క్యూబా పని ఐపోయింది'' అని ట్రంప్ అన్నారు. ఐతే పశ్చిమాసియాలో సమస్య పరిష్కారం తర్వాత తన పూర్తి దృష్టిని క్యూబా మీదే కేంద్రీకరిస్తానని ఆయన అన్నారు. క్యూబాను లొంగదీసుకోవడమే లక్ష్యంగా ఆయన పావులు కదుపుతున్నారు. క్యూబాలో వామపక్ష కమ్యూనిస్టు ప్రభుత్వ పాలనను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. క్యూబాలో తమకు అనుకూలమైన పరిపాలకులను నియమించుకుంటామని ఆయన గతంలో కూడా ఉద్ఘాటించారు. ఇదే సమయంలో క్యూబాతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న కోస్టారికా దేశానికి ట్రంప్ బెదిరింపులు చేయడంతో ఆ దేశం క్యూబాతో తన సంబంధాలను రద్దు చేసుకుంది. క్యూబా రాజధాని హవానాలో ఉన్న కోస్టారికా దౌత్య కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. క్యూబాతో సంబంధాలను పరిమితం చేసుకుని, ఏప్రిల్ ఒకటో తేదీ నుండీ కాన్సులర్ స్థాయిలో సంబంధాలు కొనసాగిస్తామని ప్రకటించింది.

## కేంద్రం చొరవ తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

(పెట్రోల్, డీజిల్, గ్యాస్) ఉత్పత్తి రవాణాలపై యుద్ధం ప్రభావానికి గురై సరఫరాపై ప్రభావం పడడంతో తద్వారా ప్రతీ దేశ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేస్తున్నాయన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్, లెబనాన్‌పై అలాగే ఇరాన్ కూడా గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలలో ఉన్నటువంటి అమెరికాకు చెందిన రక్షణ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడి కొనసాగించడంతో ఈ యుద్ధంలో ఇప్పటికే 4 వేల మంది అమాయకులు మరణించారని వివరించారు. ఈ మరణాలు ఆ దేశాలకే పరిమితమైనప్పటికీ ఆర్థిక విధ్వంసం మాత్రం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తుందని, ముఖ్యంగా ఆసియా దేశాలకు మరింత ప్రమాదకరంగా మారిందన్నారు. భారతదేశంపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతోందని ఇంతటితోనైనా ఈ యుద్ధాన్ని ఆపకపోతే ప్రపంచ భవిష్యత్తు ఆందోళనకరంగా మారనుందని, ఇది మూడో ప్రపంచ యుద్ధానికి కూడా దారితీయవచ్చని పేర్కొన్నారు. ఇది ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు అని, ఇలాంటి అత్యంత ప్రమాదకర పర్యవసనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని యుద్ధాన్ని ఆపడానికి ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి తగిన చొరవ తీసుకోవాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.

## ఏవియేషన్ రంగంలో మెరుగైన అవకాశాలు

వే ఫర్ స్కై చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రైహాన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏవియేషన్ రంగంలో భారతదేశంలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని వే ఫర్ స్కై చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రైహాన్ రెసక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైహాన్ రెసక్ మాట్లాడుతూ విద్యార్థులకు పైలట్ కావాలన్న ఆకాంక్ష ఉంటుందని, కాని అది నెరవేర్చుకునే వేదిక తెలియక చాలా మంది వెనుకబడి పోతున్నారన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఏవియేషన్ ఎక్స్‌పోకు 900 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారికి ఏవియేషన్ రంగంపై అవగాహన కల్పించామన్నారు. నగరంలో నాలుగు ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు ఉన్నాయని, హైదరాబాద్ ఏవియేషన్ హబ్‌గా మారుతోందని తెలిపారు. విశ్రాంత డీజీసీఏ అధికారి అరవింద్ తప్లియాల్ మాట్లాడుతూ పైలట్ కావాలంటే డబ్బు ఉన్న వారే కాదు, పేద, మధ్యతరగతి విద్యార్థులకు సైతం అవకాశం కల్పించాలన్నది తమ లక్ష్యమన్నారు. ఇతర దేశాల్లోనూ పైలెట్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారి లైసెన్సులు భారతదేశంలోనూ పనిచేస్తాయని తెలిపారు. దేశంలో ఏవియేషన్ రంగాన్ని మరింత విస్తృతం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ ఫ్లైట్ అకాడమీ ప్రతినిధి కెప్టెన్ యోహాన్, ఉరుగ్వే, జోహాన్స్ బర్గ్, శ్రీలంక దేశాలకు చెందిన ప్రతినిధులు మారియో సంతోష్, కెప్టెన్ మూసా ధనుంజయ వీరసింహా, స్కై ప్రో అకాడమీ ప్రతినిధి రిషబ్, పునీత్, అంబిక తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన యుద్ధ భయం

(మొదటి పేజీ తరువాయి)

నగరం తబ్రిజ్‌లో పెట్రోకెమికల్ ప్లాంట్‌పైన,అంతర్జాతీయ విమానాశ్రయంపైన ఇజ్రాయెల్–అమెరికా క్షిపణులు దాడులు చేశాయి. గల్ఫ్ వ్యాప్తంగా ఉన్న అమెరికా, ఇజ్రాయెల్ అధికారుల నివాసాలపై దాడులు చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హెచ్చరించింది. లెబనాన్‌లో ఐక్యరాజ్య సమితి శాంతిదళ సైనికుడు ఇజ్రాయెల్ దాడుల్లో మరణించాడు. దీంతో ఇజ్రాయెల్ చర్యను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్రంగా ఖండించారు. ఖతార్‌లో అమెరికా దౌత్య కార్యాలయ సిబ్బంది చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక జారీ చేశారు. అత్యవసర సిబ్బందితప్ప ఎవ్వరూ ఉండకూడదని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇజ్రాయెల్‌లోని బీర్‌షెబా ప్రాంతంలో ఇరాన్ చేసిన క్షిపణి దాడిలో 13 మంది ఇజ్రాయెలీ పౌరులు గాయపడ్డారు.

ఫ్లోరిడా రాష్ట్రంలో గుర్తుతెలియని డ్రోన్ కలకలం సృష్టించింది. వెస్ట్‌పామ్ బీచ్ నుండి వాషింగ్టన్‌కు ట్రంప్ ప్రయాణం చేసే ఎయిర్‌ఫోర్స్–1 విమాన ప్రయాణమార్గంలో సోమవారం ఒక గుర్తు తెలియని డ్రోన్ కలకలం సృష్టించింది. ఈ డ్రోన్ రెండు సార్లు ఆయన విమానమార్గంలో ఉల్లంఘటనకు పాల్పడటంతో ఉత్కంఠ రేగింది. ఫ్లోరిడా రాష్ట్రంలో భద్రతా ఆందోళన నెలకుంది. వాషింగ్టన్‌కు ట్రంప్ విమానం బయలుదేరడానికి కొద్ది నిమిషాల ముందు అనుమానాస్పద డ్రోన్ కనిపించిందన్న నివేదికలతో గగనతలాన్ని సురక్షితం చేయడానికి అత్యవసర నిబంధనల అమలు, వేగంగా హెలికాప్టర్లను రంగంలోకి దించడం, ట్రంప్ విమానాన్ని నిలిపివేయడం వంటి అనేక పరిణామాలకు ఈ పరిస్థితి దారితీసింది. ఈ పరిస్థితులు కొనసాగుతుండగా కొద్ది క్షణాలకే ఒక పౌర విమానం ట్రంప్ విమాన మార్గంలో నిషేధిత గగనతలాన్ని ఉల్లంఘించడంతో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. దీంతో నార్త్ అమెరికన్ డిఫెన్స్ ఏరోస్పేస్ కమాండ్ అప్రమత్తమై ఎఫ్–16 యుద్ధ విమానాలను రంగంలోకి దించింది. ఎఫ్–16 యుద్ధ విమానాలు ఆ పౌర విమానాన్ని అడ్డగించి ఫ్లేర్లు ఉపయోగించి సురక్షితంగా గమ్యానికి తరలించింది. ఇక ట్రంప్ విమాన మార్గానికి ఎలాంటి భయం లేదని నార్త్ కమాండ్ ప్రకటించినప్పటికీ ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన ట్రంప్ విమానం చుట్టూ ఉన్న భద్రతావలయంపై అనేక సందేహాలు చోటుచుకున్నాయి.

**కువైట్‌లో విషాదం**

**క్షిపణి దాడిలో భారత కార్మికుడు మృతి**

ఇక కువైట్‌లో విషాదం చోటు చేసుకుంది. కువైట్‌లో విద్యుత్, నీటి శుద్ధి కర్మాగార కేంద్రంపై ఇరాన్ సోమవారం క్షిపణి దాడులు చేసింది. ఆ పక్కనే ఒక సర్వీస్ భవనం కూడా ఉంది. క్షిపణి దాడి తీవ్రతను తట్టుకోలేక భారతీయ కార్మికుడు మరణించాడు. భద్రతా కారణాల రీత్యా ఈ విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారం ఎక్కడ ఉందనే విషయాన్ని కువైట్ ప్రభుత్వం ప్రకటించలేదు. గల్ఫ్‌లో ఒక్కవారంలోనే రెండో భారతీయ కార్మికుడు మరణించడంపై భారత దౌత్యకార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. మృతుడి వివరాల సేకరణ ప్రారంభించింది. కాగా ఇరాన్‌లో దాడులకు గురైన ఖాన్‌డాబ్ నీటి శుద్ధి కర్మాగారం ఇక పనిచేయడం సాధ్యం కాదని ఐఎఇఎ (అంతర్జాతీయ అణుఇంధన సంస్థ) ప్రకటించింది. దక్షిణ ఇజ్రాయెల్ పారిశ్రామిక వాడపై ఇరాన్ క్షిపణి దాడులు చేయగా బీరూట్ అంతటా ఇజ్రాయెల్ సైనిక దాడులు కొనసాగాయి. నెలరోజులుగా ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంవల్ల 1,340 మంది మరణించారు. మరో 3,500 మంది గాయపడ్డారు.

యుద్ధం ఇంకా పెరిగిపోతుందని భయాలు పెరగడంతో చమురు ధర సోమవారం ఒక్కసారిగా బ్యారెల్‌కు 115 డాలర్లకు పెరిగింది. భారత్ రూపాయి కూడా యుద్ధంవల్ల వేగంగా పతనమవుతూ సోమవారంనాటికి డాలరుతో పోలిస్తే మారకం విలువ 95.22 రూపాయల హీనస్థాయికి చేరింది. ఈ పరిస్థితుల్లో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ వ్యాపారవేత్తలతో టెన్ డౌనింగ్ స్ట్రీట్‌లో కీలక సమావేశం జరిపారు. ఈ యుద్ధం మనది కాదని, ఈ యుద్ధంతో మనకు ఎలాంటి సంబంధం లేదని మరోసారి ఆయన స్పష్టం చేశారు.

## స్వతంత్ర వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిలయ్య, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి సోమవారం శాసన మండలిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జర్నలిస్టులతో సిఎం రేవంత్ రెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ ఉత్పత్తిపై ధర నిర్ణయించే అధికారం లేని ఏకైక ఉత్పత్తి దారుడువ్యవసాయదారుడు మాత్రమేనని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఎస్‌పి విధానాన్ని1950–60లలో ప్రవేశపెట్టి రైతులకు కొత్త ఊపిరిని ఇచ్చిందని ఆయన అన్నారు. అలాగే అందరికీ ఆహారం అందించే లక్ష్యంతో ప్రజాపంపిణీ వ్యవస్థను కూడా కాంగ్రెసే ప్రారంభించిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో రేషన్ షాపుల్లో పంపిణీ చేసే దొడ్డు బియ్యం తినడం లేదని, దీనిని అదునుగా తీసుకొని సబ్సిడీ బియ్యాన్ని తక్కువకే కొన్నుకునే మాఫియా తయారైందన్నారు. అందుకే అందరు తినే విధంగా సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించి, 2025 మార్చి 30న ప్రారంభించామని రేవంత్ రెడ్డి తెలిపారు. దీని కోసం ఏటా రూ.14, 560 కోట్లు ఖర్చు చేస్తున్నామని, రాష్ట్రంలోని 3.39 కోట్ల మంది (86 శాతం జనాభా) సన్నబియ్యం పథకాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. దేశంలో మొదలు పెట్టిన నాడు 2.80 కోట్ల లబ్దిదారులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 3.39 కోట్లకు పెరిగిందని, భవిష్యత్తులో వంద శాతం జనాభాకు ఇవ్వాలన్నా కూడా సన్నబియ్యం అందిస్తామన్నారు. అటు సన్న బియ్యానికి బోనస్, ఇటు ఉచితంగా సన్న బియ్యం సరఫరాతో మార్కెట్‌లో సన్న బియ్యం రేటు కిలోకు రూ.60 నుంచి రూ.45కి తగ్గిపోయిందన్నారు. అలాగే సన్న వడ్ల విస్తీర్ణం, దిగుబడి పెరిగిందని, రైతులు ఇతర వాణిజ్య పంటలు కూడా పండిస్తే, దాని ఆధారంగా పప్పు, ఇతర నిత్యావసరాలను కూడా రేషన్ షాపు ద్వారా పంపిణీ చేసే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. తెలంగాణ నేలలో జిల్లాకు ఒక పంట పండించే భౌగోళిక పరిస్థితులు ఉన్నాయని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం, తదితరులతో టాస్క్ ఫోర్స్ వేయించి, సమగ్ర వ్యవసాయ ప్రణాళిక కోసం అధ్యయనం చేయిస్తామని, కమిటీ సిఫార్సుల ద్వారా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏయే జిల్లాల్లో, ఏయే నేలలో ఏ పంటలు పండుతాయో వారి నిపుణుల కమిటీ అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. గతంలో కెసిఆర్ కూడా వరి వద్దు అని అన్నారు, మీరు అదే మాటను చెబుతున్నట్లుందనే ప్రశ్నకు సిఎం రేవంత్ రెడ్డి బదులిస్తూ, తాను కెసిఆర్‌లాగా బలవంత పెట్టనని, విషయం చెప్పి రైతులే మారే విధంగా అర్థమయ్యేలా చేస్తామన్నారు.

**నియోజకవర్గాల పెంచితే దక్షిణాదికి నిధులు రావు:** నియోజవర్గాల పునర్విభజన కింద నియోజకవర్గాల పెంప, మహిళా రిజర్వేషన్, జమిలీ ఎన్నికలు అనే అంశాలు ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఉన్న లోక్‌సభ 543 స్థానాలకు అదనంగా 50 శాతం సీట్లు కలిపి, 815కు పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తుందన్నారు. అయితే, పెరిగే సీట్లు, మహిళా రిజర్వేషన్‌ల కింద కేటాయించే సీట్లు రెండే 272 సీట్లే అవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో 411, దక్షిణ భారతదేశంలో 132 లోక్‌సభ సీట్లు ఉన్నాయని, రెండిటి మధ్య తేడా 279 సీట్లు అని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 50 శాతం సీట్ల పెంపుతో ఉత్తరాదిలో సీట్ల సంఖ్య 616, దక్షిణాదిలో 198 అవుతుందని, కానీ తేడా గతంలో కంటే భారీగా పెరిగి 418 అవుతుందని వివరించారు. గతంలో వాజ్‌పేయి ఒక్క ఓటు(సీటు)తేడాతో వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోయిందని, ఇంత తేడా ఉంటే , దక్షిణాది రాష్ట్రాలలో ఒక్క సీటు లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడుతాయన్నారు. ఇప్పటికే దక్షిణాది పట్ల రాజకీయ, ఆర్థిక వ్యత్యాసాలను కేంద్రం చూపిస్తోందని, 50 శాతం స్థానాలు అక్కడ పెరిగితే దక్షిణ భారతదేశాన్ని అసలు పట్టించుకోదని, బండి సంజయ్‌కు మళ్ళీ మంత్రి పదవి కూడా రాదని చెప్పారు. రాష్ట్రపతి పాలన పెట్టి పునర్విభజన కోసం తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అంటున్నాడని, తెలంగాణలో పెట్టినప్పుడు బిజెపి పాలిత రాష్ట్రాలలో పెట్టరా అని ఆయన ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నందునే లక్ష్మణ్ ఉత్తరాదికి లబ్ది చేకూరే ప్రతిపాదనకు మద్దతిస్తున్నాడని, నిజాయితీ ఉంటే రాజీనామా చేసి పో రాడాలన్నారు.

**కెసిఆర్ వల్లే నాకు గుర్తింపు :** రావణుడు ఉన్నందునే రాముడికి గుర్తింపు వచ్చిందని, శకుని ఉన్నందునే భారతంలో కృష్ణుడి పాత్రకు గుర్తింపు లభించిందని, అట్లాగే కెసిఆర్ ఉన్నందునే తనకు గుర్తింపు వచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. చెడు ఉన్నప్పుడే మంచికి గుర్తింపు లభిస్తుందని చెప్పారు.

**సన్నబియ్యం రేవంత్‌రెడ్డి బ్రెయిన్ చైల్డ్: ఉత్తమ్**

సన్నబియ్యం పథకం ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని, ఇది పూర్తిగా ఆయన బ్రెయిన్ చైల్డ్ అని పౌర సరఫరాల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. యుపిఎ చైర్‌పర్సన్‌గా సోనియగాంధీ అందించిన ఆహార భద్రతా చట్టానికి ఈ పథకం ద్వారా పూర్తి న్యాయం జరిగిందన్నారు. కాగా, సన్నబియ్యం ఆలోచన తనదైనా విజయవంతంగా అమలు చేసింది మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన శాఖ సిబ్బంది అని అన్నారు.

## కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయగలిగితే ఇంతకన్నా మంచి పని ఏది ఉండబోదన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని లెక్కలతో సహా ఆయన సభకు వివరించారు. వివిధ కులాల వారు తమకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, ఆలాంటి వారందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**న్యాయవాదుల రక్షణకు చట్టం తేవడం అభినందనీయం**

న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావడం అభినందనీయమని సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేనిసాంబశివ రావు అన్నారు. శాసనసభలో సోమవారం తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు2026పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సాంబశివరావు మాట్లాడుతూ అందరికీ న్యాయం దక్కేలా ధర్మం కోసం పనిచేస్తున్న న్యాయవాదులు భయంభయంగా తమ విధులను నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో వారికి రక్షణ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం సైతం ప్రభుత్వం కృషి చేయాలని, న్యాయవాదులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు యువ న్యాయవాదుల శిక్షణకు గాను అకాడమీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విప్తి చేశారు. యువ న్యాయవాదులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేల స్టైఫండ్‌ను రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచడంతో పాటు మహిళా న్యాయవాదులకు కోర్టు హాళ్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. న్యాయవాదులు మరణిస్తే ప్రస్తుతం ఇస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచడంతో పాటు ప్రమాద బీమాను రూ.25 లక్షలకు పెంచాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

### వ్యతిరేకంగా సెక్షన్లు : కూనంనేని

(మొదటి పేజీ తరువాయి)

కూనంనేని ప్రశ్నించారు. ఇప్పటికే దేశంలో ప్రజాస్వామ్యం నిర్బంధంలో ఉన్నదని, ఉపా చట్టంతో పాటు ఎన్ఐఎ కూడా కేసులు నమోదు చేస్తుందని, దీనికి తోడు కేంద్ర నిర్బంధాలకు రాష్ట్రం కూడా తోడవుతుందని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛపై, భాష, కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగాలపై దాడులు చేసే విధంగా ఈ బిల్లు ఉన్నదని, ఇలాంటి చట్టాలు బ్రిటీష్ కాలంలో ఉండేవని ఆయన అన్నారు. ఈ మధ్య కాలంలో మావోయిస్టుల సంతాప సమావేశానికి హాజరైన సిపిఐ నాయకులు మంద పవన్‌పై కేసు నమోదు చేశారని అన్నారు.

## సెలక్ట్ కమిటీకి

(మొదటి పేజీ తరువాయి)

ఈ బిల్లును పూర్తి స్థాయిలో పరిశీలించేందుకు 'సెలెక్ట్ కమిటీ'కి సిఫారసు చేస్తూ మంత్రి ప్రతిపాదించగా సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపిస్తున్నట్టు స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రకటించారు. అంతకుముందు బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ బిల్లు ద్వారా ప్రజాస్వామ్యం గొంతును నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని, సామాన్యులపై కక్ష సాధింపుచర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై కూడా కక్షపూరిత చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయని, అధికారులకు రక్షణ కవచంగా, సామాన్యులకు శిక్షగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం తీరు పోలీసు రాజ్యం వైపు వెళ్తున్నట్టుగా ఉందన్నారు. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని సూచించారు. ఎంఐఎం ఎంఎల్‌ఎ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా ఇప్పటికే ప్రజలలో విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ బిల్లు ద్వారా భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగే అవకాశాలు ఉన్నందున సెలెక్ట్ కమిటీకి పంపించాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు యశస్వినీరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో మహిళల పట్ల అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు కొత్త బిల్లు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, కానీ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని కోరారు.



## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విచారణ చేపట్టాలి

### బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ మైనింగ్, భూకబ్జాలకు పాల్పడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైన విచారణ చేపట్టాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామరావు, బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ఆధ్వర్యంలో ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైన విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ' మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని, అక్రమంగా జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నప్పటికీ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. శాసనసభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయని, మంత్రి పొంగులేటి వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్‌తో పాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయని కెటిఆర్ తెలిపారు. సిబిసిఐడి లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందనే నమ్మకం తమకు లేదని, అందుకే శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని లేదా ఒక ఇండిపెండెంట్ జుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతిపైన ఒక స్వతంత్ర విచారణ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జి, కేంద్ర ప్రభుత్వ సంస్థలతో విచారణకు ఆదేశించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్టు కెటిఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, పొంగులేటి అక్రమ మైనింగ్ భూకబ్జాల పైన త్వరలోనే తమ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

## కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తోంది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** "తెలంగాణ విలువ ఆధారిత పన్ను (సవరణ) బిల్లు 2026"ను శాసనసభ సోమవారం ఆమోదించింది. బిజెపేతర రాష్ట్రాలకు ఒక పద్ధతి, బిజెపి పాలిత రాష్ట్రాలకు మరో పద్ధతిగా కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని, రాజకీయ కోణంలోనే నిధుల కేటాయింపులు జరుగుతోందని విమర్శించారు. ఏ ప్రతిపాదికన ఒక్కో రాష్ట్రానికి కేంద్రం నిధులను కేటాయిస్తుందని ప్రశ్నించారు. ఈ బిల్లును ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిలయన్స్ పెట్రోల్ పంప్, బిపి మొబిలిటీ ద్వారా 2020 సంవత్సరం నుంచి రాష్ట్రానికి వ్యాట్ రావడం లేదని,సెకండ్ సెట్ కింద వ్యాట్ వసూలు చేసేందుకు ఇదివరకే జివోను జారీ చేశామని, దీనిని బిల్లు రూపంలోకి తీసుకొచ్చామని వివరించారు. 2025 జులై నుంచి 2026 ఫిబ్రవరి వరకు రూ.250 కోట్లను వసూలు చేశామన్నారు. అంతకుముందు రూ.220కోట్లు వచ్చేదన్నారు. రిలయన్స్ సంస్థ నుంచి బిపి మొబిలిటి సంస్థ పెట్రోలియంను కొనుగగోలు చేసి బంకులకు సరఫరా చేస్తుందని తెలిపారు. బిల్లు ద్వారా ఏడాదికి ప్రతి నెలా రూ.20 నుంచి రూ.47 కోట్లకు రాష్ట్ర ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. తమిళనాడు రాష్ట్రం కేంద్రానికి రూ.9,84,627 కోట్లు చెల్లిస్తే, తిరిగి కేంద్రం నుంచి రూ.2,56,000 కోట్లు, కర్నాటక ప్రభుత్వం రూ.16,17,530 కోట్లు చెల్లిస్తే, రూ2,44,480 కోట్లు వస్తుందని, మధ్యప్రదేశ్ రాష్ట్రం రూ.2,60,000 కోట్లు, రూ.4,86,000 కోట్లు వచ్చాయని, బిహార్‌లో రూ.90,663 కోట్లు చెల్లించగా, కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి రూ.6,23,425 కోట్ల నిధులను విడుదల చేశారని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఒక ఏడాది పాటు చార్జీలను ఎన్నికలు ఎక్కడ వస్తే అక్కడ తగ్గిస్తున్నారని, ఎన్నికల కోసమే ధరలు తగ్గిస్తున్నారని వివరించారు.

**రిలయన్స్ నుంచి ఎగ్గొట్టిన డబ్బులను వసూలు చేయండి : కూనంనేని**



సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రిలయన్స్ కంపెనీ 2025 జూన్ వరకు చార్జీలను చెల్లించకుండా తప్పించుకున్నారని, వారు ఎగ్గొటిన డబ్బులను రికవరీ చేస్తారా? అని ప్రశ్నించారు. రియలన్స్ ఎగ్గొటిన సొమ్మును జరిమానాతో సహా వసూలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాగే ఎగవేతలు, దుర్మార్గ పనుల వల్ల అదానీ, అంబానీలు లక్షల కోట్ల ఆదాయం సంపాదిస్తున్నారని, వారికి పెద్ద పెద్ద వారి అండదండలు ఉంటాయని, అందుకే వారు కావాలనుకున్నప్పుడే కుబేరులు అవుతారని, కానీ సామాన్యులను కాపాడేవారే లేరన్నారు. రాష్ట్రానికి ఉన్న నిధులు, రాష్ట్రం చేతిలో లేదని, కేంద్రం చేతుల్లోకి పోయిందన్నారు. యుద్ధం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ దొరికే పరిస్థితి ఉండబోదని, ముందస్తుగానే తగిన చర్యలు తీసుకోవాలని, ధరలు పెరగకుండా చూడాలని సూచించారు. పెట్రోల్, ఎక్సైజ్ చార్జీలను తగ్గించేందుకు ప్రయత్నిస్తే, ద్రవ్యోల్బణం నియంత్రణలోకి వస్తుందని, తద్వారా వ్యాపారాలు మళ్లీ పెరుగుతాయని వివరించారు. రైల్వేకు డీజిల్ ట్యాక్స్ 4శాతం, జెట్ ఫ్యూయల్‌కు 19.5 శాతం, ఆర్‌టిసి 27 శాతం ఇస్తున్నారని వివరించారు.



పన్నుల రూపంలో తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూ.4,32,000 కోట్లు వెళ్లగా, కేంద్రం నుంచి 2021 నుంచి 2025 వరకు రూ. 1,76,000 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇందులో పనులు, కేంద్ర ప్రయోజిత నిధులు కూడా ఉన్నాయని వివరించారు. రాష్ట్రానికి ఆయువు పట్టుగా ఉన్న పన్నులు జిఎస్‌టి రూపంలో కేంద్రం చేతిలో పోయిందన్నారు.

సిజి ఎస్‌టిలో రూ.60,504 కోట్లు, ఎస్‌జిఎస్‌టిలో రూ.70,963 కోట్లు, ఐజిఎస్‌టిలో రూ.730840 కోట్లు, సెస్ రూపంలో రూ.29,130 కోట్లు, 16వ ఆర్థిక సంఘం నుంచి రూ.3000 కోట్లు వస్తుందని కూనంనేని వివరించారు. పన్నులపైన స్వల్పకాలిక చర్చ పెట్టాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. బిజెపి ఎంఎల్‌ఎ పాయల శంకర్ మాట్లాడుతూ ఏ రంగం నుంచి పన్నులు ఎక్కువగా వస్తాయో ఆ రంగాన్ని ప్రభుత్వాలు పట్టిపీడించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్‌పైన రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని కోరారు. రైతులకు డీజిల్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించాలన్నారు. ఎంఎల్‌ఎ దానం నగేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సింది రాలేదని తద్వారా సమస్యలు వస్తున్నాయన్నారు.

## మూడు కీలక బిల్లులకు ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ సోమవారం మూడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. మరో బిల్లును సెలక్ట్ కమిటీకి నివేదించింది. తెలంగాణ ప్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, ఉపాధి, రక్షణ,ఆరోగ్యం, సంక్షేమ బిల్లు 2026, కార్మిక, సంక్షేమ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు 2026ను శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, "తెలంగాణ విలువ ఆధారిత పన్ను (సవరణ )బిల్లు 2026 ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ప్రవేశపెట్టగా ఈ మూడు బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. "తెలంగాణ విద్వేషపూరితమైన ప్రసంగం, ద్వేషపూరితమైన నేరాలను (వివారించు) బిల్లు 2026"ను మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో ప్రతిపాదించగా బిల్లును సభా సెలక్ట్ కమిటీ నివేదించింది.

**గిగ్ వర్కర్లకు సమాజిక భద్రత : మంత్రి వివేక్**



రాష్ట్రంలో 4 లక్షల మంది గిగ్ వర్కర్లు సేవలను అందిస్తున్నారని, ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ ప్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, ఉపాధి, రక్షణ,ఆరోగ్యం, సంక్షేమ బిల్లు2026తో వారందరికీ ఉద్యోగ ,సామాజిక భద్రత లభించనుందని మంత్రి వివేక్ తెలిపారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డుతో పాటు సంక్షేమ నిధి కూడ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అదేవిధంగా గిగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడానికి గ్రివెన్స్ సెల్ కూడ ఉంటుందన్నారు. ఇందుకు బోర్డులో సంబంధింత శాఖ అధికారులతో పాటు గిగ్ వర్కర్లు, యాజమన్యాలు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. బోర్డు ఏర్పాటు తర్వాత విధి విధానాలను ఖరారు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ సభ్యులు మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, బిజెపి సభ్యులు పాల్వాయి హరీష్‌లు చర్చలో పాల్గొన్నారు.


**న్యాయవాదులకు రక్షణ కవచం : శ్రీధర్‌బాబు**



ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లు 2026 న్యాయవాదులకు రక్షణ కవచం కానుందన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో న్యాయవాదులపై భౌతిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును తీసువచ్చిందని తెలిపారు. మంథనిలో న్యాయవాదులు వామనరావు, నాగమణి దంపతులను అత్యంత పాశవికంగా హత్య చేశారని ఇప్పటికీ ఆ కుటుంబానికి న్యాయం జరగలేదని వెల్లడించారు. బిల్లుపై కాంగ్రెస్ సభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన న్యాయవాదులకు రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం అభినందనీమన్నారు. బిజెపి సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి యువ న్యాయవాదులు కేసులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆలాంటి వారిని ఆదుకునేందుకు 5 ఏళ్ల పాటు గౌరవ వేతనంగా కనీసం నెలకు రూ.50వేలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా నియమించే అడ్వకేట్ జనరల్ తదితర 70 శాతం పోస్టులను బిసి, ఎస్‌సి, ఎస్‌టిలను నియమించాలన్నారు. ఎఐంఎ సభ్యులు మోహిద్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లును పూర్తిగా మద్దతు ఇస్తున్నామని తెలిపారు.

## పారాక్వాట్ డైక్లోరైడ్ నిషేధించాలి

### అసెంబ్లీలో తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం శాసనసభలో కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయంలో విస్తృతంగా వినియోగిస్తున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (24శాతం) ఎస్ ఎల్ అనే ప్రమాదకర గడ్డిమందును తక్షణమే నిషేధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మంత్రి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజ, పర్యావరణ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఈ తీర్మానం చేసిందని స్పష్టం చేశారు. పారాక్వాట్ వినియోగం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, అనేక సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారుతున్నదని ఆయన పేర్కొన్నారు. క్షణికావేశంలో ఈ రసాయనం సేవించడం వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు.ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. పారాక్వాట్ వంటి అత్యంత విషపూరిత రసాయనాల వినియోగం సుస్థిర, సహజ వ్యవసాయ విధానాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే యూరప్ సహా అనేక దేశాలలో పారాక్వాట్ పై నిషేధంతో కఠిన నియంత్రణలు అమలులో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో కూడా ఇలాంటి ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని అరికట్టడం అత్యవసరమని పేర్కొన్నారు. పారాక్వాట్‌కు ప్రత్యామ్నాయంగా అనేక గడ్డిమందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని పారాక్వాట్ డైక్లోరైడ్ తయారీ, దిగుమతి, నిల్వ, రవాణా, విక్రయం వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని రాష్ట్ర అసెంబ్లీ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి మంత్రి విజ్ఞప్తి చేశారు. మంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది.

## కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కేంద్రానికి తప్పుడు నివేదికలు అందించారు

### బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించిన కాంగ్రెస్, అంచనాలు, అనుమతులు తదితర అంశాలపై కేంద్రానికి తప్పుడు నివేదికలు సమర్పించారని బిజెపి ఎంఎల్‌ఎ కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఘోష్ కమిషన్ కమిటీ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా తమ పార్టీ నేతలు ఈ అంశంపై కట్టుబడి ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి మెగా ఇంజనీరింగ్ కంపెనీకి సంబంధించిన కాంట్రాక్టుల అంశాన్ని ఎక్కడా ప్రస్తావించలేదని, మన ఊరు మన బడి పథకం కింద అదే సంస్థకు మళ్లీ పనులు ఇవ్వడం సరైంది కాదని విమర్శించారు. అయితే ఘోష్ కమిటీ నివేదికను ప్రజలకు విడుదల చేయకుండా సిబిఐ విచారణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మైనింగ్ అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని కోరితే, సిబిసిఐడికి అప్పగిస్తామని చెప్పడం సరైన నిర్ణయం కాదని అన్నారు.

**మంత్రి పొంగులేటిపై బిఆర్‌ఎస్ నిరాధార ఆరోపణలు : పాయం వెంకటేశ్వర్లు**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై బిఆర్‌ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి వ్యాఖ్యలు సమంజసం కాదని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకులు సభలో నిరాధార ఆరోపణలు చేస్తూ, మంత్రుల వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సమయాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని చెప్పుకొచ్చారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో మైనింగ్, సాండ్ మాఫియాలపై సిబిసిఐడి విచారణకు ఆదేశించినందుకే సభను సజావుగా నడవనివ్వలేదని పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిఆర్‌ఎస్‌కు గట్టి సమాధానం ఇచ్చినా వారి తీరు మారలేదని అన్నారు.

**బడ్జెట్ ఓ అంకెల గారడీ : బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీలా ఉందని బిజెపి ఎమ్మెల్యే అంజిరెడ్డి అభిప్రాయపడ్డారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు సభల్లో బడ్జెట్‌పై సమగ్రంగా చర్చ జరపకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు గందరగోళం సృష్టిస్తూ బిల్లులను ఆమోదించాయని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన డిఎ, పిఆర్‌సి, సరెండర్ లీవ్ అంశాల్లో స్పష్టత లేకపోవడం, పోలీస్ శాఖ ఉద్యోగుల డిమాండ్లపై కూడా ప్రభుత్వం స్పందించడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 5.5 లక్షల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ప్రతి ఉద్యోగి జీతం నుంచి రూ.8 వేల వరకు అవినీతి జరుగుతోందని, మొత్తంగా ప్రతి నెల సుమారు రూ.400 కోట్ల అవినీతి జరుగుతోందని వివరించారు.

**సభలో గందరగోళం సృష్టించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం: అద్దంకి దయాకర్**



ద్రవ్య వినిమయ బిల్లు మోదం పొందే కీలక సమయంలో సభలో గందరగోళం సృష్టించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, సభలో అల్లర్లు సృష్టించిన సభ్యులపై శాశ్వత సస్పెన్షన్ విధించాలని అద్దంకి దయాకర్ కోరారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ముందుగానే ప్రణాళిక రచించి సభలో అల్లర్లు సృష్టించి, అనంతరం గవర్నర్‌ను ఆశ్రయించడం అనుచితమని విమర్శించారు. శాసనమండలి పునరుద్ధరణ తర్వాత మొదటిసారిగా సభ్యుల సస్పెన్షన్ జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ అంశంపై ప్రభుత్వం సిబిసిఐడి విచారణకు సిద్ధంగా ఉందని, గతంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుని నాయకులు బాధ్యతతో వ్యవహరించాలని దయాకర్ సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పీకర్, చైర్మన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### ఎమ్మెల్సీ విజయశాంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. శాసనమండలిలో సోమవారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వారి కుటుంబాలను ఆదుకుంటామని ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే నెలకు రూ.25 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చామని, కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఈ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. జూన్ 2న తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేస్తామని చెప్పినప్పటికీ, ఆ ఊసే లేదని ఆమె అన్నారు. ఉద్యమ సమయంలో నమోదైన కేసులను ఎత్తివేస్తామన్న హామీ కూడా పెండింగ్‌లో ఉండటంపై విజయశాంతి అసహనం వ్యక్తం చేశారు. 'మనం అధికారంలోకి రాక ముందు ఉద్యమకారులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని చెప్పాం. ఇప్పుడు ఆ ఉద్యమకారులే రోడ్ల మీదకు వచ్చి తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడుగుతున్నారు. వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది' అని విజయశాంతి అన్నారు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రంలో వారిని విస్మరించడం సరికాదని విజయశాంతి అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ఉద్యమకారుల గుర్తింపు కార్డులు జారీచేయాలనికోరారు.

## శాసనమండలిలో కీలక బిల్లుల ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనమండలి సోమవారం పలు కీలక బిల్లులను ఆమోదించింది. సభలో మంత్రులు అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సి.దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, జి.వివేక్ వెంకటస్వామి బిల్లులను ప్రవేశపెట్టగా సుదీర్ఘ చర్చ అనంతరం బిల్లులు ఆమోదం పొందాయి. తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం బిల్లు, పన్నుల వ్యవస్థలో పారదర్శకత, సరళీకరణకు ఉద్దేశించిన తెలంగాణ వస్తు సేవలు, పన్ను (టిజిఎస్‌టి) సవరణ బిల్లు సభ ఆమోదించింది. దీనితో పాటు వ్యాట్ సవరణ బిల్లు కూడా సభ ఆమోదం పొందింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ రద్దు బిల్లు, అసంఘటిత రంగంలో ఉన్న డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్ల వంటి గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ఉద్దేశించిన గిగ్ వర్కర్ల బిల్లు, తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లుకు కూడా సభ ఆమోద ముద్రవేసింది.

## ఆటోగ్యాస్ కొరతను అధిగమించడానికి ప్రజా రవాణా సేవల విస్తరణ

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాహనా గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రజా రవాణా సేవలను మరింత విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నామని పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.ఎల్.పి.జి గ్యాస్ కొరతతో ఆటోలతో సహా గ్యాస్ ఆధారిత వాహనాలు ఎదుర్కొంటున్న ఇక్కట్లపై సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పౌర సరఫరాల శాఖ అధికారులతో పాటు ఎల్.పి.జి గ్యాస్ సరఫరా చేస్తున్న ప్రధాన పంపిణీ దారులతో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,హైదరాబాద్ కలెక్టర్ హారిచందనలతో పాటు ఐ.ఓ.సి.ఎల్, గోగ్యాస్,ఫ్రెంచ్ కీ చెందిన టోటల్ ఎనర్జీలతో పాటు సూపర్ గ్యాస్,ప్రమ్ గ్యాస్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలతో ఏర్పడిన కొరతను భర్తీ చేయడానికి గాను ఐ.ఓ.సి.ఎల్, హెచ్.పి.సి.ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుకు రావాలన్నారు. వాహనాలకు సరఫరా చేసే ఎల్.పి.జి గ్యాస్ సరఫరాలో ఏర్పడ్డ సంక్షోబాన్ని నివారించేందుకు గాను సరఫరాలను పెంచాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖామంత్రి హార్‌దీప్ సింగ్ పూరీ కి లేఖ రాయలని పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో గ్యాస్ ఆధారిత ఆటో సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితిని పారదర్శకంగా వివరించాలని ఆయన సూచించారు. గ్యాస్ ఆధారిత ఆటోలతో పాటు ఆటోలకు రోజువారీగా 202 మెట్రిక్ టన్నుల గ్యాస్ అవసరం ఉండగా ప్రస్తుతం రోజు వారీగా 147 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంటుండగా లోటు 55 మెట్రిక్ టన్నులు లోటు ఏర్పడుతోందని చెప్పారు. ఆటో ఎల్.పి.జి సరఫరాలో 75 శాతం వాటాను ప్రైవేటు సంస్థలు కలిగి ఉండడంతో ఈ రంగంపై ఆ కొరత ఉంటుందని చెప్పారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఔటర్ రింగ్ రోడ్డు లోపల 116 , బయట 27తో కలిపి మొత్తం 143 ఉండగా అందులో 23 ఔట్ లెట్లు పనిచేయడం లేదన్నారు. వాటిలో 17 నగరం నడిబొడ్డున ఉన్నాయన్నారు. పలు సంస్థలు ప్రత్యామ్నాయ అంతర్జాతీయ వనరులను పరిశీలిస్తున్నాయని అయితే ఖచ్చితమైన సమయం చెప్పలేమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## రిటైర్డ్ ప్రొఫెసర్ అన్సారీకి పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీకి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, వైద్య సహాయం అందించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం ఆయన సిఎంకు లేఖ రాశారు. ఉస్మానియా యూనివర్సిటీ లింగ్విస్టిక్ విభాగంలో సేవలందించిన రిటైర్డ్ ప్రొఫెసర్ మహమ్మద్ అన్సారీ అనారోగ్యంతో చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారని, వైద్యానికి కూడ డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం మానవతా దృక్పథంతో అన్సారీకి రావాల్సిన పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ కోరారు.

## శాసనమండలిలో సభను అడ్డుకున్న బిఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనమండలిలో సోమవారం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సభ్యుల ఆందోళనతో సభలో గందరగోళం నెలకొంది. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలంటూ నినాదాలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న ఆరోపణలపై చర్చకు పట్టుబట్టిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఒకరోజు పాటు సభ నుంచి సస్పెండ్ చేశారు. సభ ప్రారంభం కాగానే బిఆర్‌ఎస్ సభ్యులు మంత్రి పొంగులేటి వ్యవహారంపై హౌజ్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ పోడియం వద్దకు దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. చైర్మన్ పదే పదే విజ్ఞప్తి చేసినా సభ్యులు శాంతించకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో మార్షల్స్ రంగంలోకి దిగడంతో సభ్యులకు, మార్షల్స్‌కు మధ్య తోపులాట జరిగింది. కొందరు సభ్యులు సీట్లపైకి ఎక్కి మరీ నిరసన తెలపడంపై చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ సభ్యులు



పేపర్లు చీంపి, చైర్మన్‌పైకి విసిరివేశారు. పలు మార్లు సీట్లలోకి వెళ్లాలని చైర్మన్ విజ్ఞప్తి చేసినప్పటికీ సభ్యులు వినకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. సభా నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినందుకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలను సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రతిపాదించడంతో బిఆర్‌ఎస్ సభ్యులను సస్పెండ చేస్తూ చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి నేత మధుసూదనాచారి, రవీందర్ రావు, దేశపతి శ్రీనివాస్, ఎల్. రమణ, యాదవ రెడ్డి, సుంకరి రాజు, నవీన్ కుమార్ రెడ్డి, మధుసూదన్, వాణిదేవి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎం. కోటిరెడ్డి తదితరులు ఉన్నారు. 'పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలి. ఇలాంటి ప్రవర్తన సరికాదు. ఇలాంటి వారు మండలికి రావడం దురదుష్టకరం' అంటూ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభ్యుల తీరుపై మండిపడ్డారు.

**బిఆర్‌ఎస్ సభ్యుల తీరును తప్పుబట్టిన మంత్రి శ్రీధర్ బాబు**

బిఆర్‌ఎస్ సభ్యుల తీరును మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా తప్పుపట్టారు. 2014 నుంచి జరిగిన మైనింగ్ అక్రమాలపై ఇప్పటికే సిబిసిఐడి విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. 'గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన హౌజ్ కమిటీలు నివేదికలే ఇవ్వలేదు. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసమే సభను అడ్డుకుంటున్నారు' అని విమర్శించారు. ప్రభుత్వ విచారణకు సహకరించకుండా హౌజ్ కమిటీ పేరుతో కాలయాపన చేయడం సరికాదని ఆయన హితవు పలికారు.

## ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రాధాన్యత క్రమంలో
# అభివృద్ధి పనులు చేపట్టాలి
### సిపిఐ శాసనసభా పక్షం నేత కూనంనేని సాంబశివరావు


**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని, సమస్యలను పరిష్కరించాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో రెండు కోట్ల మంది ఉన్న అసంఘటిత రంగ కార్మికుల ప్రస్తావన బడ్జెట్‌లో లేదని, ఈ రంగాలకు, పేద వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే అభివృద్ధి ఫలితాలు అందరికీ అందుతాయన్నారు. ప్రాధాన్యతలు లేకపోతే రాష్ట్రంలో సాధారణ అభివృద్ధి జరుగుతుందని, తద్వారా అసమానతలు పెరుగుతాయని,అందరికీ న్యాయం జరగబోదని ఆవేదన వ్యక్తం చేశారు. శాసన సభలో సోమవారం రాత్రి ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగినచర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ రూ. 76 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని, అలాగే అప్పులను కూడా ఎలా చెల్లిస్తారో ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. అంతర్జాతీయ సంస్థల నుంచి అవసరమైతే అప్పుల కోసం ప్రయత్నించాలని, జపాన్, సింగపూర్ నెదర్లాండ్ దేశాల్లో ఒక్కో స్కీమ్‌కు ఒక్కో అప్పుగా ఇస్తారని, ఆ దిశగా ఆలోచన చేయాలని సూచించారు. రేషన్ కార్డులపై సన్న బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను కూడా సరఫరా చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో 1,70,000 ఎకరాలలో మక్కలు వేస్తే, కేవలం 8 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, మిగిలిన వాటిని కూడా కొనుగోలు చేయాలని కోరారు. సహకార సంఘాలకు నామినేట్ చేస్తే సహకార సంఘాల స్ఫూర్తి దెబ్బతింటుందని, అందుకే పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని సాంబశివరావు సూచించారు. కొత్త ఇపిఎఫ్ వల్ల ఉద్యోగులకు నష్టం జరుగుతుందని, పాత పిఎఫ్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సింగరేణి సంస్థలో ప్రతిభ ఆధారిత చెల్లింపులు ఉండేదని,వాటిని తిరిగి అమలు చేయాలన్నారు. తమ నియోజకవర్గాలకు నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అమాయకులను మోసం చేస్తున్న చిట్ ఫండ్స్ సంస్థలపై సిట్ విచారణ చేపట్టాలని కోరారు. సాదా బైనామా దరఖాస్తులను, ఆర్‌టిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. 2018 రెవెన్యూ చట్టం ద్వారా స్థానిక సంస్థలలో ఎస్‌సి కులాలకు రిజర్వేషన్లు అమలు కావడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు కోడ్‌లను అమలు చేయబోమని ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక, కేరళ ,బెంగాల్ రాష్ట్రాలలో తీర్మానం చేశాయని, తెలంగాణ రాష్ట్రంలో కూడా తీర్మానం చేయాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## పర్యాటక ప్రాంతాలు సందర్శించి, బస చేయండి
### మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంత్రి జూపల్లి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన లేఖ రాశారు. అసెంబ్లీలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులకు స్వయంగా మంత్రి లేఖలను అందజేస్తూ పర్యాటక అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు శాసన సభ, మండలి కార్యదర్శుల కార్యాలయం ద్వారా లేఖలను పంపారు. తెలంగాణ అనాది చరిత్ర, అపూర్వ వారసత్వం, ప్రకృతి సౌందర్యానికి నిలయమని మంత్రి పేర్కొన్నారు. కాకతీయుల శిల్పకళ, ఆధ్యాత్మిక క్షేత్రాలు, నదులు, జలపాతాలు, అరణ్యాల అందాలు రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. గుస్సాడి నుంచి పేరిణి, బతుకమ్మ నుంచి బోనాలు వరకు విస్తరించిన సాంస్కృతిక వైవిధ్యం తెలంగాణ గర్వకారణమన్నారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను కనీసం రెండు రోజుల పాటు సందర్శించాలని మంత్రి కోరారు. ఆ ప్రదేశాల విశిష్టత, అనుభవాలను ప్రజలకు వివరించి పర్యాటకులను ప్రోత్సహించాలని సూచించారు. దీంతో ప్రజల్లో పర్యాటకంపై ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. పర్యటనలకు సౌలభ్యం కల్పించేందుకు హరిత హోటళ్లలో వసతి కోసం ప్రత్యేక కూపన్లు అందజేస్తామని మంత్రి తెలిపారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో కూడా ప్రజాప్రతినిధుల పాత్ర ముఖ్యమని సూచించారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు చెప్పిన నా తెలంగాణ కోటి రత్నాల వీణ అనే వాక్యాన్ని ఉటంకిస్తూ, రాష్ట్ర వారసత్వాన్ని ప్రపంచానికి చాటాలని మంత్రి ఆకాంక్షించారు.

## మంత్రి అడ్లూరికి సీనియర్ సిటిజన్ల ప్రశంస

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణను చట్టబద్ధం చేస్తూ ఉద్యోగుల జీతాల నుంచే పోషణ ఖర్చు మినాయించే విధంగా ప్రభుత్వం బిల్లును తీసుకురావడం పట్ల నిర్ణయంపై సీనియర్ సిటిజన్స్ సంఘాలు ప్రశంసల వర్షం కురిపించాయి. అసెంబ్లీలో ఈ బిల్లుకు చట్టబద్ధత లభించిన నేపథ్యంలో సోమవారం, వివిధ సీనియర్ సిటిజన్స్ సంఘాల ప్రతినిధులు షెడ్యూల్డ్ కులాలు, గిరిజన సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ చరిత్రలోనే అరుదైన ఆలోచనగా ఈ నిర్ణయమని కొనియాడారు. వృద్ధ తల్లిదండ్రుల సమస్యలను లోతుగా అర్థం చేసుకుని, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ముఖ్యంగా, వృద్ధులు ఎదుర్కొంటున్న నిర్లక్ష్యం, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం వంటి సమస్యలకు ఈ చట్టం సమగ్ర పరిష్కారంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. పిల్లలపై నైతిక బాధ్యతతో పాటు చట్టబద్ధ బాధ్యతను కూడా నిర్దేశించడం ద్వారా కుటుంబ వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..ఈ బిల్లును సమర్థంగా ముందుకు తీసుకెళ్లడంలో అధికారులు కీలక పాత్ర పోషించారని, అలాగే సీనియర్ సిటిజన్స్ కూడా ఈ బిల్లు అమలు విషయంలో పూర్తి సహకారం అందించాలని కోరారు. వృద్ధుల సంక్షేమంపై సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనను , అంకిత భావం, కృషిని మంత్రి కొనియాడారు. ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత చట్టరూపం దాల్చనుందని మంత్రి తెలిపారు. అనంతరం వయోవృద్ధుల ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ముఖ్యమంత్రికి ఘన సన్మానం నిర్వహించాలని సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు ప్రతిపాదించగా, మంత్రి స్వాగతించారు. ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. రామచంద్రయ్య, ఆర్గనైజేషన్ సెక్రటరీ, ఐఆర్‌ఎస్ రిటైర్డ్ అధికారి డి. పార్థసారథి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# విమర్శలు, ప్రతివిమర్శలు, నిరసనలు, వాకౌట్లు, సస్పెన్షన్లు

**ఇ.చంద్రశేఖర్**

**రాజకీయంగా వాడిగావేడిగా కొనసాగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు**



ఈసారి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అధికార, ప్రతిపక్షాల విమర్శలు, ప్రతివిమర్శలు, నిరసనలు, వాకౌట్లు, సస్పెన్షన్లతో రాజకీయంగా వాడిగావేడిగా కొనసాగి పలు కీలక నిర్ణయాలతో ముగిశాయి. మొత్తం 10 పని దినాలలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, ప్రశ్నోత్తరాలు, వార్షిక బడ్జెట్, వివిధ శాఖల పద్దులు, కీలక బిల్లులపై చర్చ, ఆమోదం వంటి కార్యకలాపాలతో శాసనసభ సమావేశాలు అత్యంత వేగంగా కొనసాగాయి. ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళనపైన, ప్రధాన ప్రతిపక్షం ప్రస్తావించిన అక్రమ మైనింగ్‌పై చివరి రెండు రోజులలో సభ దద్దరిల్లింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయిలో జరిగింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేదికగా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని రుజువు చేసేందుకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ ప్రయత్నించగా, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మహిళలకు బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా తదితర హామీలలను దశలవారీగా అమలు చేయడంతో పాటు హామీ ఇవ్వని తొమ్మిది కొత్త సంక్షేమ, అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ బడ్జెట్ సమావేశాలు 'హడావుడి సెషన్' అని ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి విమర్శించగా, సమావేశాలు తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి మైలురాయి అని ప్రభుత్వం ప్రకటించింది. ఈ సమావేశాలు తెలంగాణ రాజకీయాల్లో 'హామీలు వర్సెస్ వాస్తవాలు' చర్చను మరింత తీవ్రం చేశాయని చెప్పవచ్చు. వివరాలలోకి వెళితే తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 16న ప్రారంభమై మార్చి 30వ తేదీతో ముగిశాయి. మొత్తం 11 రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో దాదాపు 80 గంటలపాటు సభా కార్యకలాపాలు కొనసాగాయి. కీలకమైన పలు అంశాలపై సభలో రాత్రి వరకు చర్చలు జరిగాయి. సమావేశాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ కి చెందిన వందకు పైగా సభ్యులు వివిధ అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, రహదారులు, గ్రామీణాభివృద్ధి, రవాణా రంగాలపై సభ్యులు అభిప్రాయాలు వెల్లడించారు. పలు సమస్యలను లేవనెత్తారు. వాటికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ శాఖల మంత్రులు ధీటైన సమాధానమిచ్చారు. మొదటి రోజు గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై రెండు రోజుల పాటు చర్చలు జరిగాయి. మార్చి 20వ తేదీన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ.3.24 లక్షల కోట్లతో 2026 2027 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. మార్చి 23 నుంచి 29వరకు బడ్జెట్‌పై సాధారణ చర్చ, వివిధ శాఖల పద్దులపై విస్తృతంగా చర్చలు, మంత్రుల సమాధానం, వాటి ఆమోదం జరిగాయి. ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ బడ్జెట్‌గా పేర్కొంటూ ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత ఇచ్చిందన్నారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ చర్చలకు తగిన సమయం ఇవ్వలేదని విమర్శించింది. నిధుల వినియోగం, ప్రాధాన్యతలపై బిఆర్ఎస్ పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బిజెపి బడ్జెట్‌ను 'పేపర్ బడ్జెట్'గా విమర్శించింది.

ప్రతిపక్షాలు ఆరు గ్యారంటీల అమలు, రైతు భరోసా, మూసీ ప్రక్షాళన వంటి అంశాలు లేవనెత్తాయి. బిఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వ హామీలను 'బోగస్' అని అభివర్ణించారు. గవర్నర్ ప్రసంగంలో కూడా 'గ్యారంటీ' పదం ఉద్దేశపూర్వకంగా మిస్సింగ్ అని బిఆర్ఎస్ సభ్యులు కెటిఆర్ వ్యాఖ్యానించారు. పలు అంశాలపై ప్రభుత్వం తగిన సమాధానాలు ఇవ్వలేదని ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో బడ్జెట్‌పై, వివిధ శాఖల పద్దులపై చర్చ సందర్భంగా సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు పేదలు, బడుగు బలహీనవర్గాలు, కార్మికులు, గుడిసెవాసుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు సంబంధించిన పనులను మంత్రులు మంజూరు చేస్తున్నప్పటికీ ఆర్థిక శాఖ అందుకు నిధులను మంజూరు చేయడంలేదని ప్రభుత్వ విధానాల పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే మార్చి 29న కీలక బిల్లులు సభలో ప్రవేశపెట్టగా, సప్లిమెంటరీ బడ్జెట్‌పై కూడా చర్చలు జరిగాయి. సభలో పేరెంటల్ సపోర్టింగ్ బిల్లు, గిగ్ వర్కర్స్ సంక్షేమ బిల్లు, వ్యాట్ సవరణ బిల్లు, పంచాయతీరాజ్ సవరణ బిల్లులపై చర్చ ద్వారా ప్రభుత్వం సామాజిక భద్రత, ఉద్యోగ హక్కులు, సామాజిక సమగ్రతపై దృష్టి సారించాయని చెప్పవచ్చు. ఆర్‌టిసి విలీనం, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సభలో చర్చ జరిగింది. హైదరాబాద్ మెట్రో ప్రభుత్వ ఆధీనంపై అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మూసీ ప్రక్షాళనలో పునరావాసం, నష్టపరిహారం అంశాలపై అధికార కాంగ్రెస్, విపక్ష బిఆర్ఎస్ సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి.

ముఖ్యంగా 29వ తేదీన పరిశ్రమలు, మైనింగ్ తదితర శాఖల పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా అక్రమ మైనింగ్‌పై శాసనసభ దద్దరిల్లింది. ప్రతిపక్ష బిఆర్ఎస్ పక్ష ఉప నాయకులు హరీష్ రావు రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమంగా మైనింగ్, క్రషింగ్ చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపణలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ ఆరోపణలను సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, అధికార కాంగ్రెస్ పార్టీ సభ్యులు తిప్పికొట్టారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై అక్రమ మైనింగ్‌పై సభా సంఘం వేయాలని బిఆర్ఎస్ పట్టుపట్టింది. ఈ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడుతూ రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటివరకు ఇసుక అక్రమ రవాణా, అక్రమ మైనింగ్‌పై సిబిసిఐడితో విచారణ జరిపిస్తామని ప్రకటించారు. అయినా ప్రతిపక్ష సభ్యులు శాంతించకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై సభా సంఘం వేయాలని భీష్మించారు. సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడి సభా కార్యకలాపాలు ముందుకు సాగకపోవడంతో ప్రభుత్వ ప్రతిపాదన మేరకు స్పీకర్ బిఆర్ఎస్ సభ్యులను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు. సమావేశాల చివరి రోజు 30వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ అనంతరం ఆమోదం పొందడంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిరవధికంగా వాయిదాపడ్డాయి.

పలు కీలక బిల్లులు ఆమోదం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తెలంగాణ గుడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (రెండవ సవరణ) బిల్లు2026 , ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన తెలంగాణ వైద్య విధాన పరిషత్ (రద్దు) బిల్లు2026, మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రవేశపెట్టిన తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) బిల్లు2026, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన తెలంగాణ (పబ్లిక్ సర్వీసెస్ నియామకాల నియంత్రణ, సిబ్బంది, వేతనాల క్రమబద్ధీకరణ) (మూడవ సవరణ) బిల్లు2026, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రవేశపెట్టిన తెలంగాణ వాల్యూ యాడెడ్ ట్యాక్స్ (సవరణ) బిల్లు2026, ఎల్డర్లీ కపుల్స్ ఫైనాన్షియల్ సెక్యూరిటీ బిల్లుపై చర్చ అనంతరం ప్రధాన ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య సభ ఆమోదించింది. కాగా హేట్ స్పీచ్ బిల్లును సభ సెలెక్ట్ కమిటీకి నివేదించింది.



## నిరుద్యోగ, అసంఘటిత రంగ
# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పరిస్థితులు కష్టతరంగా ఉన్నప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. నిరుద్యోగ, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో సోమవారం 'తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు 'పై జరిగిన చర్చలో సత్యం పాల్గొని, మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి రెండున్నర సంవత్సరాల కాలం ముగుస్తోందని, వృద్ధులకు పెన్షన్, కళ్యాణలక్ష్మి పెంపు లాంటి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ బీమాను కొత్తగా ప్రవేశపెట్టిందని, కానీ గతంలో ఉన్న రైతు బీమా పథకంపైన స్పష్టత ఇవ్వాలని కోరారు. విద్యా రంగానికి కేరళ, ఢిల్లీలో 20 శాతం నిధులను కేటాయిస్తే, తెలంగాణ రాష్ట్రంలో తక్కువగా కేటాయించారని, గత ప్రభుత్వంతో పోలిస్తే ఎక్కక నిధులను కేటాయించిందన్నారు. సాగునీటి ప్రాజెక్ట్‌లో గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నల్లగొండ జిల్లాకు అన్యాయం జరిగిందని విమర్శించారు. ఆశ, అంగన్‌వాడి వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెరుగుతాయని ఆశించారని, పేద వర్గాలకు ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఆశించిన స్థాయిలో సంతృప్తి కరం గా లేదని సత్యం అన్నారు.కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగం చేస్తే వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. భవిష్యత్‌లో పేద వర్గాలకు మరింత ఎక్కువ నిధులు కేటాయించే అవకాలు ఉంటాయని తెలిపారు. బిజెపి ఎంఎల్‌సి అంజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయించాలని కోరారు. బిసిలకు కేటాయించిన నిధులను పూర్తిగా అమలు చేయలేదన్నారు. కొండ గట్టు దేవాలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఎంఐఎం ఎంఎల్‌సి రియల్ ఉల్ హసన్ ఎఫండి మాట్లాడుతూ సిడిపి ఫండ్ నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

### జవహర్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి

మేడ్చల్ జిల్లా, కాప్రా మండలం పరిధిలోని జవహర్‌నగర్‌లో సుమారు మూడు లక్షల జనాభా ఉన్నప్పటికీ, సరైన ప్రభుత్వ పాఠశాల లేకపోవడంపై సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆందోళన వ్యక్తం చేశారు. శాసనమండలిలో సోమవారం బిల్లులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో విద్యావసతుల కల్పనలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని ఆయన కోరారు. జవహర్ నగర్ ప్రాంతంలోని పేద విద్యార్థుల అవసరార్థం గత ఏడాది జిల్లా కలెక్టర్ స్పందించి, గబ్బిలాలపేట ఆర్మీ డెంటల్ కాలేజీ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 185లో 4 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం కేటాయించారన్నారు. అయితే, ఈ కేటాయింపు జరిగిన వెంటనే ఒక ప్రైవేట్ వ్యక్తి కోర్టును ఆశ్రయించి ఆ స్థలం తనదేనని క్లెయిమ్ చేయడంతో పాఠశాల నిర్మాణం నిలిచిపోయిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం సుమారు 150 మంది విద్యార్థులు ఇరుకైన అద్దె భవనంలో చదువుకుంటున్నారన్నారు.

### ఎండిపోతున్న పంటలు ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యం

రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటి, పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. నల్లగొండ జిల్లాలోని సంస్థాన్ నారాయణపురం, రాచకొండ ప్రాంతాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను సభ దృష్టికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌కు చేరువలోనే ఉన్న రాచకొండ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్నప్పటికీ, అక్కడి వ్యవసాయం మాత్రం కుదేలైందని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరానికి 40,000 రూపాయల పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. చౌటుప్పల్, నారాయణపురం ప్రాంతాల్లో సాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన లిఫ్ట్ కెనాల్ ఏర్పాటు చేయాలన్నారు. నల్లగొండ పట్టణంలోని గ్రామీణ బ్యాంకు వద్ద రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రుణమాఫీ జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ, బ్యాంకుల విలీనం, పేర్లు మారడం వంటి సాంకేతిక కారణాలతో రైతులకు ప్రయోజనం అందడం లేదని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి తక్షణ చర్యలు చేపట్టకపోతే, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు ఆత్మహత్యల వైపు వెళ్లే ప్రమాదం ఉందని నెల్లికంటి సత్యం ఆందోళన వ్యక్తం చేశారు.

### అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు స్వాగతించదగ్గది

న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు' చాలా మంచి నిర్ణయమని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన న్యాయవాదుల కుటుంబాల హత్యలను ఆయన గుర్తు చేశారు.'ఈ బిల్లును కేవలం న్యాయవాదుల వృత్తిపరమైన విధులకు మాత్రమే పరిమితం చేస్తే బాగుంటుంది. వ్యక్తిగత పంచాయతీలు లేదా ఇతర పౌర వివాదాల్లో న్యాయవాది హోదాను అడ్డం పెట్టుకోకుండా, కేవలం వృత్తి నిర్వహణలో ఎదురయ్యే దాడులకు మాత్రమే ఈ చట్టం వర్తించేలా స్పష్టమైన క్లాజ్ ఉండాలి,' అని ఆయన సూచించారు.

### జర్నలిస్టుల రక్షణపై విజ్ఞప్తి

అడ్వకేట్స్ ప్రొటెక్షన్ చట్టం తరహాలోనే, రాష్ట్రం లో నిరంతరం దాడులు, బెదిరింపులకు గురవుతున్న జర్నలిస్టుల గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలని సత్యం కోరారు. సమాజంలో జర్నలిస్టులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్తులో వారి రక్షణ కోసం కూడా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని నెల్లికంటి సత్యం ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.



## వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి
### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పుతూ జారీ చేసిన జిఓ నెంబర్ 12 ను సవరించి, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని, సహజ మరణానికి రూ. ఐదు లక్షలు ఇవ్వడంతో పాటు సిఎస్‌సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మరణం, సహజ మరణం,శాశ్వత, పాక్షిక అంగవైకల్యం వంటి స్కీమ్‌లను జిఓ నెంబర్ 12 ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ రూ. 346.36 కోట్లు క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం కార్మికులకు అన్యాయం చేయడమేనని అన్నారు. అవసరం ఉన్నా, లేకున్నా ప్రతి కార్మికుడి పేరు మీద రూ.2,309 ప్రీమియం చెల్లిస్తూ పోతే బోర్డు నిధులు రోజురోజుకు తరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆరంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏప్రిల్ 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించగా ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.నరసింహ, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారం రమేష్, కమతం యాదగిరి, ఎస్.మల్లేష్, జి.పరమేష్, పి.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం
- ఉద్యమ కార్యాచరణ కోసం అన్ని సంఘాలతో సమావేశం
- ఐజెయు అగ్రనాయకులు కె.శ్రీనివాస్ రెడ్డి

**విజయవాడ :** జర్నలిస్టుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజెయు) అగ్రనాయకులు, తెలంగాణ ప్రభుత్వ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. విజయవాడలో ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశాల్లో జర్నలిస్టుల హక్కులు, భద్రతపై కీలక తీర్మానాలు చేశామని తెలిపారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్లీనరీలో తీసుకున్న నిర్ణయాలను శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. 2007లో ఏర్పాటైన మజీథియా వేజ్‌బోర్డు సిఫార్సుల తర్వాత 19 ఏళ్లుగా జర్నలిస్టులకు ఎలాంటి వేతన సవరణ జరగకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ, ప్రైవేట్, బ్యాంకింగ్ రంగాల్లో, చివరకు పొరుగు దేశమైన పాకిస్థాన్‌లో సైతం వేతన సవరణలు జరుగుతున్నా భారతీయ మీడియా రంగంలో జరగకపోవడం గమనార్హమన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన మీడియా రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి, జర్నలిస్టులపై రోజురోజుకూ పెరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రింట్ మీడియాతో పోలిస్తే ఎలక్ట్రానిక్ మీడియాకు సరైన నియంత్రణ గానీ, వేతన నిర్మాణంగానీ లేదన్నారు. ఈ రంగంలోని ఉద్యోగులకు కనీసం అపాయింట్‌మెంట్ లెటర్లు లేకుండా షాపులు, ఎస్టాబ్లిష్‌మెంట్ వర్కర్లగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని మీడియాను అణచివేసే కుట్రగా ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత్ ర్యాంకు రోజురోజుకూ దిగజారుతోందన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నిరోధించడానికి ప్రత్యేక 'మీడియా ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గడువు ముగిసి రెండేళ్లు అవుతున్నా ఇంకా కొత్త కౌన్సిల్‌ను ఏర్పాటు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. సోషల్ మీడియాలో ఎలాంటి 'గేట్‌కీపింగ్' లేకపోవడం వల్ల తప్పుడు సమాచారం విపరీతంగా వ్యాప్తి చెందుతోందని, ఇది వత్తిపరమైన జర్నలిస్టులకు, మీడియా పరిశ్రమకు చెడ్డపేరు తెస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ నియంత్రణ లేకుండానే సోషల్ మీడియాను నియంత్రించేలా సమతుల్యచట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం మరింత బలంగా పోరాడేందుకు, ఉమ్మడి స్వరం వినిపించేందుకు ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో అన్ని మీడియా సంస్థలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలో ఐజెయు సమావేశాల జయప్రదానికి సహకరించిన వారికి, ముఖ్యంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చిన సిఎం చంద్రబాబుకు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఐజెయు సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఐజెయు సమావేశాల్లో చర్చించి ఆమోదించిన తీర్మానాలను వివరించారు. ముఖ్యంగా పని పరిస్థితులు, వేతన వ్యవస్థ, మీడియా రంగంపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. మీడియా రంగంలో పెట్టుబడులు, సమాచార పంపిణీలో సోషల్ మీడియా పాత్ర, నకిలీ వార్తల నియంత్రణ వంటి అంశాలను అధ్యయనం చేస్తూనే పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛను, వ్యక్తిగత గోప్యతను కాపాడేలా సమగ్ర మీడియా పాలసీ ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని రద్దు చేసి... కొత్త లేబర్ కోడ్‌లు తీసుకురావడం వల్ల జర్నలిస్టుల భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత చట్టాన్ని ఆధునీకరించి... అందులో ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాను చేర్చి వెంటనే పునరుద్ధరించాలని, మీడియా ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం దిగువస్థాయిలో ఉన్న నేపథ్యంలో జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం అవసరమన్నారు. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తరహాలో దేశవ్యాప్తంగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి చట్టం తీసుకురావాలని, కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైల్వే ప్రయాణ రాయితీలను జర్నలిస్టులకు వెంటనే పునరుద్ధరించాలని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పేరును మీడియా కౌన్సిల్'గా మార్చాలని, ఇందులో డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు స్థానం కల్పించాలని, ఈ కౌన్సిల్‌కు జర్నలిస్టులపై దాడులు జరిగినప్పుడు విచారణ చేసేలా మరిన్ని చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని తదితర ముఖ్య అంశాలపై వివిధ తీర్మానాలను ఐజెయు ప్లీనరీలో ఆమోదించినట్లు వివరించారు.



# స్టాలిన్, విజయ్ నామినేషన్



న్యూఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎకె స్టాలిన్ చెన్నైలోని కొళత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి నామినేషన్ దాఖలు చేశారు. నామపత్రాలు దాఖలు చేసే సమయంలో ఆయన వెంట పార్టీ కీలక నేతలు ఉన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత స్టాలిన్ రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కొళత్తూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు ముఖ్యమంత్రి స్టాలిన్. ఒకవైపు పరిపాలన వ్యవహారాలు చూస్తూనే, మరోవైపు పార్టీని గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్నారు. అయితే, కొళత్తూర్ నుంచి స్టాలిన్ నామినేషన్ వేయడం ఇది వరుసగా నాలుగోసారి. గతంలో మూడు సార్లు ఈ నియోజకవర్గం నుంచి బరిలో దిగిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఘన విజయం సాధించారు. నామినేషన్ అనంతరం మాట్లాడిన స్టాలిన్, కొళత్తూర్ ప్రజలు తనకు వరుసగా నాలుగోసారి అఖండ విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకెకు భారీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదివరకు జరిగిన ఎన్నికలతో పోలిస్తే తమకు ఈ సారి ప్రజల్లో అపారమైన మద్దతు కనిపిస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈసారి విజయం చాలా గొప్పగా ఉంటుందని, ఢిల్లీకి తమిళనాడు ఎదురు నిలుస్తుంది అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

### రెండు స్థానాల్లో పోటీ చేయనున్న టివికె అధినేత విజయ్



మరోవైపు టివికె అధినేత విజయ్ కూడా పెరంబూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సారి ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారు. మరొకటి తిరుచ్చి ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, నామినేషన్ అనంతరం విజయ్ రోడ్ షో నిర్వహించారు. ఏప్రిల్ 23న జరిగే ఎన్నికల్లో విజిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో డిఎంకె పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డిఎంకె ఓ దుష్టశక్తి అని, వారి పాలనలో మహిళలకు భద్రత లేదని ఆరోపించారు. డిఎంకెను తమిళనాడు నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. అయితే, తాను ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని విజయ్ చెప్పారు. తనని నమ్ముకున్న ప్రజలను ఎప్పటికీ మోసం చేయనని, అబద్ధం చెప్పనని విజయ్ అన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడిపే స్టాలిన్ సర్ కావాలా? లేక ప్రజలను ప్రేమించే విజయ్ కావాలా? మీరే తెల్చుకోవాలని విజయ్ పేర్కొన్నారు.

# వ్యక్తిగత సమాచారం గోప్యం

## పథకాల లబ్ధికి ఉపయోగించొద్దు : జనగణన కమిషనర్




న్యూఢిల్లీ : వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని, దానిని సాక్ష్యంగా గానీ లేదా ఏ పథకం కిందనైనా ప్రయోజనం పొందేందుకు గానీ ఉపయోగించరాదని భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ స్పష్టం చేశారు. వివాహం చేసుకోకుండా చాలాకాలంగా కలిసి ఉంటున్న జంటలను ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయించామన్నారు. సహ జీవన జంటలను పెళ్లయిన దంపతులలాగే పరిగణించాలని భావిస్తున్నామన్నారు. జనాభా లెక్కల అధికారులకు కచ్చితమైన సమాచారాన్ని అందించాలని ప్రజలను కోరారు. ఢిల్లీతో సహా కొన్ని రాష్ట్రాల్లో దేశ 16వ జనాభా లెక్కల మొదటి దశ ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జనాభా లెక్కల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం వ్యక్తిగత సమాచారం అంతా గోప్యంగా ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో జనాభా లెక్కల మొదటి దశ ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు నిర్వహించనున్నారు. 'ఈ ప్రక్రియలో సేకరించిన వ్యక్తిగత సమాచారం అంతా గోప్యంగా ఉంటుంది. సమాచార హక్కు చట్టం కింద దానిని ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలతో పంచుకోలేరు, లేదా కోర్టులో సాక్ష్యంగా ఉపయోగించలేరు' అని నారాయణ్ అన్నారు. పట్టికల తయారీ కోసం కేవలం సమగ్ర గణాంక సమాచారాన్ని మాత్రమే ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. జనాభా లెక్కలలో కులాన్ని చేర్చడం గురించి, ప్రజలు సరైన సమాచారం ఇవ్వరేమోనన్న ఆందోళనపై ప్రశ్నించగా, నారాయణ్ మాట్లాడుతూ కులానికి సంబంధించిన సమాచారాన్ని రెండో దశలో సేకరిస్తామని, విస్తృతమైన చర్చల తర్వాత ప్రశ్నలను నిర్ణయిస్తామని అన్నారు. 'కుల సమాచారాన్ని ఎలా సేకరించాలనే దానిపై చాలా సూచనలు వచ్చాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, ప్రశ్నలను ఖరారు చేసే ముందు ఉత్తమమైన వాటిని ముందుకు తీసుకువస్తాము' అని ఆయన అన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఏ ప్రయోజనం కోసం ఉపయోగించలేరని, కేవలం సమగ్ర గణాంక సమాచారాన్ని మాత్రమే బహిరంగపరుస్తారని, ఏ పథకం నుంచైనా ప్రయోజనం పొందడానికి వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించలేరన్నారు. అలాంటి నిబంధన ఏదీ లేదని, అందువల్ల, ఎవరూ ఆందోళన చెందవద్దని, అవకతవకలు జరిగే అవకాశమే లేదని నారాయణ్ అన్నారు. చివరిసారిగా సమగ్ర కుల ఆధారిత గణన 1881, 1931 మధ్య జరిగింది. స్వాతంత్ర్యం తర్వాత నిర్వహించిన అన్ని జనాభా లెక్కల కార్యకలాపాల నుండి కులాన్ని మినహాయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ, గత ఏడాది ఏప్రిల్ 30న జరగబోయే జనాభా లెక్కలలో కుల గణనను చేర్చాలని నిర్ణయించింది. భారత ఏజెన్సీలు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా, డిజిటల్ భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు అమలులో ఉన్నాయని నారాయణ్ తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎలాంటి పత్రాలను సేకరించబోమని కూడా కమిషనర్ స్పష్టం చేశారు. 'ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదు. ప్రజలకు స్వీయ గణన చేసుకునే అవకాశం ఉంది; స్వీయ గణన పూర్తయిన తర్వాత కూడా, సమాచారాన్ని ధృవీకరించడానికి ఒక గణన అధికారి ఇంటింటికీ వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారు. ప్రతి ఆరుగురు గణన అధికారులకు ఒక పర్యవేక్షకుడు కూడా ఉంటారు, దీనివల్ల ఎలాంటి అవకతవకలు జరగకుండా నిరోధించడానికి ఇది రెండు అంచెల ప్రక్రియగా ఉంటుంది' అని ఆయన అన్నారు. ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నోటిఫై చేసిన విధంగా, జనాభా గణన మొదటి దశ గృహాల జాబితా, గృహ గణనకు ముందు ఉండే 15 రోజుల వ్యవధిలో ప్రజలు డిజిటల్‌గా సమాచారాన్ని సమర్పించడానికి వీలుగా, జనాభా గణన ప్రక్రియలో మొదటిసారిగా స్వీయ గణనను ప్రవేశపెట్టారని నారాయణ్ తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుండి సెప్టెంబర్ 30 మధ్య ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నిర్దేశించిన 30 రోజుల వ్యవధిలో గృహాల జాబితా కార్యకలాపాలు (హెచ్ఎల్ఓ) జరుగుతాయి. గృహాల జాబితా కార్యకలాపాలు ప్రారంభం కావడానికి సరిగ్గా ముందు 15 రోజుల వ్యవధిలో స్వీయ గణన చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఢిల్లీలో, హెచ్ఎల్ఓ దశ రెండు 30రోజుల వ్యవధులలో నిర్వహించబడుతుంది. న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్‌డిఎంసి), ఢిల్లీ కంటోన్మెంట్ ప్రాంతాలలో ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు, ఎంసిడి ప్రాంతంలో మే 16 నుండి జూన్ 15 వరకు ఈ ప్రక్రియ జరుగుతుంది. ఎన్‌డిఎంసి, ఢిల్లీ కంటోన్మెంట్ ప్రాంతాలలో స్వీయ గణన ఏప్రిల్ 1న, ఎంసిడిలో మే 1 నుండి మే 15 వరకు ప్రారంభమవుతుంది. పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఏప్రిల్‌లో ఈ ప్రక్రియ మొదటి దశను ప్రారంభించడానికి నోటిఫికేషన్లు జారీ చేయగా, 15 మేలో, మరో 10 జూన్ లేదా ఆ తర్వాత ప్రారంభిస్తాయి. ఒకసారి డేటా సరిపోల్చి, ప్రామాణీకరించబడిన తర్వాత, ఈ ప్రక్రియ పూర్తయినట్లుగా పరిగణించబడుతుందని కమిషనర్ అన్నారు. స్వీయ గణన చేసే వ్యక్తికి, గణన అధికారి పర్యటన సమయంలో ఏదైనా తప్పు డేటాను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. గణన సిబ్బంది ఫోన్‌లలోని మొబైల్ అప్లికేషన్ ద్వారా డేటాను సేకరిస్తారని; జనగణన, గృహ జాబితాకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను ఒక వెబ్ ఆధారిత పోర్టల్ పర్యవేక్షించి, నిర్వహిస్తుందని; వెబ్ మ్యాపింగ్ అప్లికేషన్ ద్వారా బ్లాక్‌ల ఏర్పాటు జరుగుతుందని నారాయణ్ తెలిపారు. జాతీయ జనాభా రిజిస్టర్ నవీకరణకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్)తో దీనికి ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన అన్నారు. మొదటి దశలో, అధికారులు ఇంటి పెద్ద పేరు, లింగం, సర్వే చేస్తున్న ఇంటి యాజమాన్య స్థితి, ఇంటి ఆధీనంలో ప్రత్యేకంగా ఉన్న నివాస గదుల సంఖ్య, ఇంట్లో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య వంటి ఇతర ప్రశ్నలతో పాటు సమాచారాన్ని కూడా సేకరిస్తారని ఒక గెజిట్ నోటిఫికేషన్ తెలిపింది. లఢాఖ్ కేంద్రపాలిత ప్రాంతం, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడిన నాన్‌సింక్రోనస్ ప్రాంతాలు మినహా, ఈ జనాభా గణనకు రిఫరెన్స్ తేదీ 2027 మార్చి 1వ తేదీ 00.00 గంటలుగా ఉంటుందని నారాయణ్ అన్నారు. 'జనాభా గణన దశలో, ప్రతి ఇంటి నుండి వ్యక్తుల వలస, సంతానోత్పత్తి లక్షణాలతో పాటు వివిధ జనాభా, సామాజిక–సాంస్కృతిక, ఆర్థిక పారామితులకు సంబంధించిన డేటాను సేకరిస్తారు, సేకరించబడతాయనిని ఆయన అన్నారు. మొదటి దశకు సంబంధించిన ప్రశ్నలను జనవరి 22న నోటిఫై చేశారని, రెండవ దశకు సంబంధించిన నోటిఫికేషన్‌లు, ప్రశ్నలు తగిన సమయంలో ప్రచురించబడతాయని నారాయణ్ తెలిపారు.

## పుదుచ్చేరిలో బరిలో ఉన్న అభ్యర్థుల్లో

# 23 మందిపై క్రిమినల్ కేసులు

- 41 శాతం మంది కోటీశ్వరులు : ఎడిఆర్




న్యూఢిల్లీ : పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులలో సుమారు 23 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించగా, 41 శాతం మంది కోటీశ్వరులు అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక వెల్లడించింది. ఎన్నికల సంస్కరణల కోసం పనిచేస్తున్న ఈ స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జిఒ), ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల్లోని 30 స్థానాలకు పోటీ చేస్తున్న మొత్తం 29 4 మంది అభ్యర్థులలో 291 మంది సమర్పించిన అఫిడవిట్‌లను విశ్లేషించింది. పోటీ చేస్తున్న మొత్తం 294 మంది అభ్యర్థులలో, 34 మంది జాతీయ పార్టీల ను ండి, 63 మంది రాష్ట్ర పార్టీల నుండి, 80 మంది నమోదిత గుర్తింపు లేని పార్టీల నుండి కాగా, 117 మంది స్వతంత్ర అ భ్యర్థులుగా బరిలో ఉన్నారు. 2021లో పోటీ చేసిన 323 మంది అభ్యర్థులలో 54 మంది (17 శాతం) తమపై క్రిమిన ల్ కేసులు ఉన్నట్లు ప్రకటించగా, ప్రస్తుత ఎన్నికల్లో 66 మంది అభ్యర్థులు (23 శా తం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారని ఆ నివేదిక పేర్కొంది. ఈ 66 మందిలో, 38 మంది (13 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. 2021లో ఇటువంటి కేసులు ఎదుర్కొన్న వారి సంఖ్య 28 (9 శాతం) గా ఉంది. ప్రధాన పార్టీల విషయానికి వ స్తే, కాంగ్రెస్ నుండి పోటీ చేసిన 21 మ ంది అభ్యర్థులలో ముగ్గురు, ఆల్ ఇం డియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఎఐఎన్ఆర్) నుండి 16 మందిలో నలుగురు, డిఎంకె నుండి 12 మందిలో ఆరుగురు, బిజెపి నుండి 10 మంది అభ్యర్థులలో ఐదుగు రు తమ అఫిడవిట్‌లలో తమపై క్రిమిన ల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. ముగ్గు రు అభ్యర్థులు మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులను ఎదుర్కొంటుండ గా, ఇద్దరు అభ్యర్థుల పేర్లు ఐపిసి సెక్షన్ 302 కింద నమోదైన హత్య కేసులలో ఉ న్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు, త మపై క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థుల కు 14 నుండి 50 శాతం వరకు టిక్కెట్లు కేటాయించాయని ఆ నివేదిక పేర్కొంది. అభ్యర్థుల ఆర్థిక స్థితిగతుల విషయానికి వస్తే, 2021లో మొత్తం 323 మంది అ భ్యర్థులలో 74 మంది (23 శాతం) కోటీశ్వరులు కాగా, ప్రస్తుత నివేదిక ప్రకారం 119 మంది (41 శాతం) అభ్యర్థులు కోటీశ్వరులేనని నివేదిక తెలిపింది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సంపన్న అభ్యర్థులకే టికెట్లు కేటాయించడం ద్వారా, ఎ న్నికల్లో ధనబలం పోషిస్తున్న పాత్ర స్పష్టమవుతోందని ఎడిఆర్ వ్యాఖ్యానించింది. ప్రధాన పార్టీల విషయానికి వస్తే— కాంగ్రెస్ పార్టీకి చెందిన 21 మంది అభ్యర్థులలో 17 మంది, ఎఐఎన్ఆర్ పార్టీకి చెం దిన 16 మంది అభ్యర్థులలో 16 మంది, డిఎంకె పార్టీకి చెందిన 12 మంది అభ్యర్థులలో 11 మంది, అలాగే బిజెపికి చెం దిన 10 మంది అభ్యర్థులందరూ తమ ఆస్తుల విలువ రూ. 1 కోటి కంటే ఎక్కువేనని ప్రకటించారు. మొత్తం 291 మ ంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ. 2, 099 కోట్లుగా నమోదైందని, అంటే ఒ క్కో అభ్యర్థి సగటు ఆస్తి విలువ రూ. 7. 21 కోట్లుగా వెల్లడించింది.

# శబరిమల అంశంపై మోదీ మౌనమేల?

## బిజెపి, ఎల్‌డిఎఫ్‌లు కలిసి పనిచేస్తున్నాయనడానికి నిదర్శనం : రాహుల్‌గాంధీ ఆరోపణ



పతానంతిట్ట : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. కేరళ పర్యటనలో ఉన్నప్పుడు నరేంద్ర మోదీ శబరిమల అంశంపై మౌనం వహించారని, ఇది బిజెపి, ఎల్‌డిఎఫ్‌లు కలిసి పని చేస్తున్నాయనడానికి నిదర్శనమని ఆరోపించారు. సోమవారం ఆయన పతానంతిట్ట అడూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సభలో ప్రసంగించారు. ఏప్రిల్ 9న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ సిపిఐ(ఎం), బిజెపి కూటమిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. దేశంలో తమను సవాలు చేయగల ఏకైక శక్తి కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని బిజెపికి తెలుసు కాబట్టి, కేరళలో యుడిఎఫ్ అధికారంలోకి రావడం బిజెపికి ఇష్టం లేదని ఆయన అన్నారు. 'జాతీయ స్థాయిలో వామపక్ష కూటమి అయిన ఎల్‌డిఎఫ్ తమను ఎప్పటికీ సవాలు చేయలేదని బిజెపికి బాగా తెలుసు. అంతేకాకుండా, ఢిల్లీలో తాము అధికారంలో ఉంటే, కేరళలో ఏ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఉన్నా సరే, అది పూర్తిగా తమ నియంత్రణలోనే ఉంటుందని కూడా వారికి తెలుసు' అని ఆయన పేర్కొన్నారు. బిజెపిని ఎవరైతే ఎదుర్కొంటారో, వారిపై ఆ పార్టీ దాడులకు పాల్పడుతుందని, బెదిరింపులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాపైనే దాడులు జరిగాయి, 36 కేసులు నమోదయ్యాయి. నన్ను ఏకధాటిగా 55 గంటల పాటు విచారించారు' ఆయన తెలిపారు. అయితే కేరళ ముఖ్యమంత్రిపై మాత్రం అటువంటి చర్యలేవీ లేవని ఆయన ఆరోపించారు. ప్రధానమంత్రి ఎక్కడికి వెళ్ళినా సరే, అక్కడ కేవలం దేవాలయాలు, మతం గురించే మాట్లాడుతుంటారని ఆయన వ్యాఖ్యానించారు. విచిత్రమేమిటంటే, పాలక్కాడ పర్యటనకు వచ్చినప్పుడు మాత్రం, శబరిమలలో అసలు ఏం జరిగిందో ఆయన పూర్తిగా మర్చిపోయినట్లుగా ప్రవర్తించారన్నారు. ఈ విషయపై బిజెపికి నష్టం వాటిల్లకుండా ఉండేందుకే ప్రధాని మౌనం వహించారని గాంధీ పేర్కొన్నారు. గతంలో యుడిఎఫ్ రబ్బరు రైతులకు అండగా నిలిచిందని, కష్టకాలంలో నష్టపరిహారం అందించడంతో పాటు రబ్బరు రంగాన్ని కాపాడిందని ఆయన అన్నారు. ఎల్‌డిఎఫ్ రబ్బరు కార్మికులకు నష్టపరిహారం ఇవ్వడానికి నిరాకరిస్తోందని, వారిని రక్షించడం గురించి పట్టించుకోకుండా, పెద్ద వ్యాపార సంస్థలతో సంబంధాలు పెట్టుకోవడానికే సంతోషిస్తోందని ఆరోపించారు. ధరల హెచ్చుతగ్గుల నుంచి రబ్బరు రైతులను, కార్మికులను కాపాడటానికి కాంగ్రెస్ చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఆర్థిక లావాదేవీల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో మోదీ రాజీపడ్డారన్న తన ఆరోపణను రాహుల్ పునరుద్ఘాటించారు. పార్లమెంటులో ఈ విషయం ప్రస్తావించినప్పుడు, ప్రధానమంత్రి స్పందించకుండా తప్పించుకున్నారని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ మోదీని ఎలాగైతే నియంత్రిస్తున్నారో, అలాగే ప్రధానమంత్రి కేరళ ముఖ్యమంత్రిని నియంత్రిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేరళ ప్రజలు పర్యావరణానికి, సహజీవనానికి విలువ ఇస్తారని, విభిన్న వర్గాలు, మతాలు పరస్పర గౌరవంతో కలిసి జీవిస్తాయని రాహుల్ అన్నారు. 'కేరళకు బలమైన చిన్న, మధ్య తరహా వ్యాపారాలు, పటిష్టమైన వ్యవసాయ రంగం, మెరుగైన కనెక్టివిటీ, ఐటి వృద్ధితో పాటు ప్రజలకు రక్షణ కూడా అవసరం' అని ఆయన అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే, కాంగ్రెస్ ప్రకటించిన ఐదు హామీలను అమలు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

# నితీశ్‌ను, బిహార్ ప్రజలను బిజెపి మోసం చేసింది

## తేజస్వీ యాదవ్

పాట్నా : ఎమ్మెల్సీ పదవికి బిహార్ సిఎం నీతీశ్‌కుమార్ రాజీనామా చేయడంపై ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ స్పందించారు. బిజెపి బిహార్ ప్రజలను, నీతీశ్ కుమార్‌ను మోసం చేసిందని ఆరోపించారు. ఈ క్రమంలో నీతీశ్ కుమార్‌ను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పోల్చారు. ఈ మేరకు తేజస్వీ ఓ వార్తా సంస్థతో వ్యాఖ్యానించారు. 'ఎన్నికల తర్వాత నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగరని మేము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నాం. మహారాష్ట్రలోలాగే (ఏక్‌నాథ్ షిండే సిఎం పదవీ కాలాన్ని ఉద్దేశించి) కొద్ది కాలం పాటు ముఖ్యమంత్రిగా నీతీశ్‌ను కొనసాగనిచ్చారు. ఇప్పుడు నీతీశ్‌ను సిఎం పదవి నుంచి బిజెపి తొలగిస్తోంది. నీతీశ్ కుమార్‌ను, బిహార్ ప్రజానీకాన్ని బిజెపి మోసం చేసింది. కమలం పార్టీ మాటలకు, చేతలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది' అని తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

**అమీర్ పేట్ బ్రాంచ్**
షాప్ నెం. 6 & 7, మెరీడియన్ ప్లాజా, డోర్ నెం.6, 8/859/1, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ-500016.

**వాహన ఇ-వేలము సంక్షిప్త ప్రకటన**

దిగువ తెలియజేయబడిన రుణగ్రహీతల వైఫల్యము కారణముగా పార్టీలచే అమలు చేయబడిన కుదువ ఒప్పందం క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ, దిగువ తెలియజేసిన కుదువపెట్టబడిన మోటార్ వాహనమును బ్యాంకు వారు తిరిగి పొందడమైనది/ జప్తు చేయడమైనది మరియు వాటిని "ఎది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలా మరియు ఎది ఎలా ఉన్నది అది అలా" ప్రాదిపదికన వేలము వేయబడును.

**రుణగ్రహీత/ హామీదారు పేరు & చిరునామా: 1.శ్రీ.బొడ్డు గోపి ,** ఇం.నెం 8-3-226 మరియు 226/1/జి 139, ఫ్లాట్ నం 507, శ్రీ సాయి గార్డెన్, బ్లాక్ 1, మధురా నగర్, యూసుఫ్‌గూడ 500045. **బకాయి మొత్తం : రూ.17,97,999/- (రూపాయల పదిహేడు లక్షలు తొంభై ఏడు వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది మాత్రమే) 30-03-2026** నుండి వడ్డీ మరీయు దానిపై ఏదైన ఇతర ఛార్జీలు.

| వాహనము యొక్క వివరణ | రిజర్వు ధర | బయానా |
| --- | --- | --- |
| Vehicle Type: Motor Car (SEDAN)<br>Vehicle Make & Model: VERNA 1.0 TURBO GDI DCT SX(O) BSVI<br>Fuel: PETROL, Reg. No. TS05FP0002,<br>CH.No:MALC041HVNM354882J<br>E. No. G3LCNM674891, Colour: STARRY NIGHT<br>Model/Date of Registration:09/09/2022<br>MFG Month/Year: 09/2022 | రూ.6,12,000/- | రూ.61,200/- |
| | కనీస బిడ్డు పెంపుదల మొత్తం: రూ. 5,000/- ( రూపాయలు ఐదు వేలు మాత్రమే) | |

బ్యాంక్ ఆస్తి ఐడి : BARBBODDUGOPI

ఖాతా పేరు: SARFAESI AUCTION ACCOUNT. ఖాతా నెం. 83260015181869, IFSC Code: BARB0VJAMEE , (Fifth letter ZERO), బ్యాంక్ & బ్రాంచ్ పేరు: బ్యాంక్ ఆఫ్ బరోడా , అమీర్‌పేట్ బ్రాంచ్ .

ఆన్‌లైన్ విధానం ద్వారా వాహనము వేలము: **https://baanknet.com** ఇ-వేలము తేదీ/రోజు/సమయం: **20-04-2026,** సోమవారం, మ.02.00 గం.ల నుండి సా.05.00 గం.ల వరకు, బిడ్ దాఖలు కొరకు ఆఖరి తేదీ: 20-04-2026, సోమవారం, సా. 5.00 గం.లలోగా, కాగోరు కొనుగోలుదారులు/బిడ్డర్లు వాహనమును తేది: 19-04-2026న అదివారం లేదా ఆలోగా ఉ. 10.00 గం.ల నుండి సా. 05.00 గం.ల వరకు. (బ్రైట్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ , ప్లాట్ నం. 480, రోడ్ నెం.5A, గోపాల్ నగర్, కూకట్‌పల్లి, హైద్రాబాద్ . ఫోన్ నెం. +91 99898 94455 పార్కింగ్ యార్డు వద్ద) తనిఖీ చేసుకొనవచ్చును.

**ఇ-వేలము అమ్మకము యొక్క నియమనిబంధనలు:** 1. ఎటువంటి ముందస్తు కారణము తెలుపకుండా అందిన లేదా కొన్ని ఆఫర్(లు) లేదా బిడ్(లు)లను స్వీకరించవచ్చు లేదా నిరాకరించుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 2. ఎటువంటి కారణము తెలుపకుండా ఇ-వేలము స్వీకరించుట/నిరాకరించుట/వాయిదా/రద్దు చేయుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 3. అధీకృత అధికారి పరిజ్ఞానం మరియు తెలిసిన సమాచారం మేరకు వాహనముపై ఎటువంటి తాకట్టు రుణ భారములు లేవు. అయినప్పటికీ ఔత్సాహిక బిడ్డర్లు వాహనముపై తాకట్టు రుణ భారములు, టైటిల్‌కు సంబంధంచి వారంతటా వారే క్షుణ్ణంగా విచారించుకొని & తనిఖీ చేసుకొని & తృప్తి చెందవలెను (వివరణాత్మక నియమనిబంధనల కొరకు **https://baanknet.com** కు రిఫర్ చేయవలెను). అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి **https://baanknet.com** వెబ్‌సైట్ లింక్‌ను చూడండి/ సందర్శించండి. ఔత్సాహిక బిడ్డర్లు ఎరువ మమత, భీమ్ రావు డొబ్బాల (బ్రాంచ్ హెడ్), మొబైల్ నెం.+91 8367788231 ను సంప్రదించవచ్చును.
**గమనిక: బిడ్డరు అన్ని ఆర్.టి.ఓ. సంబంధిత ఛార్జీలు మరియు ఖర్చులను భరించాలి.**

**తేది: 30.03.2026,** ప్రదేశం: హైదరాబాద్ | సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

# సైనికులకు న్యాయం సులభంగా అందాలి

## వాళ్లు రెండు యుద్ధాలు చేసే పరిస్థితి తీసుకురావద్దు: సిజెఐ




న్యూఢిల్లీ : దేశ సైనికుల గురించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనికులను వారి చట్టపరమైన హక్కుల కోసం సరిహద్దుల్లో ఒకటి, స్వదేశంలో మరొకటి, ఇలా ఒకేసారి రెండు యుద్ధాలు చేసేలా దేశం బలవంతం చేయకూడదని అన్నారు. సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం లేహ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సిజెఐ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థకు, సాయుధ దళాలకు మధ్య ఉన్న పరస్పర సహకార సంబంధాన్ని సిజెఐ సూర్యకాంత్ ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను కాపాడుతుండగా, ఆ ఆదర్శాలు నిలబడటానికి అవసరమైన పరిస్థితులను సైనికులే సృష్టిస్తారని పేర్కొన్నారు. అలాగే 1962 నాటి రెజాంగ్ లా యుద్ధాన్ని సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. మేజర్ శైతాన్ సింగ్ భాటి, 13 కుమావోన్ రెజిమెంట్‌కు చెందిన చార్లీ కంపెనీలోని 114 మంది సైనికుల త్యాగాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. 'రాజ్యాంగం హక్కులు, గౌరవం, సమానత్వం, న్యాయం గురించి మాట్లాడినప్పటికీ, దేశ ప్రజల కోసం ఆ వాగ్దానాలు నిలబడగలిగే పరిస్థితులను కల్పించిన పూర్తి ఘనత సైనికులకే దక్కుతుంది. ఒక దేశం తన సార్వభౌమత్వాన్ని, స్థిరత్వాన్ని, శాంతిని కాపాడుకోలేకపోతే, ఆ దేశం స్వేచ్ఛ, న్యాయం గురించి అర్థవంతంగా మాట్లాడలేదు. సైనికుల భూవివాదాన్ని కూడా ఎదుర్కోవచ్చు. ఒక మాజీ సైనికుడు సర్వీసు లేదా సంక్షేమ హక్కుల కోసం ఇబ్బందులు పడొచ్చు. ఒక కుటుంబం పింఛనుకు సంబంధించిన జాప్యాలు, గృహ సమస్యలు, వైవాహిక కలహాలు సంబంధిత వ్యవహారాల్లో అధికార యంత్రాంగం ఉదాసీనతతో వ్యవహరించొచ్చు. దేశం తన సైనికులను ఒకేసారి రెండు యుద్ధాలు చేసే స్థితిలో ఎన్నడూ ఉంచకూడదు. చట్టం సైనికుడి వద్దకే వెళ్లాలి. ఎందుకంటే సైనికుడు ఎల్లప్పుడూ చట్టం వద్దకు వెళ్లలేడు. సైనికులకు న్యాయం సులభంగా అందాలి' అని సిజెఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

### 'దేశాన్ని కాపాడేవారికి న్యాయ సహాయం అందించాలి

ఇది కేవలం సైనికుల సానుభూతికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, ఒక రాజ్యాంగ విధి అని సిజెఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రతను కాపాడే వారికి ప్రభుత్వ సంస్థలు సకాలంలో న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. అలా చేయలేకపోతే ప్రభుత్వ సంస్థలు తమ నైతిక, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లేనని అభిప్రాయపడ్డారు. తాను నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) కార్యనిర్వాహక అధిపతిగా ఉన్నప్పుడు రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, సిఎపిఎఫ్ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం, తోడ్పాటు, మద్దతు సేవలను అందించడానికి ప్రారంభించిన 'వీర్ పరివార్ సహాయ యోజన'ను ఈ సందర్భంగా సిజెఐ ప్రస్తావించారు. నల్సా కార్యనిర్వాహక చైర్మన్‌గా తాను ఉన్నప్పుడు సాయుధ దళాల కోసం ఈ పథకాన్ని రూపొందించి, అమలు చేయడం తన కెరీర్‌లోని గొప్ప ఘట్టాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 14,929 మంది లబ్ధిదారులకు సహాయం అందించామని, 34 రాజ్య సైనిక్ బోర్డులు, 404 జిల్లా సైనిక్ బోర్డులతో సహా 438 న్యాయ సేవల క్లినిక్‌లను కార్యాచరణలోకి తెచ్చామని వెల్లడించారు. 'వీర్ పరివార్ సహాయ యోజన' కింద సేవలందించేందుకు విశ్వాసం, సానుభూతి సంస్కృతిని పెంపొందించేందుకు రక్షణ రంగ నేపథ్యం ఉన్న 378 మందితో సహా మొత్తం 1,123 మంది సిబ్బందిని నియమించినట్లు సిజెఐ సూర్యకాంత్ తెలిపారు. ఈ పథకం కింద ఆస్తి వివాదాలు, పెన్షన్ ఆలస్యం మొదలుకొని వైవాహిక కలహాలు, పాఠశాల ప్రవేశాల వరకు పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సైనికులు సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. సైనికుల ప్రయోజనాలన్నింటినీ పట్టుదలతో కాపాడటం దేశ సంస్థల కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.

**BEFOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR**
**WARANGAL**
**A.R.B. No. 537 OF 2025**
Between:
**M/S. SRI MANIRAM CHIT FUNDS PRIVATE LIMITED, Represented by its Foreman, Hanamkonda-2 Branch.** ......Disputant
AND
**Smt. SOMA KARUNA SRI and Others.** ........Opponents
To,
**OP.No.1:** Smt Soma Karuna Sri, W/o Uma Mahesh, Age: 50 Years, R/o. H.No. 4-295, Dasariwada, Kothurjenda, Hanamkonda. 506001.
**OP.No.2:** Sri Manganuri Laxman Kumar, S/o Janakudu, Age: 54 Years, Occ: Male Nursing, R/o. H.No. 3-12-17, Sagara Veedhi, Near: Bommala Vepachettu, Kumarpally, Hanamkonda. 506001.
**OP.No.3:** Sri Manganoori Chender, S/o Janakudu, Age: 59 Years, Occ: Principal in Govt. ITI Mancherial, R/o. H.No. 3-12-17, Sagara Veedhi, Near: Bommala Vepachettu, Kumarpally, Hanamkonda. 506001.
**OP.No.4:** Sri Pathakanti Rajendraprasad, S/o Balaraju, Age: 40 Years, Occ: Junior Assistant, R/o. H.No. H.No. 4-2-277, Kothur, Subashnagar, Near: Matha Baar, Kumarpally, Hanamkonda. 506001.
**OP.No.5:** Sri Velde Gyaneshwar, S/o Sarvaiah, Age: 51 Years, Occ: Medical Officer. R/o H.No. 3-9-502, Reddy Colony, Hanamkonda. 506001.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on: **10-04-2026** for your appearance. On that day you have to appear in person at **11:00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR – WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 536 OF 2025**
Between:-
**M/s. Advaita Chit Funds India Pvt. Ltd., Hanamkonda, Branch, rep. By it's Foreman,** .....Disputant
VERSUS
**A.NAGARAJU & OTHERS** ......Opponents
1. Sri. Allam Nagarju, S/o, Eshwaraiah, Age: 50 Yrs, Occu: Business, R/o: H.No:11-23-2368/1, Desaipet Road, Navayuga Colony, Warangal.
2. Sri. Keetha Krishna Sagar, S/o, K.Chandraiah, Age: 48 Yrs, Occu: Railway Employe, R/o: H.No: 3-2-138, Raipura Hanamkonda.
4. Sri. Pittala Kiran, S/o, Suraiah, Age: 40 Yrs, Occu: Business, R/o:H.No:20-16-72,East Fort Warangal,Warangal.
5. Sri. Allam Lavanya, W/o, Nagarju, Age: 47 Yrs, Occu: Business, R/o: H.No: 11-23-2368/1, Desaipet Road, Navayuga Colony,Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR**
**WARANGAL**
**ARB.NO. 477 of 2025**
Between:
**M/s. Manideepa Chit Funds Private Limited., Warangal Branch** ..... Disputant
And
**Sri. Chippa Vamshi Kumar & Others** ..... Opponents
To,
**OPPONENT NO. 2.** Sri. Chippa Harish, S/o. Rajaih, Age: 31 Years, Occ: M.T.S, O/o: Archeological Survey of India, MTS, Hyderabad. R/o. H.No. 1-31/1, Venkateshwer Pally, Parkal, Hanamkonda. 506391.
**OPPONENT NO. 3.** Sri. MD. Mahaboob Basha, S/o, MD. Mahamood, Age: 31 Yrs, Occu: M.T.S. O/o: Archeological Survey of India, MTS, Hyderabad. R/o: H.No: 26-65, Old Bus Stand, Alampur, Mahabubnagar, 509152
**OPPONENT NO. 4.** Sri. Bejadi Praveen Kumar, S/o, Bal Reddy, Age: 40 Years, Occ: Business, R/o: H.No: 6-39/1, Narsaipally, Maddur, Cherial, Jangaon, 506223.
**OPPONENT NO. 5.** Sri. Anagandla Laxpathi, S/o, Yadagiri, Age: 46 Years, Occu: Business, R/o: H.No: 2-4-898, Gokul Nagar, Near old Bus Depot, Hanamkonda.
**OPPONENT NO. 6.** Sri Oentala Rajender, S/o. Lingaiah, Age: 48 Years, Occ: Business, R/o. H.No. 1-212, Ankushapur, Tekumtla, Chityala, Jayashankar Bhupalpally, 506356.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, but you have failed to receive the same. The above dispute is posted on.**10-04-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.
**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

# యుద్ధం ఆగాలి...

అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్ష నిర్ణయాలు, చర్యలతో ప్రపంచ దేశాలు అల్లాడుతున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధాన్ని ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. చివరికి అమెరికాలో, ఇజ్రాయెల్ దేశాల్లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యుద్ధం భారీ ప్రాణనష్టానికి, ప్రాంతీయ అస్థిరతకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన అంతరాయాలకు దారితీసింది. యుద్ధ వ్యతిరేక ఉద్యమాలకు ఆజ్యం పోస్తున్నది. శాంతి చర్చల ఆవశ్యకతను తెరపైకి తెస్తోంది. అణు చర్చలు విఫలమై, ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఇరాన్ నాయకత్వం, అణు సౌకర్యాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించినా, పరోక్షంగా తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికే యుద్ధానికి దిగిందని స్పష్టమవుతున్నది. ఆరంభ దాడులలోనే ఇరాన్ సుప్రీమ్ లీడర్ అలీ ఖమేనీ మరణించడం, ప్రతిస్పందనగా ఖతార్, జోర్డాన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, కువైట్, యుఏఇలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేయడం సమస్యను తీవ్రతరం చేసింది. గల్ఫ్ ప్రాంతంలో విమాన మార్గాలు మూతపడ్డాయి. ప్రధాన వాణిజ్య కేంద్రాలు దెబ్బతిన్నాయి. మరోవైపు యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికాలో వాషింగ్టన్ డిసి, న్యూయార్క్, లాస్ ఏంజిలెస్ వంటి నగరాల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. 'హ్యాండ్స్ ఆఫ్ ఇరాన్' వంటి నినాదాలు మారుమోగుతున్నాయి. కోడ్‌పింక్, ఆన్సర్ కొలిషన్ వంటి సంస్థలు ఈ ఉద్యమాల్లో పాల్గొన్నాయి. లండన్‌లో 50 వేల మందికి పైగా పాల్గొన్న భారీ నిరసనలు జరిగాయి. పాకిస్తాన్, జపాన్, టర్కీ, నైజీరియా వంటి దేశాల్లో కూడా ఈ జోక్యాన్ని ఖండిస్తూ ప్రజలు రోడ్లపైకి వచ్చారు. 2025 జూన్‌లో జరిగిన 12 రోజుల దాడులు... తిరిగి తాజాగా యుద్ధంతో వేలాది మంది మరణించారు, వీరిలో పౌరులే అధికం. ఒక వైమానిక దాడిలో ఒక ప్రాథమిక పాఠశాలలో 160 మంది పిల్లలు మృతి చెందడం యుద్ధం అమెరికా నైతికతను ప్రశ్నిస్తున్నది. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 120 డాలర్లను దాటింది. హిజ్బుల్లా వంటి శక్తులు యుద్ధంలో చేరడంతో, భూతల యుద్ధం విస్తరించే ప్రమాదం పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా నౌకాశ్రయాలు, విమాన మార్గాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న విదేశీయులను తరలించే చర్యలు వేగంగా చేపట్టాల్సి వచ్చింది. ఈ యుద్ధం గల్ఫ్ సహకార మండలి దేశాల ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నది. ఆహార దిగుమతుల్లో 70 శాతం అంతరాయం కలగడంతో ఆహార కొరత ప్రమాదం పెరిగింది. ఇరాన్ మౌలిక సదుపాయాల ధ్వంసంతో, పాలన మార్పును తీసుకురావడం ద్వారా ఇరాన్‌ను చెప్పుచేతల్లో పెట్టుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్యం కనిపిస్తున్నది. అక్కడి ముడి చమురు, అపారమైన ఖనిజ సంపదపైనా కూడా అమెరికా కన్నేసింది. సాధ్యమైనంత ఎక్కువ అలజడి సృష్టించి, దీర్ఘకాలిక అస్థిరతకు కుట్రలు పన్నుతున్నది. ఈ చర్యలు ఇరాన్ ఎదురుదాడికి కారణమవుతున్నాయి. హోర్ముజ్ జలసంధి మూసివేతతో ఉద్భవించిన ఇంధన సంక్షోభం యూరప్‌లో మాంద్యానికి దారితీయవచ్చు. ఆసియా దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. అందుకే, ఈ యుద్ధాన్ని కేవలం ఒక దేశం మీద మరొక దేశం దాడి చేసిన సంఘటనగా చూడటం సరికాదు. ఇది శక్తి సమీకరణాలు, వ్యూహాత్మక అహంకారం, భౌగోళిక రాజకీయ ప్రయోజనాలు, ప్రజల మనోభావాల మధ్య జరుగుతున్న ఒక సంక్లిష్ట ఘర్షణగా అభివృద్ధి చెందుతున్నది. సైనిక శక్తి అధికంగా ఉన్న దేశం ఎప్పుడూ యుద్ధాన్ని తనకు అనుకూలంగా మలచగలదనే అభిప్రాయం తప్పని ఇరాన్ ప్రతిఘటన రుజువు చేస్తున్నది. గతంలో ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్‌లో సాధించిన పైచేయి ఇరాన్ విషయంలో పునరావృతమవుతుందనే అమెరికా భ్రమలు తొలగిపోతున్నాయి. సుదీర్ఘ యుద్ధాలు చేసిన చరిత్ర, అనుభవం ఇరాన్ సొంతం. అందుకే, దశాబ్దాలుగా ఈ తరహా దాడులకు సిద్ధమవుతూ వచ్చింది. నాయకత్వాన్ని ఒకే స్థాయిలో కేంద్రీకరించకుండా, పలు స్థాయిల్లో ప్రత్యామ్నాయ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. సైనికంగా కూడా సాధారణ క్షిపణుల నుండి అధునాతన హైపర్సోనిక్ వ్యవస్థల వరకు విస్తృత శ్రేణిని అభివృద్ధి చేసింది. ఇరాన్ ప్రత్యక్షంగా యుద్ధాన్ని ప్రారంభించకపోయినా, దాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని వ్యవస్థీకృతంగా పెంచుకుంది. ఈ వాస్తవాన్ని నిర్లక్ష్యం చేసిన అమెరికా, ఇజ్రాయెల్ భారీ మూల్యాన్నే చెల్లించుకుంటున్నాయి. ఈ రెండు దేశాల దుర్మార్గపు నిర్ణయం ఇప్పుడు యావత్ ప్రపంచాన్ని బహుముఖంగా అస్థిరపరుస్తున్నది. ఇరాన్‌లో ఉన్న ఆర్థిక సమస్యలు, ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ పడిపోవడం వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఈ అసంతృప్తి ఒక ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారి, దేశవ్యాప్తంగా ఒక తిరుగుబాటును ప్రేరేపిస్తుందని అమెరికా అంచనా వేసింది. కానీ ఇరానియన్లు విదేశీ దాడిని వ్యతిరేకిస్తున్నారు. పాఠశాల పిల్లల మరణం, దేశ నాయకత్వంపై దాడులు ప్రజల్లో దేశభక్తిని మరింత పెంచాయి. ఈ భావోద్వేగాన్ని అంచనా వేయడంలో అమెరికా, ఇజ్రాయెల్ ఘోరంగా విఫలమయ్యాయి. ఎలాంటి కారణాలు, అంచనాలు లేకుండా యుద్ధం మొదలుపెట్టిన ఈ రెండు దేశాలు ఇకనైనా తప్పు సరిదిద్దుకోవాలి. తక్షణం కాల్పుల విరమణ అత్యవసరం. అవసరమైన అంతర్జాతీయ సంస్థలు ఇస్తున్న పిలుపుపై సానుకూలంగా స్పందించాలి. ఇప్పటికే పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కియా వంటి ప్రాంతీయ శక్తులు హోర్ముజ్ జలసంధిని తిరిగి ప్రారంభించేందుకు చర్చలు జరుపుతున్నాయి. తద్వారా ప్రపంచ ఆహార, ఇంధన సంక్షోభాన్ని నివారించేందుకు కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ రాజీకి రావాలి. ఒక స్థిరమైన ఒప్పందానికి అంగీకరించాలి. భేదాభిప్రాయాలను పక్కనపెట్టి, స్నేహంతో జరుగుతున్న ఆందోళనలను గమనించాలి. ప్రపంచ దేశాల ఆలోచనలను గుర్తించాలి. అవి తమ నిర్ణయాలను పునఃపరిశీలించకపోతే, ఈ ఘర్షణ మరింత విస్తరించే ప్రమాదం ఉంది. మరో ప్రపంచ యుద్ధానికి ఇది బీజం పడినా ఆశ్చర్యం లేదు.



## ఘర్షణలు రెచ్చగొడుతూ దేశాన్ని దోచుకుంటోంది

**సమాజంలోని అన్ని వర్గాల మధ్య బిజెపి ఘర్షణలను రెచ్చగొడుతోంది. ఇటువంటి పరిస్థితులను ఆసరాగా చేసుకుని దేశాన్ని దోచుకోవాలని కాషాయ పార్టీ చూస్తోంది. టిఎంసి ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేసిన రాజకీయ 'చార్జిషీటు' తీవ్ర అభ్యంతరకరంగా ఉంది. అల్లర్లను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షాలపైనే మొదట చార్జిషీటు దాఖలు చేయాలి. హిందువులు, ముస్లింల నుండి మొదలుకొని పాలన, పోలీసు శాఖల వరకు అందరిని విభజించడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. బిజెపి ఒత్తిడి మేరకు ఎన్నికల సంఘం, ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాలకు పలువురు సీనియర్ అధికారులను ఏకపక్షంగా బదిలీ చేసింది.**

– తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ



## ఆధునిక యంత్రాల ధాటికి ఆరిపోతున్న విశ్వకర్మల కొలిమి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఒకప్పుడు పట్టుకొమ్మలుగా నిలిచిన విశ్వబ్రాహ్మణుల పంచ వృత్తులు నేడు మనుగడ కోసం పోరాడుతున్నాయి. నాగరికతకు పునాదులు వేసిన కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, కాంస్య, శిల్ప కళలు కాలక్రమేణా ప్రభావాన్ని కోల్పోతున్నాయి. మానవ మేధస్సుకు, చేతి నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ వృత్తులు ప్రస్తుతం యంత్రాల ధాటికి, కార్పొరేట్ శక్తుల పోటీకి తలవంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు గ్రామాల్లో ప్రతి శుభకార్యంలోనూ కీలకపాత్ర పోషించిన ఈ వృత్తిదారులు నేడు తమ ఉనికిని కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**ఆధునికత కోరల్లో ఆత్మీయ వృత్తులు**

మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లోకి వచ్చిన రెడీమేడ్ వస్తువులు, పారిశ్రామిక ఉత్పత్తులు సంప్రదాయ చేతివృత్తులపై గొడ్డలి పెట్టుగా మారాయి. చేతితో అద్భుతమైన శిల్పాలను, నాణ్యమైన కలప సామాగ్రిని, వ్యవసాయ పనిముట్లను తయారు చేసే విశ్వబ్రాహ్మణులకు ప్రస్తుతం పని కరువైంది. ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాల వినియోగం పెరగడంతో కమ్మరి కొలిమిలు ఆరిపోతున్నాయి. ప్లాస్టిక్, స్టీల్ వస్తువుల వాడకం పెరగడం వల్ల కాంస్య పాత్రల తయారీ మరుగున పడిపోతోంది. నాణ్యత కంటే తక్కువ ధరకు లభించే యంత్ర నిర్మిత వస్తువుల వైపు వినియోగదారులు మొగ్గు చూపడం వృత్తిదారుల పాలిట శాపంగా మారింది.

**ఆదాయం కరువు.. అప్పుల ఊబిలో కుటుంబాలు**

ముడిసరకుల ధరలు విపరీతంగా పెరగడం, చేసిన పనికి తగిన కూలి లభించకపోవడంతో విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. రోజంతా కష్టపడి పనిచేసినా కనీసం పూట గడవని పరిస్థితి నెలకొంది. పెట్టుబడికోసం తెచ్చిన అప్పులు తీరక, కుటుంబ పోషణ భారమై చాలామంది వృత్తిదారులు మానసిక వేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే తమ వారసత్వ వృత్తులను వదిలి ఉపాధికోసం వలసలు వెళ్లి దినసరి కూలీలుగా మారుతున్నారు.

**బడా షోరూమ్‌ల ధాటికి కుదేలు**

ముఖ్యంగా స్వర్ణకార వృత్తిపై కార్పొరేట్ నీడలు పరుచుకున్నాయి. బడా కార్పొరేట్ జ్యువెలరీ షోరూమ్‌ల రాకతో సాధారణ స్వర్ణకారులు వీధిన పడే పరిస్థితి వచ్చింది. మెషిన్ కటింగ్ నగలు, ఆకర్షణీయమైన ప్రకటనలతో బడా సంస్థలు సామాన్య వృత్తిదారుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు అటవీ నిబంధనల కఠినత వల్ల వడ్రంగులకు ముడిసరకు అయిన కలప దొరకడం గగనమైంది. ఒకప్పుడు గౌరవప్రదమైన జీవనం సాగించిన వడ్రంగి వృత్తిదారులు నేడు కుటుంబ పోషణకోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు.

**ప్రభుత్వ జోక్యం తక్షణ అవసరం**

ఈ సంప్రదాయ కళలు అంతరించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వృత్తి పనిముట్లపై సబ్సిడీలు అందించడం, ముడిసరకు సేకరించడంలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించడం, వృత్తిపై ఆధారపడిన వారికి పెన్షన్లు ఇచ్చి భరోసా కల్పించడం వంటి చర్యలు చేపట్టాలి. విశ్వబ్రాహ్మణుల వృత్తులు మన సంస్కృతికి, వారసత్వానికి సజీవ సాక్ష్యాలు. వీటిని కాపాడుకోవడం ద్వారానే వేలాది కుటుంబాల జీవనోపాధిని రక్షించవచ్చు.

ప్రజాపక్షం విలేకరి, జన్నారం

# పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ తగ్గింపు మాయాజాలం



ఎం. కోటేశ్వరరావు

కుక్క పిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా కాదేదీ కవితకనర్హం అన్నాడు మహాకవి శ్రీశ్రీ. భారత చక్రవర్తి నరేంద్రమోదీకి భజన చేసేందుకు ఏ అవకాశాన్నీ వదలం అంటున్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నేతలు. పెట్రోలు, డీజిలు మీద కేంద్రప్రభుత్వం లీటరుకు పది రూపాయల చొప్పున ఎక్సయిజ్ డ్యూటీ తగ్గించిందన్న వార్త రాగానే ముగ్గురూ మోదీని అభినందించారు. ఎందుకటా ! వినియోగదారులకు ధర పెంచనందుకు అన్నది వారి స్పందనల సారం. పూర్వం రాజులకాలంలో రాజుగారు ఏది చేసినా గొప్పదే అని పొగిడే భట్రాజుల (కులం గురించి కాదు)ను వారు గుర్తుకు తెచ్చారంటే అతిశయోక్తి కాదు. భట్రాజులకు రాజులు, రంగప్పలు నజరానా ఇచ్చేవారు, కేంద్రం ఇస్తున్నది వడ్డీలకే చాలటం లేదని చంద్రబాబు నాయుడు మంత్రులతో అన్నట్లు లీకు వార్తలు. ఈ పూర్వరంగంలో మోదీని పొగిడినందుకు ఆంధ్రప్రదేశ్‌కు ఏమైనా ఒరగబెడతారా? వ్రతం చెడ్డా ఫలం దక్కదా! చూద్దాం. కొసమెరుపు ఏమంటే నరేంద్రమోదీని పొగడటంలో పోటీపడే వైసిపి నేత జగన్ మోహనరెడ్డి ఈ విషయంలో వెనుకబడినట్లు కనిపిస్తున్నది, స్పందన కనిపించలేదు, వినిపించలేదు. ఇక్కడ ఒక్క సందేహం. చంద్రబాబు సిఎం, పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి, మరి మోదీని పొగడటంలో మంత్రి లోకేష్ పాత్ర ఏమిటి? పలుకుబడి, ప్రతిష్ట పెంచే కసరత్తులో భాగమా? మిగిలిన మంత్రులు ఎందుకు స్పందించలేదు. ఎవరికి తోచింది వారు అనుకొనే స్వేచ్ఛ ఉంది గనుక వదిలేద్దాం! చిత్రం ఏమిటంటే వినియోగదారుల మీద విపరీత భారం మోపినపుడు చంద్రబాబు అండ్ కో మౌనంగా ఉండి ఇప్పుడు ఏదో ఒరగబెట్టినట్లు భజన చేశారు? ఏమి రాజకీయం రా నాయనా! అసలు నరేంద్రమోదీ ఎందుకీ నిర్ణయం తీసుకున్నారు?

శుక్రవారం నాడు ఎక్సయిజ్ పన్ను తగ్గింపు వార్త వినగానే శ్రీరామ నవమి వేడుకల్లో ఉన్న జనం ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే చమురు ధరలు పెరుగుతాయని మానసికంగా సిద్ధం అయిపోయిన వారు నిజమేనా మోదీ సర్కార్ ఇంత మేలు చేసిందా అని కాళ్లు చేతులు గిల్లుకున్నారు, తలలు కొట్టుకున్నారు. చర్మాలు స్పందించటంతో రామా ఇలా కరుణించావా అని సంబరపడ్డారు. అయితే బంకుల వద్దకు వెళ్లగానే ఆ ''తగ్గింపు'' అంబానీ, నయారా వంటి ప్రైవేటు కంపెనీలతో బాటు కేంద్ర ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు తప్ప వినియోగదారులకు కాదని తెలియగానే చల్లబడిపోయారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దుర్మార్గదాడుల కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగాయి. ఆ పేరుతో నయారా అనే ప్రైవేటు కంపెనీ పెట్రోలు మీద లీటరుకు ఐదు, డీజిలు మీద మూడు రూపాయల చొప్పున ధర పెంచింది. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం పవర్ పెట్రోలు ధర లీటరుకు రు.2.36వరకు, పరిశ్రమల్లో ఉపయోగించే డీజిల్ ధరను 22 రూపాయలు పెంచింది. దిగుమతి ఖర్చు పెరిగినందున మన దేశంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు లీటరు పెట్రోలు మీద రు.1820. డీజిలు మీద రు.3035 నష్టం వస్తున్నదని చెబుతున్నారు. (అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పతనమైనపుడు వాటికి ఎంత లాభం వచ్చిందో చెప్పరు) అందువలన వాటికి ఉపశమనం కలిగించేందుకు మోదీ పూనుకున్నారు. ప్రత్యేక ఎక్సయిజ్ డ్యూటీని పెట్రోలు మీద రు.13ను మూడుకు తగ్గించగా, డీజిల్ మీద పది రూపాయలను పూర్తిగా ఎత్తివేశారు. ఈ శ్రద్ధ కోట్లాది మంది వినియోగదారుల మీద లేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభం కాగానే వంటగ్యాస్ మీద గృహ వినియోగదారులకు అరవై రూపాయలు పెంచారు, ముష్టిగా విదుల్చుతున్న 40రూపాయల సబ్సిడీని గుట్టుచప్పుడు కాకుండా ఎత్తివేశారు, అంటే వంద రూపాయల మేరకు వడ్డించారు.

అచ్చేదిన్ పేరుతో 2014లో అధికారానికి వచ్చిన మోదీ జనాలకు ఏదో ఒరగబెడతారని అందరూ ఆశించారు. అదనంగా అన్నవస్త్రాలు ఇస్తారనుకొంటే ఉన్న వస్త్రాలను లాగేసుకున్నట్లు కొత్తగా మేలు చేస్తారనుకుంటే డీజిలు, పెట్రోలు మీద సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేశారు, గ్యాస్ మీద ముష్టి మాదిరి విదిల్చారు. ఇప్పుడు దాన్ని కూడా రద్దు చేశారు. మేలు సంగతి తరువాత, భారం ఎలా మోపారో చూద్దాం. మోదీ అధికారానికి వచ్చిన 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం ప్లానింగ్ ఎనాలసిస్ సెల్ సమాచారం ప్రకారం చమురురంగం నుంచి ఎక్సైజ్ డ్యూటీ రాబడి రు.99,068 కోట్లు, దాన్ని 2020–21 నాటికి రు.3,72,930 కోట్లకు పెంచారు. తరువాత ఎన్నికలు, తదితర కారణాలతో 2023–24 నాటికి రు.2,73,684 కోట్లకు తగ్గించారు. 2025–26 తొలి ఆరునెలల్లో రు.1.30వేల కోట్ల మేర రాబడి వచ్చింది.పెట్రోలు మీద కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న అసలు సిసలు ఎక్సయిజ్ పన్ను లీటరుకు రు.1.40,(దీన్లో మాత్రమే రాష్ట్రాలకు వాటా ఉంది) ఇదిగాక ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ రు.13, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పేరుతో రు.2.50, రోడ్ల పేరుతో రు.5 వంతున మొత్తం రు.20.50 వసూలు చేస్తున్నారు. (అంతకు ముందు రు.30కి పెంచి తరువాత తగ్గించారు). ఇప్పుడు రు.13లో పది రూపాయలు తగ్గించినప్పటికీ అది వినియోగదారులకు చేరటం లేదు. సాధారణ డీజిల్‌పై పదహారు రూపాయల బాదుడులో పది రూపాయలు రద్దు చేశారు. అయినా వినియోగదారులకు ఒక్క పైసా కూడా తగ్గలేదు.

తాజా నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తగ్గిన ఆదాయలోటును ఎలా సర్దుబాటు చేయనుంది? బడ్జెట్‌లో సంక్షేమ పథకాల కేటాయింపులకు కోత పెట్టటం లేదా ఏదో ఒకసాకుతో జిఎస్‌టి, సెస్‌ల పెంపుదలకు పూనుకోవాల్సి ఉంటుంది. పశ్చిమాసియా సంక్షోభం ముగిసిన తరువాత తిరిగి అదనపు ఎక్సయిజ్ పన్నుబాదుడు ద్వారా పూడ్చుకోవచ్చు.చావు కబురు చల్లగా చెప్పినట్లు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సమీక్షించి ధరల నిర్ణయం చేస్తామని శుక్రవారం నాడు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. పరోక్ష పన్నులు మరియు కస్టమ్స్ కేంద్ర బోర్డు అధ్యక్షుడు వివేక్ చతుర్వేది విలేకర్లతో మాట్లాడుతూ ''మీరు ఊహించుకొనే విధంగా పరిస్థితి లేదని, మనం కష్టకాలంలో ఉన్నామని'' చెప్పారు. నరేంద్రమోదీ గారేమో అంతా సజావుగా ఉందని చాలా రోజుల పాటు చెప్పించి, కరోనా మాదిరి పరిస్థితిని ఎదుర్కొంటున్నాం అని పార్లమెంటులో మాట్లాడి జనాన్ని భయపెట్టిన సంగతి తెలిసిందే.అధికారులెందుకు ఈ విధంగా మాట్లాడుతున్నట్లు? ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ పది రూపాయలు తగ్గించిన కారణంగా ప్రతి పదిహేను రోజులకు ఏడువేల కోట్ల రూపాయల మేర కేంద్ర ప్రభుత్వం రాబడిని కోల్పోతున్నదని వివేక్ చెప్పారు, అంటే ఏడాదికి రు.1.68లక్షల కోట్లు. మోదీ సర్కార్ వంచన గురించి చెప్పుకోకపోతే జనాలకు అన్యాయం చేసినవాళ్లం అవుతాము.

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ధరలు తగ్గితే వినియోగదారులకు తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అని చెప్పిన వారు 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి ధరలను సవరించటం నిలిపివేశారు. ఆ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలై నాలుగు నెలల్లో మనం దిగుమతి చేసుకున్న ముడి చమురు ధర సగటున 108.5 డాలర్లు. ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2022–23 ఏడాది సగటు ధర 93 డాలర్లు. ఇక 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు పదకొండు నెలల సగటు ధర 66.53 డాలర్లు, అంటే నాలుగేండ్లలో ఇంతగా తగ్గినప్పటికీ వినియోగదారులకు పైసా తగ్గించలేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తరువాత మార్చినెల 25వ తేదీ వరకు ఉన్న కొనుగోలు సగటు ధర 123 డాలర్లకు చేరింది. ఈ వివరాలు ఏ కమ్యూనిస్టులో, కాంగ్రెస్ వారో చెప్పినవి కాదు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పెట్రోలియం ప్లానింగ్ మరియు అనాలిసిస్(పిపిఏసి) వెబ్‌సైట్ వెల్లడించిన సమాచారం. ఆయిల్ ప్రైస్ డాట్‌కామ్ సమాచారం ప్రకారం ఫిబ్రవరి 25న మనదేశం కొనుగోలు చేసిన ముడి చమురు ధర 70.25 డాలర్లు ఉంటే మార్చినెల 23న 127డాలర్లకు చేరింది. ఈ కారణంగానే ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ధరలను సమీక్షిస్తామని కేంద్రం చెప్పింది. నాలుగేండ్ల పాటు జనాల నుంచి లక్షల కోట్లు అదనంగా వసూలు చేసి ఖజానా నింపుకొని అదానీ, అంబానీ వంటి వారికి సబ్సిడీలు రూపంలో కట్టబెట్టారు, పారుబాకీల పేరుతో లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశారు. ఇప్పుడు ధరలు పెరిగి ఒక నెల రోజులు కూడా గడవక ముందే చమురు కంపెనీల కోసం నడుంకట్టారు.

దిగుమతి చేసుకున్న చమురు భారంగా మారుతున్నదంటూ గుండెలు బాదుకుంటారు. దీనికి రూపాయి విలువపతనాన్ని అరికట్టటంలో వైఫల్యం లేదా? మోదీ అధికారానికి వచ్చినపుడు, ఇప్పుడు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు పీపా ధర ఒక డాలర్‌గానే ఉంది అనుకుందాం. నాడు డాలరుకు అరవై రూపాయలు చెల్లిస్తే సరిపోయేది, ఇప్పుడు అదే డాలరుకు 94చెల్లించాల్సి వస్తోంది. ఈ నిర్వాకానికి బాధ్యత ఎవరిది? యుపిఎ పాలనలో రూపాయి పతనం చెందినపుడు అసమర్ధ మన్మోహన్ సింగ్ కారణం అన్నారు కదా! ఇప్పుడు ''సమర్ధ'' నరేంద్ర మోదీ అని చెప్పక తప్పదు. దేశంలో ముడిచమురు ఉత్పత్తి పెంచలేదని గతంలో తీవ్రవిమర్శలు చేశారు. పన్నెండేళ్ల నరేంద్రమోదీ ఏలుబడి ఎలా ఉందో తెలుసా ? 2014–15లో ప్రభుత్వప్రైవేటు ఉత్పత్తి 35.9 మిలియన్ టన్నులుంటే 2023–24నాటికి 27.2మి.టన్నులకు పడిపోయింది. ఇప్పుడు ఇంకా దిగజారింది. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలన్ని కలసి 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన మొత్తం 25.6మిలియన్ టన్నులే. ఇలాంటివారు ఆత్మనిర్భరత, వికసిత్ భారత్ పేరుతో 2047 నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామని కబుర్లు చెబుతుంటే జనం చెవుల్లో పూలు పెట్టుకొని తలలు ఊపాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గితే తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అంటూ అంతకు ముందు ప్రతి రోజూ సవరించిన ధరల విధానాన్ని నాలుగేండ్లు ఎందుకు పక్కన పెట్టారో ఇప్పుడు తిరిగి దాని గురించి ఎందుకు మాట్లాడుతున్నారో జవాబుదారీ తనం గురించి తమ భుజాలను తామే చరచుకొనే పెద్దలు ఎవరైనా చెబుతారా?

రాజకీయనేతలను కాసేపు పక్కన పెడదాం. వారు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని తెలిసిన జనంలో అసలు ప్రశ్నించే గుణం ఎందుకు అంతరించినట్లు? నిజంగానే ఈ ధోరణి గురించి పరిశోధనలు జరపాల్సిన అవసరం ఉంది. ఆక్రమిత కాశ్మీరులో పాక్ ప్రభుత్వం భారాలు పెంచితే వాటిని భరించలేక అక్కడి జనం మనదేశంలో విలీనం కావాలని కోరుకుంటున్నట్లు వీడియోను చూపి కొందరు వీరంగం వేస్తుంటారు. ఇక్కడి జనం మీద మోదీ మోపుతున్న భారాలు వారికి పట్టవు. పాకిస్తాన్ సుత్తి ఇనుపదైనా భారత్‌ది బంగారుపుదైనా తల పగులుతుంది. మంచి రోజులను(అచ్ఛేదిన్) తెస్తామంటే జనం నమ్మారు. ప్రజలకు అన్యాయం జరిగితే నిలదీస్తాం, తాట వలుస్తాం అందుకే పార్టీని పెట్టాం అని జనసేన నేత పవన్ కల్యాణ్ గతంలో ప్రకటించినపుడు జనం నిజమే కదా అనుకున్నారు. 2019కి ముందు నరేంద్రమోదీని, చంద్రబాబు నాయుడిని అదే మాదిరి నిలదీసినమాట నిజం. తరువాత చంద్రబాబును వదలి వేశారు. నరేంద్ర మోదీతో చేతులు కలిపారు.

వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మాత్రమే 2024 ఎన్నికల వరకు అది జనం సమస్యలైనా, జగన్ వ్యవహారశైలినైనా నిలదీశారు, తాటవలిచారు. ఇప్పుడు తత్వం తలకెక్కింది గనుక మౌన దీక్ష పట్టారు. అక్రమం జరుగుతుంటే మౌనంగా ఉండమని సనాతనం కూడా ఎక్కడా చెప్పలేదు. ఎదుటి వారి జేబులో పర్సు కొట్టేసినట్లు తెలియగానే ఎవరైనా వెంటనే దాన్లో ఎంత డబ్బు ఉంది అని అడుగుతాం, తక్కువ మొత్తమే అని తెలిస్తే పోనీలే అని ఊపిరి పీల్చుకుంటాం. అదే కేంద్ర ప్రభుత్వమైనా మరొకరైనా చమురు పన్ను పేరుతో మన పర్సు కొట్టేస్తున్నపుడు ఎంత పోగొట్టుకున్నాం అని ఆలోచించాలా వద్దా? అఫ్ కోర్స్ అది కష్టపడిన సొమ్ము కాకపోతే వదిలేద్దాం !

# నైపుణ్యంలేని చదువులు.. అవసరాలు తీర్చని డిగ్రీలు...

మన సమాజంలో చదువు అనేది ఒకప్పుడు విముక్తి సాధనం. చీకటి నుండి వెలుగులోకి తీసుకెళ్లే దీపం. పేదరికం నుండి బయటపడే మార్గం, ఒక కుటుంబంలో ఒకరు చదివితే ఆ కుటుంబం మొత్తం భవిష్యత్తు మారిపోతుందని నమ్మేవారు పెద్దలు. కానీ కాలం మారింది. విద్య విస్తరించింది. కాలేజీలు పెరిగాయి. డిగ్రీలు పెరిగాయి. కానీ జీవితాలు మాత్రం ఇంకా రోజురోజుకి అంధకారంలోకి వెళ్తున్నాయి లాంటి అసహజమైన ప్రశ్న ఇప్పుడు మన ముందు నిలుస్తోంది. చదువు పెరిగింది, కానీ జీవితాలు ఎందుకు స్థిరపడడం లేదు? డిగ్రీలు పెరిగాయి, కానీ నిరుద్యోగం ఎందుకు తగ్గడం లేదు? విద్యార్థులు సంవత్సరాల తరబడి చదివిన తర్వాత కూడా ఎందుకు జీవితంపై అయోమయంలో నిలబడిపోతున్నారు?ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే మన విద్యా వ్యవస్థలో ఉన్న ఒక చేదు నిజం బయటపడుతుంది. నేడు మనం చదువును జ్ఞానంగా కాదు, ఒక గుర్తింపుగా చూస్తున్నాం. ఒక విద్యార్థి చదువుతున్నప్పుడు అతను ఏం నేర్చుకుంటున్నాడన్నది ముఖ్యం కాదు. చివరికి అతని చేతిలో ఏ డిగ్రీ సర్టిఫికెట్ ఉంది అన్నదే ముఖ్యమైపోయింది. ఈ దృక్పథం వల్ల చదువు ఒక సాధనంగా కాకుండా ఒక సామాజిక అలంకారంగా మారిపోయింది. మా కొడుకు డిగ్రీ చేశాడు, మా అమ్మాయి ఇంజినీరింగ్ చదివింది అని చెప్పుకోవడం కోసం చదివే పరిస్థితి చాలా చోట్ల కనిపిస్తోంది. ఈ పరిస్థితి ఒక్కసారిగా రాలేదు. దీని వెనుక సామాజిక, ఆర్థిక, మరియు విద్యా నిర్మాణాలలో ఏర్పడిన అనేక లోపాలు ఉన్నాయి. మొదటగా మన సమాజం విజయం అనే పదాన్ని చాలా సంకుచితంగా నిర్వచించింది. మంచి మార్కులు, ఒక డిగ్రీ, ఒక ఉద్యోగం. ఇవే విజయానికి ప్రమాణాలు అయ్యాయి. ఒక విద్యార్థి తనకు నిజంగా ఏం చేయాలని ఉంది అనే ప్రశ్న అడిగే అవకాశమే లేకుండా పోయింది. చిన్నప్పటి నుంచే అతని జీవితానికి ఒక సిద్ధమైన మార్గాన్ని నిర్ణయించి, అదే మార్గంలో నడవమని ఒత్తిడి పెడుతున్నారు. ఈ ఒత్తిడిలో అతని సహజ ప్రతిభలు, ఆసక్తులు, ఆలోచనలు మెల్లగా నశించిపోతాయి.

ఇంకా ఒక పెద్ద సమస్య విద్యా వ్యవస్థలోని నిర్మాణాత్మక లోపాలు. చాలా కాలేజీలలో ఇప్పటికీ పాఠ్య ప్రణాళికలు కాలానికి అనుగుణంగా మారడం లేదు. ప్రపంచం వేగంగా మారుతోంది. టెక్నాలజీ కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఉద్యోగాల స్వభావం మారుతోంది. కానీ విద్యార్థులు చదివే విషయాలు చాలాసార్లు గత దశాబ్దాల ఆలోచనలను ప్రతిబింబిస్తాయి. ఫలితంగా విద్యార్థులు చదువుతున్న ప్రపంచానికి వారు ప్రవేశించబోయే వాస్తవ ప్రపంచనికి పొంతనే ఉండడం లేదు. అంతగా విద్యార్థులు అయోమయంలో పడతారు. అయితే సమస్య కేవలం పాఠ్య ప్రణాళికలోనే లేదు. మన విద్యా వ్యవస్థలో ప్రశ్నించే సంస్కృతి దాదాపు కనిపించదు. ఒక విద్యార్థి ఎందుకు చదువుతున్నాడు? చదివిన జ్ఞానం ఎక్కడ ఉపయోగపడుతుంది? ఈ ప్రశ్నలు అడగడాని కి అవకాశమే ఉండదు. చాలా చోట్ల ఉపాధ్యాయుడు చెప్పిందే జ్ఞానం, పుస్తకంలో ఉన్నదే నిజం, పరీక్షలో రాయాల్సింది అదే. ఈ విధానం విద్యార్థులను ఆలోచించే వ్యక్తులుగా కాకుండా కేవలం సమాచారాన్ని మోసుకెళ్లే యంత్రాలుగా తయారు చేస్తుంది. ఇంకా పచ్చిగా చెప్పాలంటే చదువు చెప్పే మాస్టర్లకే సరిగ్గా చదవడం రాని పరిస్థితి. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని మనం గమనించాలి. విద్యార్థులు విఫలమవుతున్నారా? లేక విద్యా వ్యవస్థ వారిని విఫలమయ్యే పరిస్థితిలోకి నెట్టుతున్నదా? చాలా సందర్భాల్లో రెండవదే



నిజం. ఒక విద్యార్థి పదిహేను సంవత్సరాలు చదివి కూడా తనకు ఉన్న సామర్థ్యాలను గుర్తించలేకపోతే, అది అతని వైఫల్యం కాదు. అది వ్యవస్థ వైఫల్యం. ఒక యువకుడు డిగ్రీ పూర్తి చేసి కూడా తనకు ఏ పని చేయగలనో తెలియక అయోమయంలో ఉంటే, అది అతని బలహీనత కాదు. అది విద్యా విధానం లోపం. ఈ పరిస్థితి యువతలో మానసికంగా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ఒకప్పుడు చదువు ఆశను ఇచ్చేది. కానీ ఇప్పుడు చాలాసార్లు చదువు భయాన్ని కలిగిస్తోంది. పరీక్షల భయం, ఫలితాల భయం, ఉద్యోగాల భయం. ఇవన్నీ కలిసి యువతలో ఒక అశాంతిని సృష్టిస్తున్నాయి. చాలా మంది విద్యార్థులు చదువు పూర్తయ్యాక జీవితంపై నమ్మకం కోల్పోతున్నారు. నేను నిజంగా ఏం చేయగలను? అనే ప్రశ్నకు సమాధానం దొరకకపోతే, ఆ ప్రశ్న మెల్ల గా ఆత్మవిశ్వాసాన్ని కుదించే శక్తిగా మారుతుంది. ఈ పరిస్థితిని మార్చడం అసాధ్యం కాదు. కానీ దానికి ధైర్యమైన ఆలోచన అవసరం. మొదటగా మనం చదువు చెప్పే విధానాన్ని మార్చాలి. చదువు అంటే కేవలం సమాచారం సేకరణ కాదు. అది ఆలోచింపజేస్తూ నేర్చుకునే ప్రక్రియ. ఒక సమస్యను చూసి దానికి కొత్త పరిష్కారం వెతకగలిగే సామర్థ్యం చదువు ఇవ్వాలి. ఒక విద్యార్థి తన జీవితానికి అర్థం వెతుక్కోగలిగే దిశను చూపాలి.

రెండవది, నైపుణ్యాల ఆధారిత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. పుస్తకాలలో ఉన్న సిద్ధాంతం మాత్రమే. సిద్ధాంతానికి ప్రాక్టికల్ గా ప్రక్రియతో నేర్చుకునే అవకాశాలు విద్యార్థులకు కల్పించాలి. ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమలతో అనుసంధానం, ప్రాజెక్టులు ఇవన్నీ విద్యలో భాగం కావాలి. ఒక విద్యార్థి చదువుతున్నప్పుడు వాస్తవ ప్రపంచంతో సంబంధం ఏర్పడితే, అతనిలోని సామర్థ్యం బయటపడుతుంది. మూడవది, సమాజం కూడా తన దృక్పథాన్ని మార్చుకోవాలి. ప్రతి విజయాన్ని డిగ్రీలతో కొలవడం మానుకోవాలి. ఒక మంచి రైతు, ఒక నైపుణ్యమైన కార్మికుడు, ఒక సృజనాత్మక కళాకారుడు వీరందరూ సమాజానికి సమానంగా విలువైనవారు. వృత్తిపరమైన విద్యను గౌరవించే సంస్కృతి ఏర్పడితేనే యువత తమ ప్రతిభకు తగిన మార్గాలను ఎంచుకోగలుగుతుంది. అంతకంటే ముఖ్యమైన మార్పు ఒకటి ఉంది అది మన ఆలోచనలో మార్పు. చదువు అనేది ఒక ముగింపు కాదు. అది ఒక ఆరంభం. ఒక డిగ్రీ మన జీవితానికి తుది గమ్యం కాదు. అది ప్రయాణానికి ఒక దశ మాత్రమే. ఈ నిజాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం మొత్తం అర్థం చేసుకోవాలి.నైపుణ్యం లేని చదువులు కేవలం చెప్పుకోవడానికే డిగ్రీలు అనే వాక్యం ఒక విమర్శ మాత్రమే కాదు. అది ఒక హెచ్చరిక. మనం ఇప్పటికైనా ఆగి ఆలోచించకపోతే, డిగ్రీలు పెరుగుతాయి కానీ మార్గాలు తగ్గిపోతాయి. విద్య విస్తరిస్తుం ది కానీ జ్ఞానం క్షీణిస్తుంది. యువత సంఖ్య పెరుగుతుంది కానీ అవకాశాలు తగ్గిపోతాయి. కాబట్టి మార్పు ఎక్కడో ప్రారంభం కావాలి. అది విధానాలలో ప్రారంభమవచ్చు, విద్యాసంస్థలలో ప్రారంభమవచ్చు, లేదా మన ఆలోచనలో ప్రారంభమవచ్చు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. విద్య ను మళ్లీ అర్థవంతంగా మార్చాల్సిన సమయం వచ్చేసింది. చదువు మళ్లీ ఒక కాగితం ముక్కగా కాకుండా, ఒక మనిషి జీవితాన్ని నిర్మించే శక్తిగా మారినప్పుడే మన సమాజం నిజమైన ప్రగతిని చూసే అవకాశం ఉంటుంది.

అమ్జాద్ మియా, 9000517186

LOCAL NEWS
స్థానికం
LOCAL NEWS
మహబూబ్‌నగర్
మంగళవారం
31-03-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily




## రైతు సమస్యలపై అధికారుల నిర్లక్ష్య వైఖరి పట్ల అసహనం : కోదండరెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్:** రైతు సమస్యలపై అధికారులపై అసహనం వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట రైతు సంఘం అధ్యక్షులు కోదండరెడ్డి, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతుల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మార్కెట్ యార్డులో జరుగుతున్న దోపిడిపై రైతులు చేప్పిన వాదనలు విన్న రాష్ట రైతు కమిటీ అధికారులకు పాలు సూచనలు చేశారు. రైతులు కష్టపడి పంట పండించి మార్కెట్ కి తీసుకువస్తే రైతుల కడుపు కొట్టడం సరికదని అన్నారు. రైతు లేకపోతే రాజ్యం సుభిక్షంగా ఉండదని రైతు సంఘం నాయకులు వాపోయరు. క్వింటలుకు ఒక కేజీ మాత్రమే తరుగు తీయలని తెలిపారు. మొట్ట తీయకుడదు, కమిషన్ నాలుగు శాతం కాకుండా 2శాతం మాత్రమే కమిషన్ తీయలని సూచించారు. రైతులకు కనిస సౌకర్యలు అయిన నిలువ ,నీడ త్రాగు నీరు,మూత్రశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్లో ఇంత జరుగుతున్న అధికారులు ఎందుకు చర్యాలు తీసుకొలేరని అడిగారు. రైతులకు అన్ని సౌకర్యలు కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో రాష్ట అధ్యక్షులు రంగారావు, వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ ,కార్యదర్శి రాజీరెడ్డి , బోరెడ్డి , నరసింహరెడ్డి , మల్‌రెడ్డి ,ప్రవీణ్ రెడ్డి , వైస్ చైర్మన్ మల్లేశం రైతులు పాల్గోన్నారు.




## డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** అరైవ్ అలైవ్ 3వ దశను పురస్కరించుకుని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్, మల్కాజ్‌గిరి సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో చర్లపల్లి హెచ్‌పిసిఎల్ కంపెనీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. రోడ్లు, భద్రత, ప్రజా సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 76 మంది భారీ వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. ఇందులో 8 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. 31 మందికి దృష్టిలోపం కారణంగా కళ్లద్దాల అవసరం ఉందని నిర్ధారించారు. ఇద్దరికి రెటీనా సంబంధిత సమస్యలు, ఐదుగురికి వర్ణ అంధత్వం, ఒకరికి ఒక కన్ను మాత్రమే పని చేస్తున్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు సావిత్రి, డిసిపి ప్లాంట్ ఇన్‌చార్జ్ సురేష్,సేఫ్టీ మేనేజర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.




## సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని జగ్గంగూడ కౌన్సిలర్ చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి సహకారంతో మూడుచింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడకు చెందిన సింగర్తి నవనీతకు రూ.55,500లు చెక్కును అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు జహంగీర్, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, సాయి, బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.



## బస్ సర్వీసుల పునరుద్ధరణకు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** బస్సు సర్వీసులను పునరుద్దరించాలని హకింపేట డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన తక్షణమే బస్సు సర్వీస్ వసతులను కల్పించిన డిపో మేనేజర్ సరితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్ హైమారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత నెల మార్చిలో శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్సు వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డిపో మేనేజర్‌కు వివరించారు. మహిళా శక్తి చేసిన వినతుల మేరకు స్పందించిన డిపో మేనేజర్ బస్సులను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా శక్తి మై వాయిస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల బెడద తీర్చండి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మల్కాజ్‌గిరి జోన్ శామీర్‌పేట డివిజన్ తూంకుంటలో వీధి కుక్కల బెడద తీవ్రతరమైందని వీధి కుక్కల సమస్యకు పరిష్కా రం చూపాలని కోరుతూ తూంకుంట యువనాయకుడు రంగు ప్రవీణ్‌గౌడ్, డిప్యూటీ కమిషనర్ వసంతకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన వీధి కుక్కల దాడిలో చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా గాయాలపాలౌతున్నారని మహిళలు బయటకు వెళ్లలేకపోతున్నారని అన్నారు. అలాగే ప్రతీ వార్డులో దోమలు విజృంభిస్తున్నాయని, దోమల నివారణకు ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు.




# దళితులను అవమానపరచడం అనాగరికం

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** దళితులను అవమానపరచడం, దూషించడం అనాగరికమని దళితుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నంలు అన్నా రు. సోమవారం మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లిలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులతో కలిసి దళితులతో సమావేశమై శ్రీరామనవమి పండగ రోజున జరిగిన సంఘటనపై వివరాలను గ్రామస్థులు వివరించారు. గ్రామంలోని దేవాలయంలో శ్రీరామనవమి పండగ రోజున దళిత మహిళలు కొబ్బరి కాయ లు కొడుతుంటే కులం తక్కువ వారని కొబ్బరికాయలు కొట్టొద్దని కొంతమంది మహిళలు కులం పేరుతో దూషించారని చెప్పారు. తాము అందరి తో సమానంగా పంతులుకు జీతాలు ఇస్తున్నామని ఏదైనా పండగలు నిర్వహిస్తే అందరితో పాటే చందాలు ఇస్తున్నామని తెలిపారు. మహిళలు మమ్మల్ని రెచ్చగొట్టి అవమానపరుస్తున్నారని మా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని వాపోయారు. ఇట్టి విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని అయినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఇప్పటికైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నంలు మాట్లాడుతూ గ్రామస్థులు చేసే న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇట్టి అంశాన్ని సిపిఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, శాసనమండలి సభ్యులు సత్యం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు దొరవి బాబు, సిపిఐ మూడుచింతలపల్లి కార్యదర్శి తప్పెట్ల రాములు గౌడ్, శామీర్‌పేట మండల కార్యదర్శి నరేంద్రప్రసాద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జహంగీర్, చంద్రయ్య,

## రూ.10కోట్లతో అలియాబాద్ మున్సిపల్‌ను అభివృద్ధి చేద్దాం




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటీని విడతల వారీగా అభివృద్ధి పరుస్తామని ఈ పనులకు కౌన్సిల్ సభ్యులు సహకరించాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో రూ.10 కోట్లతో 2026–27 ఆర్థిక సంవత్సరానికి కౌన్సిల్ సభ్యుల ఆమోదం మేరకు అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అనంతరం చైర్ పర్సన్ శిరీష మాట్లాడుతూ వార్షిక బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానిస్తున్నామని చెప్పారు. అంచనా వేసిన బడ్జెట్ వివరాలు ఇంటి పన్నులు 4 కోట్ల 45లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దె రూ.9లక్షలు, మ్యుటేషన్ (పేరు మార్పిడి) రూ.9 లక్షలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు రూ.12లక్షలు, భవనాల అనుమతులపై ఆదాయం రూ.2 కోట్ల 25 లక్షలు, లేఅవుట్ సబ్ డివిజన్ ఫీజు రూ.కోటి 75లక్షలు, ఇఎండిల ద్వారా ఆదాయం 1లక్ష 50 వేలు, మొత్తం మున్సిపల్ సాధారణ ఆదాయం రూ.10కోట్ల 20 లక్షలు ఉందని చెప్పారు. ఈ బడ్జెట్‌లో చేయాల్సిన అభివృద్ధి పనులు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు రూ.3కోట్ల 26లక్షలు, మొత్తం వ్యయం రూ.9 కోట్ల 62 లక్షలు, మిగులు బడ్జెట్ రూ.58 లక్షలు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు, ఎఇ సనా షాహీన్, జూనియర్ అకౌంటెంట్ సిహెచ్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



**సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం**

పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే సాధ్యమైందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పేదలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతున్నాయని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లిలోని రుద్రబోయిన లక్ష్మి కృష్ణ, లక్ష్మి నర్సయ్యల నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్ జశ్వంత్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు వెంకటేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సినేషన్

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలు, హాస్టళ్లల్లో ఉండే 14 –15 ఏళ్ల వయస్సున్న విద్యార్థినులందరికీ హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను అందించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. సోమవారం కీసర మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నివారణలో భాగంగా చేపట్టిన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యాక్సిన్ ఎంత డోసు ఇస్తున్నారన్న విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ ధృవపత్రాలను అందచేసారు. డిఎంహెచ్ఒ సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలికలందరికి వ్యాక్సిన్ చేరేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దీనికి సంబంధించి అవగాహన కల్పించేలా అక్కడి ప్రాంతవాసులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పిహెచ్‌సి సెంటర్ మరమ్మత్తు పనుల కు సంబంధించి గతంలో నిధులు మంజూరు చేసామని, వాటి పనులు ఏ మాత్రం జరుగుతున్నాయన్న విషయాన్ని వైద్యాధికారులను అడిగి అక్కడి మందులను పరిశీలించి ఎక్స్‌పైర్ అయిన వాటిని గుర్తించి తీసేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో రాజేష్, డిఎంహెచ్ఒ ఉమాగౌరి, వైద్యారోగ్య శాఖ వైద్యులు కౌషిక్, సత్యవతి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు జాగ్రతలు తప్పనిసరి

### కలెక్టర్ దీపక్ తివారి




**ప్రజాపక్షం/తాండూరు:** ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రతలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. 99రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన అమలులో భాగంగా సోమవారం తాండూరు మండల పరిధి కరణ్‌కోట్ సిసిఐ కమ్యూనిటీ హాల్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వ్యతిరేకత, రోడ్డు భద్రత అవగాహన, ఉచిత కంటి అద్దాల పంపిణీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా సిసిఐ గెస్ట్ హౌస్ ఆవరణలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రాతో పాటు సిసిఐ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల రోడ్డు భద్రతపై సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా హెల్మెట్ ధరించక పోవడం కారణంగా ఎక్కువ సంఖ్యలో మరణాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశంలో డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కల్పిస్తూ కౌన్సింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పోలీసు శాఖ, అధికారులు ప్రజా ప్రయోజనాల కోసం తమ సహకారాన్ని అందించాలని సూచించారు. గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన కంటి అద్దాలు ఇవ్వడంపై సిసిఐ యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు.

**ట్రాఫిక్ నియమాలు పాటించాలి...జిల్లా ఎస్పీ**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా అన్నారు. వాహనాలు నడపించే సమయంలో స్పష్టమైన కంటి చూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని సూచించారు. ప్రభుత్వం ఆదేశా ల మేరకు అరైవ్ అలైవ్ కార్యక్రమం మూడవ విడతలో భాగంగా ఉచింత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి లోపాలు ఉన్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ నర్సిములు, వైస్ చైర్మన్ రజాక్, గ్రామ సర్పంచ్ రాజ్‌కుమార్, నాయకులు పట్లోళ బాల్‌రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్, డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, సిసిఐ జనరల్ మేనేజర్ సరోజ, రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు బంద్, అమ్మిన వారికి రూ.50వేల జరిమానా

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని బీరోల్ గ్రామంలో బెల్ట్ షాపులబంద్ చేయాలని , స్థానిక సర్పంచు సుధాకర్ వార్డు మెంబర్స్‌తో కలిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మద్యపానం అమ్మిన వారికి రూ.50వేల జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని అన్నారు. ముఖ్యంగా మద్యపానం వల్ల ఆరోగ్యాలు పాడైతున్నాయని, ఆర్థికంగా నష్టపోతున్నారని, కుటుంబాలు పాడవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు తలారి రాజు, వార్డు సభ్యులు, నర్సింలు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## వర్షాకాలంలో నీటి ముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు

### ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** వర్షాకాలంలో నీటి ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా అధికారులకు ఆదేశించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో ఎదులాబాద్ డివిజన్ లక్ష్మీనారాయణ చెరువును కమిషనర్ రాధిక గుప్తా, డిప్యూటీ కమిషనర్ వాణి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాధిక గుప్తా మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని చేపట్టవలసిన ముందస్తు చర్యలు తీసుకోవాలని చెరువులో నీటి ప్రవాహం సజావుగా ఉండేలా కాలువలను శుభ్రపరచాలని, చెరువు పరిరక్షణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మాన్సూన్ ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఇ రమేష్ బాబు, డిప్యూటీ ఇఇ నరేష్ కుమార్, ఎస్ డబ్ల్యూఎం డిఇఇ ఎస్ శ్రీనివాస్, ఎఇ రవి కిరణ్, ఎఇ విశేష్ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కొంపల్లి సర్కిల్‌లో పర్యటించిన పింకేష్ కుమార్

**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, కొంపల్లి సర్కిల్56 పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా సాయిబాబా నగర్, రాజీవ్ గృహకల్ప ప్రాంతాలలో శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రత్యేకం గా (సిఅండ్‌డి) వ్యర్థాల ఎత్తివేత పనులను సమీక్షిస్తూ, వీటి ని సమయానికి పూర్తిగా తొలగించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఎక్కడైనా వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పనుల పురోగతిని వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, సిబ్బంది క్రమం తప్పకుండా ఫీల్డ్‌లో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ తిరుపతి ఎఇ.కృప, శానిటేషన్ సూపర్‌వైజర్ కె.పోతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## దివ్యాంగుల సాధికారతకు జిఎల్‌ఆర్ఎ ఇండియా ప్రాజెక్ట్ ప్రారంభం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** జిఎల్‌ఆర్ఎ గ్లోబల్‌కు అనుబంధంగా 1966లో స్థాపించబడిన జిఎల్‌ఆర్ఎ ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుంది. ఈ క్రమంలో దక్షిణ భారతదేశంలో దివ్యాంగుల సామాజిక సమ్మిళితం, సాధికారతను బలోపేతం చేసే లక్ష్యంతో కొత్త ప్రాజెక్టును సోమవారం ప్రారంభించింది. జర్మనీ ఫెడరల్ మంత్రిత్వ శాఖ, డి.ఎ. హెచ్.డబ్ల్యూ సహకారంతో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టు ముఖ్యంగా వికలాంగులైన మహిళల ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక భద్రత, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తోంది. సమగ్ర, సహాయక వాతావరణాన్ని నిర్మించడం ఈ కార్యక్రమం లక్ష్యంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ దినేష్, ప్రెసిడెంట్ విక్రమ్ దేవ్ రావు, సెక్రటరీ మీరా రావు, సిఇఒ డా.అనంత రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎన్‌పిఆర్‌డి కేంద్ర అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ పాల్గొని జ్యోతి వెలిగించి ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దివ్యాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపడి సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించబడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ రేణుకా, సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## అప్పల వసూలుకు స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/పెద్దేముల్:** మొండి బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లక్ష్యాన్ని సాధిస్తామని తటేపల్లి పిఎస్‌సిఎస్ పర్సన్ ఇంచార్జ్ రామకృష్ణ అన్నారు. సోమవారం తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను నిర్వహించారు. అనంతరం 2026–27ఆర్థిక సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా పర్సన్ ఇంచార్జ్ రామకృష్ణ మాట్లాడుతూ దీర్ఘకాళిక అప్పుల కింద రూ.1కోటి 92లక్షల నిధులు రావాల్సి ఉందని, ఇప్పటి వరకు రూ.32లక్షలు రికవరీ చేయడం జరిగిందని వివరించారు. రాని బకాయిల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఈ ప్రాంత రైతులు సూచించిన విధంగా సుగర్ కేన్ కటింగ్ యంత్రాన్ని అందించడానికి సాధ్యా అసాధ్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజమౌళి, మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ అంజయ్య, సిబ్బంది, గ్రామాల సర్పంచ్‌లు, రైతులు ఉన్నారు.

## న్యాయం జరిగే వరకు పోరాటం

### ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోని అధికారులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కీసర మండల రెవెన్యూ పరిధిలోని కుందర్‌పల్లి గ్రామం సర్వే నంబర్ 68లో 5 ఎకరాల భూమి ఉండేదని అట్టి భూమిని ఓ వ్యక్తి కబ్జాచేసి ఇతరులకు విక్రయించాడని ఆ భూమి తమదేనంటూ చనిపోయిన దశరథం భార్య, కూతుర్లు సోమవారం విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తంచేశారు. అట్టి భూమిలో ఎంఎం సి నుండి గానీ, మున్సిపల్ నుండి గానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అక్రమ ఫార్మ్ హౌస్ నిర్మాణం చేపడుతున్నారని,ఈ అక్రమ నిర్మాణాలపై కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు పనులు నిలిపివేయాలని ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకుండా నోటీసుల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టి భూమిపై మేడ్చల్ జిల్లా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు కొనసాగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఇకనైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.



## కోల్ పెన్షనర్స్ ధర్నాకు సింగరేణి రిటైర్ ఉద్యోగుల సంఘీభావం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న కోల్ పెన్షనర్స్ ధర్నాకు ఘట్‌కేసర్ సర్కిల్‌లోని సుప్రభాత్ టౌన్‌షిప్ కొర్రెములలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసుకొని వాళ్ల కు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆళవందార్ వేణు మాట్లాడుతూ కోల్ ఇండి యా లిమిటెడ్ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.10వేలు చెల్లించాలని కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం 1998 ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ స్కీం సవరించి పెన్షన్ పెంచాలని ప్లే కార్డ్స్ పట్టుకొని స్లోగన్స్ ఇస్తూ నిరసన తెలుపుతున్నామని తెలిపారు. ప్రాణాలను పణం గా పెట్టి అతి లోతైన బొగ్గు గనులలో గాలి, వెలుతురు లేకుండా ఊపిరి ఆడని పరిస్థితుల్లో కఠోరంగా దశాబ్దాల పాటు శ్రమించి బొగ్గు వెలికితీసి దేశ ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య, బీరయ్య, సంయుక్త కార్యదర్శి సామంతుల నర్సింగ్ రావు, గీస కనకయ్య,తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ సిలిండర్ల ముఠాకు చెక్

## 10 మందిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ప్రజాపక్షం/సిటీబ్యూరో : అక్రమ గ్యాస్ సిలిండర్ల విక్రయ ముఠాకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్‌పెట్టారు. సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న 10 మందిని అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.22 లక్షల విలువైన డిసిఎం, బొలెరో, టాటా ఏస్, ఆటోలు మొత్తం 10 వాహనాలు, సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్(జూబ్లీహిల్స్ జోన్) బృందం, బంజారాహిల్స్ పోలీసులతో కలిసి జరిపిన సంయుక్త దాడి వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సోమవారం తెలిపారు. యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతను ఆసరాగా చేసుకుని అడ్డదారిలో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ముఠా అక్రమాలకు పాల్పడుతోంది. ఈ క్రమంలోనే అక్రమ గ్యాస్ సిలిండర్ల దందాలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు మహమ్మద్ అమీర్ ప్రధాన నిందితుడు. గ్యాస్ డెలివరీ బాయ్‌లు మొహమ్మద్ యూసుఫ్, మొహమ్మద్ ఇస్మాయిల్, రామారావు, లోక్ కుమార్, కూలీ మొహమ్మద్



సక్రుద్దీన్, డ్రైవర్ మొహమ్మద్ ముంతాజ్ అన్సారీ, మొహమ్మద్ మినాజ్ అన్సారీ, రాజేష్ పాల్, నల్ల పోచమ్మ దేవాలయ అధ్యక్షుడు (స్థల యజమాని అద్దెకు ఇచ్చిన వ్యక్తి) రామ్‌రాజ్‌సింగ్ సహకరిస్తున్నారు. ప్రధాన నిందితుడు మొహమ్మద్ అమీర్ శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ' నిర్వహిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా, అతను బంజారాహిల్స్ నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని ఒక శ్మశాన వాటికలో గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ (డంపింగ్) చేస్తున్నాడు. అక్కడి నుంచి తన సిబ్బంది సహాయంతో అవసరమున్న ఖాతాదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా లాభాలు గడిస్తున్నట్లు సమాచారం అందింది. రూ.2,100కు విక్రయించాల్సిన కమర్షియల్ సిలిడర్‌ను రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యదేందర్, ఎస్ఐ రవిరాజ్ బృందం, బంజారాహిల్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.22 లక్షల విలువైన పది వాహనాలు, 414 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. గ్యాస్ సిలిండర్ల గురించి జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని.. కావాలని వదంతులు వ్యాప్తి చేస్తున్నారని డిసిపి గైక్వాడ్ తెలిపారు.

## కెబిఆర్ పార్క్ ఫ్లైఓవర్ పనులు వేగవంతం

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలోని కీలక ప్రాంతాల్లో ఒకటైన బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లో చేపట్టిన ఫ్లైఓవర్ పనులను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్క్ హయత్ హోటల్ సమీపంలో జరుగుతున్న కెబిఆర్ పార్క్ ప్యాకేజ్ పనుల పురోగతిని చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్‌తో కలిసి ఆయన సమీక్షించారు. పనుల ప్రస్తుత పరిస్థితిని అధికారులు కమిషనర్కు వివరిస్తూ.. ఇప్పటివరకు మొత్తం 6 పియర్ ఫౌండేషన్‌ల తవ్వకాలు పూర్తయ్యాయని, అందులో 3 పియర్లకు పిసిసి బెడ్ పనులు కూడా ముగిశాయని తెలిపారు. అలాగే, రాఫ్ట్ ఫౌండేషన్‌ల కోసం మంగళవారం నుంచి స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రాజెక్ట్ గడువులోగా పూర్తి కావాలంటే పనుల్లో మరింత వేగం పెంచాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ సంస్థ అయిన మెయిల్ అదనపు యంత్రాలను, కూలీలను ఏర్పాటు చేసుకోవాలని



సూచించారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు సాగుతున్న తీరుపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఇఇ (ప్రాజెక్ట్స్), డిఇఇ, ఎఇఇ అధికారులతో పాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సరస్సుల పునరుద్ధరణకు హెచ్‌ఎండిఏ

### రూ. 2.87 కోట్లతో అంబిఫిబియస్ ఎక్స్‌వేటర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలోని సరస్సుల పునరుద్ధరణ, సంరక్షణను మరింత వేగవంతం చేసేందుకు హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండిఏ) అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా రూ. 2.87 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన అంబిఫిబియస్ ఎక్స్‌వేటర్ యంత్రాన్ని సోమవారం అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కలిసి ఈ నూతన యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ ఉన్నతాధికారులు జెఎంసి (క్యూర్) వెంకన్న, చీఫ్ ఇంజనీర్ బి.రవీందర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ అప్పారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. సాధారణ ఎక్స్‌వేటర్లకు భిన్నంగా, ఇది నీటిలోనూ, చిత్తడి నేలల్లోనూ సులభంగా ప్రయాణించగలదు. హుస్సేన్ సాగర్ సరస్సులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్తను తొలగించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ యంత్రం నిరంతరాయంగా పనిచే



సేలా ప్రతి షిఫ్ట్ ఒక స్కిల్డ్ ఆపరేటర్, ఒక సెమీ స్కిల్డ్ ఆపరేటర్ అందుబాటులో ఉంటారు. అవసరమైన సాంకేతిక సాయం కోసం సర్వీస్ ఇంజనీర్లను కూడా కేటాయించారు. హైదరాబాద్‌ను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దే క్రమంలో చర్యలు చేపట్టామని హెచ్‌ఎండిఏ అధికారులు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించడంలో మరింత శ్రద్ధ

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల పత్రాలను కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డితో కలిసి స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు స్పష్టం చేశారు.



ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలన్నారు. రెవెన్యూ శాఖకు 8, ఇతర శాఖకు సంబందించి 25, మొత్తం 33 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌సి కార్యాచరణలో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు

### రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవ సహకార అభివృద్ధి అధికారి జొన్నలగడ్డ పద్మావతి



ప్రజాపక్షం/రంగారెడ్డి: సవరించబడిన ఎస్‌సి కార్యాచరణ ప్రణాళికలో ప్రభుత్వ పథకాల లబ్ధికి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి అధికారి(ఎస్‌సి కార్పొరేషన్ ఇడి) జొన్నలగడ్డ పద్మావతి సోమవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులందరూ ఏప్రిల్ 8వ తేదీ లోపు https://tgobmms.cgg.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా ఎస్‌సి కార్పొరేషన్ ఇడి పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఒబిఎం ఎం ఎస్ పోర్టల్ లో చేసుకున్న దరఖాస్తు ఫార్మ్ తోపాటు గా సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులు జతపరచి స్థానికంగా ఉన్న ఎంపిడిఓ లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అందజేయవలసిందిగా ఎస్‌సి కార్పొరేషన్ ఇడి స్పష్టం చేశారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులు, మిల్లర్లతో జిల్లా అదనపు కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోలు చేయుటకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. రైతులు ధాన్యం తీసుకు వచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సన్నరకం వరి, ముతక రకాలను వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వేరు చేయాలని, ఎంట్రీని రోజువారీ ప్రాతిపదికన చేయాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా, ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, ధాన్యం నిల్వలు తరలించేలా చూడాలన్నారు.కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్ లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా టార్పాలిన్‌లు, ప్యాడీ క్లీనర్‌లు, తూనికలు, పొట్టు రిమూవర్, ఫీల్డ్ బ్యాలెన్స్‌లు, తేమ యంత్రం వంటి అన్ని మౌలిక సదుపాయాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కె.వనజాత, సివిల్ సప్లైస్ డిఎం జె.హరీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత, డిసిఒ సుధాకర్, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## జర్నలిస్ట్‌లకు అండగా ఉంటా

### ఐజెయు జాతీయ ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటాననీ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన వై.నరేందర్‌రెడ్డి అన్నారు. ఐజెయు జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనా నరేందర్‌రెడ్డిని ఎల్‌బినగర్ వనస్థలిపురం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రంగారెడ్డి యూనిట్, ఎల్‌బినగర్ నియోజకవర్గ జర్నలిస్టుల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమానికి ఐజెయు నిరంతరం పోరాడుతుందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై జాతీయ స్థాయిలో గలమెత్తుతామన్నారు. కార్యక్రమంలో టియుడబ్లుజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.సలీమ్ పాషా, మేకల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, శివకుమార్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, ఆరోగ్య శిబిరం కన్వీనర్ రాజశేఖర్, జర్నలిస్టులు శ్యామ్ ప్రసాద్, బెల్లిమల్లేష్ యాదవ్, జర్నలిసులు కిసరి మల్లేష్ గౌడ్, వెంపటి గణేష్, శ్రీనివాస్, రఫీ, చంద్రశేఖర్ గౌడ్, రాజశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సొంతింటి కల నిజం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాపక్షం/కొందుర్గు: గ్రామీణ పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కొందుర్గు మండలం పర్వతాపూర్ గ్రామంలో లబ్దిదారులు అనూష రమేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని గృహప్రవేశం చేయించారు. దాంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, నేతలు పురుషోత్తంరెడ్డి, మాజీ ఎంపిటిసి మల్లేష్, మాజీ వైస్ ఎంపిపి మంగులాల్‌నాయక్‌లు పాల్గొన్నారు.

### గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

ఫరూఖ్‌నగర్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సూచించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ దూసకల్ గ్రామ పంచాయతీ అభివృద్ధి



కోసం తన వంతు సహాయ సహకారాలు అంధించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిక్మయి అంజి, ఉప సర్పంచ్ కుమార్, వార్డు సభ్యులు మహేందర్, ఖాజాపాషా, ఐనాల రవి, గ్రామ కమిటి అధ్యక్షుడు నజీర్, లింగారం యాదయ్య, ఆంజనేయులు గౌడ్, లక్ష్మయ్య, అర్షద్, ఫయాజ్, నయీమ్, అశోక్, కమ్మరి శివ, వెంకటేష్, సమద్, పంల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొండిగారి రాములు సంతాప సభ



ప్రజాపక్షం/రంగారెడ్డి : మాజీ ఎమ్మెల్యే, సిపిఐ సీనియర్ నాయకులు కొండిగారి రాములు "సంతాపసభ"లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిస్టు శ్రేణులు, అభిమానులు, రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శివకుమార్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్ సోమవారం ఒక పత్రికా ప్రకటనలో కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సంతాప సభ 31న మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఇబ్రహీంపట్నం పట్టణంలోని మంచాలరోడ్‌లో ఉన్న భారత్ గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని, సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరుకానున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ మధుసూదన్ రెడ్డి



ప్రజాపక్షం/షాబాద్: రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో రైతులతో కలిసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అధికారి ప్రవీణ్, సిఇఒ శివకుమార్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, సర్పంచ్‌లు ప్రభాకర్ రెడ్డి, అశోక్, నాయకులు చెన్నయ్య, మహేందర్‌గౌడ్, రవీందర్ నాయక్, గౌరీశ్వర్, సంజీవరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రుణాలు సకాలంలో చెల్లించాలి

### సహకార సంఘం ప్రత్యేకాధికారి రవికుమార్



ప్రజాపక్షం/యాచారం : రైతులు సహకార సంఘంలో తీసుకున్న దీర్ఘకాలిక. స్వల్పకాలిక ఋణాలను సకాలంలో చెల్లించాలని యాచారం మండల సహకార సంఘం ప్రత్యేకాధికారి ఎం.రవికుమార్ అన్నారు. సోమవారం మండల కేద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సంధర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ధీర్ఘకాలిక రుణాలు చెల్లించనిచో రైతులకు నోటిసులు ఇచ్చి 1964 యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా యాప్ ద్వారా కాకుండా మ్యానువల్‌గా ఇవ్వాలని రైతులు కోరగా వ్యవసాయధికారి రవినాథ్ అది సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో యాచారం బ్రాంచ్ మేనేజర్ నాగలక్ష్మి , సహకార సంఘం సిఈఓ నాగరాజు, సర్పంచ్‌లు మస్కు అనిత, దేరంగుల శంకర్, రాజు, నీలం జాన్సీ.యాచారం ఉప సర్పంచ్ మంగ, తదితరులు పాల్గోన్నారు.

## పేదలకు సొంతిల్లు కల్పించడమే లక్ష్యం



ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామీణ నిరుపేదలకు సొంతిల్లు కల్పించడమే ప్రభుత్వలక్ష్యమని ఎలికట్ట సర్పంచ్ నవకిరణి బుడ్డ నర్సింహులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో 99రోజుల ప్రణాళికలో భాగంగా మూడు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించడంతోపాటు పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేయించారు. లబ్దిదారులకు నూతనవస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటిట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీఎంపిటిసి కావలి శ్రీశైలం, ఉపసర్పంచ్ అభినవ్, వార్డు సభ్యులు పి.సురేష్, లింగం, జి.శ్రీను, పి.కళమ్మ, అరుణమ్మ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు




ప్రజాపక్షం/యాచారం : రైతులు ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు పాటిస్తే అధిక లాబాలు పొందుతారని గడ్డమల్లాయగూడ గ్రామ సర్పంచ్ అచ్చన మంగ జంగయ్య అన్నారు. సోమవారం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రైతులు పంటమార్పిడిలో అధునిక వ్యవసాయ పద్దతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అర్.రవినాథ్, ఉపసర్పంచ్ గౌర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌కు ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన ఇబ్రహీంపట్నం ఎలక్ట్రానిక్ మీడియా చెందిన జర్నలిస్టు ముచ్చర్ల నాగేష్‌కు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సోమవారం ఇబ్రహీంపట్నం జర్నలిస్టులు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు జె.శ్రీనివాస్, పి.వెంకటేష్, పి.జగన్, పి.క్రాంతికుమార్, వై మహేష్, జె.అంజయ్య, పి.శ్రీనివాస్, లింగం, సైదులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారుడికి చేయూత



ప్రజాపక్షం/కేశంపేట: కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వట్టెల రామయ్య కుటుంబానికి సర్పంచ్ పల్లె బ్రదర్స్ ఆనంద్‌కుమార్ రూ.50వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన వట్టెల రామయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, బిల్లులు మధ్యలోనే నిలిచిపోవడంతో తాను ముందుకు వచ్చి రూ.50వేల ఆర్థిక సహాయం చేసినట్లు వివరించారు. బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి ఆర్థికసహాయం చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు జాప్యం లేకుండా కొనసాగించాలని, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి సత్యనారాయణ, రాజు, శ్రీనివాస్, బుర్రె మల్లేష్, దుబ్బ జంగయ్య, వట్టెల శివ యాదవ్, ఈటమోని శేఖర్ యాదవ్, కొంగరు ఆంజనేయులు పాల్గొన్నారు.

# వైభవ్ ఊచకోత

## సిఎస్‌కెపై భారీ విజయంతో రాజస్థాన్ బోణీ..!

ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఘనంగా ఆరంభించింది. ఆల్ రౌండ్ షోతో చెన్నై సూపర్ కింగ్స్‌ను వణికించిన రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 128 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ(52), యశస్వీ జైస్వాల్(38 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వైభవ్ అయితే.. ఫోర్లు, సిక్సర్లతో చెన్నై బౌలర్లను హడలెత్తించాడు. 15 బంతుల్లోనే రికార్డు హాఫ్ సెంచరీతో ఈ చిచ్చరపిడుగు లక్ష్యాన్ని కరిగించగా.. యశస్వీ క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. తొలుత సిఎస్‌కెను 127కే ఆలౌట్ చేసిన రాజస్థాన్.. వైభవ్ సూర్యవంశీ(52 : 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులతో స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. తొలుత బౌలర్లు చెన్నైను 127 కట్టడి చేయగా ఓపెనర్లు ధాటిగా ఇన్నింగ్స్ మొదలెట్టారు. మ్యాట్ హెన్రికి చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(52) 4, 6 బాదగా యశస్వీ జైస్వాల్ (38 నాటౌట్) చివరి బంతిని బౌండరీ దాటించాడు. అన్షుల్ కంబోజ్ వేసిన ఐదో ఓవర్లో రెచ్చిపోయిన వైభవ్.. రెండు ఫోర్లు, సిక్సర్‌తో 15 పరుగులు పిండుకున్నాడు. పవర్‌ప్లేలో వరుసగా రెండు సిక్సర్లతో 15 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడీ హిట్టర్. అతడి విధ్వంసంతో పవర్ ప్లేలో 74 రన్స్ చేసింది రాజస్థాన్. ఆ తర్వాతి ఓవర్లోనే సర్ఫరాజ్ డైవింగ్ క్యాచ్‌తో సూర్యవంశీ ఔటయ్యాడు. ధ్రువ్ జురెల్(18) వస్తూనే బౌండరీలతో సిఎస్‌కె బౌలర్లను హడలెత్తించాడు. కంబోజ్ ఓవర్లో స్కూప్ షాట్ ఆడాలనుకున్న జురెల్ దురదృష్టవశాత్తూ బంతిని వికెట్ల మీదకు ఆడుకున్నాడు. అప్పటికే రాజస్థాన్ విజయం వాకిట నిలవగా యశస్వీతో కలిసి కెప్టెన్ రియాన్‌పరాగ్(14 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు. నూర్‌అహ్మద్ ఓవర్లో బ్యాక్వర్డ్ పాయింట్ లో పరాగ్ సిక్సర్, హెన్రీ వేసిన 12వ ఓవర్ తొలి బంతిని యశస్వీ స్టాండ్స్‌కి పంపడంతో 8 వికెట్ల తేడాతో రాజస్థాన్ బోణీ కొట్టింది.

గువాహటిలో టాస్ ఓడిన సిఎస్‌కెకు శుభారంభం లభించలేదు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(6)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూ శాంసన్(6)ను నండ్రె బర్గర్(226) బౌల్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ తర్వాతి ఓవర్లో గైక్వాడ్‌ను ఆర్చర్ ఔట్ చేయగా.. ఆయుష్



మాత్రే(0)ను బర్గర్ పెవిలియన్ చేర్చాడు. బర్గర్, ఆర్చర్ విజృంభణతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఇంప్యాక్ట్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్(17) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, జడేజా అతడిని ఎల్బీగా ఔట్ చేయగా.. చెన్నై 51కే ఐదు వికెట్లు కోల్పోయింది. ఆవెంటనే సిక్సర్ బాదిన శివం దూబే(6)ను సైతం జడ్డూ ఔట్ చేసి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కార్తిక్ శర్మ(18), జేమీ ఓవర్టన్(43)లు గొప్పగా ఆడారు. సందీప్ శర్మ ఓవర్లో బౌండరీతో సీఎస్కే స్కోర్ వంద దాటించాడు ఓవర్టన్. అన్షుల్ కంభోజ్ (7 నాటౌట్) రెండు ఫోర్లు బాదగా.. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఓవర్టన్ సిక్స్ బాదగా చెన్నై 127 పరుగులకే ఆలౌటైంది.

## రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్స్ ఛాంపియన్‌షిప్
## పవర్ హౌస్ తైక్వాండో అకాడమీకి పతకాలు




తెలంగాణ ఓపెన్ రాష్ట్రస్థాయి 14వ ఇంటర్‌స్కూల్స్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2026లో పవర్ హౌస్ తైక్వాండో అకాడమీ లిటిల్ ఛాంప్స్ అద్భుత ప్రతిభ కనబరిచారు. క్రమశిక్షణ, పట్టుదలకు తోడు నైపుణ్యాన్ని ప్రదర్శించిన యువ క్రీడాకారులు 9 బంగారు పతకాలు, 1 వెండి పతకం, 6 కాంస్య పతకాలు గెలుపొంచారు. ఒక టోర్నమెంట్లో ఇన్నేసి పతకాలు సాధించడం పవర్ హౌస్ అకాడమీ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన అని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 19 మంది పాల్గొనగా వీరిలో 16 మంది పోడియం మీద సగర్వంగా పతకాలు అందుకోవడం సంతోషకరమైన విషయమని వారు వెల్లడించారు. తెలంగాణ ఓపెన్ స్టేట్ లెవల్ ఇంటర్‌స్కూల్స్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2026లో రాష్ట్రం నలుమూలల నుంచి కఠిన పోటీ ఎదురైనప్పటికీ, పవర్ హౌస్ జట్టు క్యోరుగు, పూమ్సే విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ గర్వకారణమైన సందర్భంలో వరల్ తైక్వాండో గ్లోబల్ సభ్యులు, నేషనల్ పూమ్సే, క్యోరుగు రిఫరీలు అరవింద్ నంద్యాల సురేష్ బోయా విజేతలను అభినందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని వారు ప్రశంసించారు. ప్రతి విద్యార్థి పడిన కష్టం ఈ చారిత్రాత్మక విజయానికి కారణమని వారు తెలిపారు. జాతీయ స్థాయి ఛాంపియన్లను తయారు చేయడమే లక్ష్యంగా పవర్ హౌస్ తైక్వాండో అకాడమీ క్రమశిక్షణ అందిస్తోందని, నిరంతర సాధన.. ప్రతిభాభివృద్ధిపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతోందని వారు పేర్కొన్నారు. యువతరంలోని ప్రతిభను ప్రోత్సహిస్తూ మరిన్ని గొప్ప విజయాలను సాధించేందుకు అకాడమీ కట్టుబడి ఉందని తెలిపారు. ఇటీవలి ఈ విజయాన్ని పురస్కరించుకుని త్వరలోనే ఒక చిన్న విజయోత్సవ సమావేశం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.


## ప్రజ్ఞానంద బోణీ.. అనీశ్ గిరిపై విజయం

సైప్రస్ : ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అదిరిపోయే బోణీ కొట్టాడు. ఆదివారం జరిగిన ఓపెన్ కేటగిరీ తొలి పోరులో ప్రజ్ఞానంద 10 తేడాతో నెదర్లాండ్స్ జిఎం అనీశ్ గిరిపై అద్భుత విజయం సాధించాడు. తన కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న గిరిపై ప్రజ్ఞానంద తనదైన ఆధిపత్యం ప్రదర్శించాడు. గేమ్‌లో ఒక దశలో గిరి ఆధిక్యం కనబరిచినా అతను చేసిన తప్పిదాన్ని అనుకూలంగా మలుచుకున్న ప్రజ్ఞానంద విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు మహిళల కేటగిరీలో దివ్యాదేశ్‌ముఖ్..అన్నా ముజుచిక్‌తో గేమ్ డ్రా చేసుకోగా, వైశాలి రాంబాబు, బిబిసారా అసబుయేయా మధ్య గేమ్ డ్రాగా ముగిసింది.



## యువతరంగం

## జాబ్ మార్కెట్‌పై ఎఐ ప్రభావం



కృత్రిమ మేధస్సు (ఎఐ) నిరంతరం విస్తరిస్తున్న సమయంలో, మిగతా అన్ని రంగాల కంటే ఎక్కువగా జాబ్ మార్కెట్ తీవ్ర ప్రభావానికి లోనవుతున్నది. 'యాంత్రోపిక్' సంస్థ నిర్వహించిన సర్వే ఫలితాలను అనుసరించి, విస్తారమైన భాషా నమూనాలు (లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ లేదా ఎల్ఎల్ఎం) వాస్తవ ఉద్యోగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక పని చేయగల సాంకేతిక సామర్థ్యం ఉన్నట్లయితే అది ఇప్పటికే ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేస్తుందని ఎఐ గురించి అపోహ చాలా మందిలో ఉంది. కానీ ఈ అధ్యయనాన్ని అనుసరించి, సిద్ధాంతంగా ఎఐ అనేక పనులను చేయగలిగినా, ప్రస్తుత కార్యాలయాల్లో దాని వాస్తవ వినియోగం ఇంకా పరిమితంగానే ఉంది. కాగా, ఈ పరిశోధనలో 'అబ్జర్వ్‌డ్ ఎక్స్పోజర్' అనే కొత్త ప్రమాణాన్ని ప్రవేశపెట్టారు. ఇది ఎఐ చేయగల సామర్థ్యాన్ని కాకుండా, ప్రస్తుతం నిజంగా కార్యాలయాల్లో ఎఐ ఏమి చేస్తున్నదో అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. ఈ విధానం ద్వారా ఎఐ ప్రభావాన్ని మరింత వాస్తవికంగా అర్థం చేసుకోవచ్చు. అయితే, ఇక్కడ సిద్ధాంత సామర్థ్యం, వాస్తవ వినియోగం మధ్య వ్యత్యాసాన్ని గమనించాల్సి ఉంటుంది. అందుకే, ఈ అధ్యయనంలో ముఖ్యంగా 'క్లాడ్' ఎఐ వంటి పెద్ద భాషా నమూనాలను పరిశీలించారు. సిద్ధాంతపరంగా చూస్తే కంప్యూటర్ సైన్స్, గణితశాస్త్రానికి సంబంధించిన ఉద్యోగాల్లో జరిగే పనుల్లో సుమారు 94 శాతం వరకు ఎఐ చేయగల సామర్థ్యం ఉందని తేలింది. కానీ, వాస్తవ కార్యాలయాల్లో ఈ ఎఐ వ్యవస్థలను ప్రస్తుతం కేవలం 33 శాతం పనులకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. టెక్నాలజీ ఉన్నప్పటికీ సంస్థలు వెంటనే పూర్తి స్థాయి ఆటోమేషన్ వైపు వెళ్లడం లేదు. కారణాలు అనేకం ఉన్నాయి. వాటిలో నమ్మకం సమస్యలు, డేటా భద్రత, చట్టపరమైన నియంత్రణలు, మానవ పర్యవేక్షణ అవసరం ముఖ్యమైనవి. అందువల్ల ఎఐ ఉద్యోగాలను వెంటనే పూర్తిగా భర్తీ చేస్తుందని చెప్పడం సరైన అంచనా కాదు. కాగా, ఈ పరిశోధన ప్రకారం కొన్ని రంగాలు ఎఐ ప్రభావానికి అత్యంత ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కంప్యూటర్ ప్రోగ్రామర్లు, కస్టమర్ సర్వీస్ ప్రతినిధులు, ఆర్థిక విశ్లేషకులు వంటి ఉన్నత స్థాయి కేటగిరీలోకి వస్తాయి. వ్యాపారం, ఆర్థిక రంగం, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్, న్యాయశాఖ, కార్యాలయ నిర్వహణ వంటి రంగాల్లోని అనేక పనులను ఎఐ సిద్ధాంతపరంగా నిర్వహించగలదు. దీనికి విరుద్ధంగా కొన్ని రంగాలు ప్రస్తుతం ఎఐ ప్రభావం నుండి ఎక్కువగా రక్షితంగా ఉన్నాయి. నిర్మాణ రంగం, వ్యవసాయం, భద్రతా సేవలు, వ్యక్తిగత సంరక్షణ వంటి రంగాల్లో మానవ శారీరక శ్రమ, ప్రత్యక్ష పరస్పర చర్యలు, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమైనవి. అందువల్ల ఈ రంగాల్లో ఎఐ ద్వారా తక్షణ ఆటోమేషన్ సాధ్యపడటం కష్టం. 2022 చివరలో, చాట్‌జిపిటి ప్రారంభమైన తర్వాత ఒక ముఖ్యమైన ధోరణి కనిపించింది. ముఖ్యంగా 22 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువ ఉద్యోగార్థులలో ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో ప్రవేశం సుమారు 14 శాతం తగ్గింది. అనేక కంపెనీలు తమ గ్రాడ్యుయేట్ ట్రైనింగ్ ప్రోగ్రాములు, జూనియర్ అనలిస్టు పోస్టులు, జూనియర్ డెవలపర్ నియామకాలను తగ్గిస్తున్నాయి. ఇది ఉద్యోగాల భారీ తొలగింపుల రూపంలో కాకుండా ముందు తలుపు మూసివేయడం అనే విధంగా జరుగుతోంది. అంటే కొత్త ఉద్యోగులను తీసుకునే అవకాశాలను తగ్గించడం ద్వారా సంస్థలు ఖర్చులను నియంత్రిస్తున్నాయి. తాజా పరిశోధనలో ఎఐ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ఉద్యోగస్థుల గురించి కొన్ని ఆసక్తికరమైన గణాంకాలు బయటపడ్డాయి. ఈ ఉద్యోగాల్లో పనిచేసే వారిలో సుమారు 54.4 శాతం మహిళలు ఉన్నారు. ఇది ఎఐ ప్రభావం లింగ సమానత్వంపై కూడా ప్రభావం చూపే అవకాశాన్ని సూచిస్తుంది. విద్యా స్థాయిని పరిశీలించినప్పుడు గ్రాడ్యుయేట్ లేదా ఉన్నత విద్య కలిగిన వ్యక్తులు ఎఐ ప్రభావానికి నాలుగు రెట్లు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నట్లు తేలింది. ఇది ఒక విరుద్ధ పరిస్థితిని చూపిస్తుంది. సాధారణంగా ఉన్నత విద్య ఉద్యోగ భద్రతను పెంచుతుందని భావిస్తారు. కానీ జ్ఞాన ఆధారిత ఉద్యోగాల్లో ఎఐ ప్రవేశం పెరుగుతున్నందున ఈ భావన కొంత మారుతోంది. జాతి, వయస్సు ఆధారంగా కూడా కొన్ని తేడాలు కనిపించాయి. ఎఐ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ఉద్యోగాల్లో సగటు వయస్సు సుమారు 42.9 సంవత్సరాలు ఉంది. అంటే మధ్య వయస్సు ఉద్యోగులు కూడా ఈ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ మార్పులు భారతదేశంపైన కూడా గణనీయమైన ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా భారత ఐటి సేవల రంగం ఈ పరిణామాల వల్ల ఒత్తిడిని ఎదుర్కొంటోంది.

ఎఐ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం కూడా కొన్ని కార్యక్రమాలను ప్రారంభించింది. 'ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్' కార్యక్రమం ద్వారా డిజిటల్, ఎఐ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి శిక్షణ అందిస్తున్నారు. అలాగే 'ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన' (పిఎంకెవివై) ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలను నేర్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నీతి ఆయోగ్ రూపొందించిన ఎఐ వ్యూహం ద్వారా ఉద్యోగాల సృష్టి , సాంకేతిక అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించడానికి మార్గదర్శకాలు రూపొందాయి. నేషనల్ స్ట్రాటజీ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా ఈ దిశగా పనిచేస్తోంది. ఇలావుంటే, ఎఐ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం. పాఠశాల స్థాయి నుంచే డేటా, అల్గోరిథమ్‌లు. ఎఐ నైతికత వంటి అంశాలను బోధించడం అవసరం. ఇది భవిష్యత్ తరాలకు ఎఐతో కలిసి పనిచేయగల సామర్థ్యాన్ని పెంచుతుంది. అదే సమయంలో ఉద్యోగుల్లో పునఃశిక్షణ కార్యక్రమాలు కూడా కీలకం. కంపెనీలు తమ ఉద్యోగులకు ఎఐ సంబంధిత నైపుణ్యాలను నేర్పించే విధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్ర



మాలు నిర్వహించాలి. ఎఐ, మానవులు కలిసి పనిచేసే కోబోటిక్స్ విధానం కూడా ప్రోత్సహించాలి. ఏదిఏమైనా, ఉద్యోగాలను ఎఐ వెనువెంటనే పూర్తిగా భర్తీ చేయడం లేదుగానీ, ఉద్యోగాల స్వభావాన్ని వేగంగా మారుస్తుందనే విషయం 'ఆంత్రోపిక్' సంస్థ నిర్వహించిన ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది. ముఖ్యంగా జ్ఞాన ఆధారిత ఉద్యోగాలు, ప్రారంభ స్థాయి ఉద్యోగాలు ఈ మార్పుల ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నాయి. అందువల్ల విద్యా సంస్కరణలు, నైపుణ్య అభివృద్ధి మరియు ఎఐమానవ సహకార మోడళ్లను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే భవిష్యత్ ఉద్యోగాలను స్థిరంగా ఉంచడం సాధ్యం.

# ఎస్‌ఎల్‌బిసితోనే 'మునుగోడు'కు పరిష్కారం

**ఎస్‌ఎల్‌బిసి పూర్తి చేసి చర్లగూడెం ద్వారా లిఫ్ట్ ఏర్పాటు చేసి నారాయణపురం మండలానికి సాగునీరు అందించాలి**

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మునుగోడు నియోజకవర్గానికి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే ఎస్‌ఎల్‌బిసి లెఫ్ట్ బ్యాంక్ టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో రాచకొండ రిజర్వాయర్ ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలని జరిగిన మహాధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో మునుగోడు ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలపై ఆధారపడి పరిస్థితి నెలకొనడంతో పంటలు వరుసగా నష్టపోతున్నాయని, బోర్లు ఎండిపోవడంతో భూగర్భ జలాలు కూడా క్షీణిస్తున్నాయని తెలిపారు. డిండి, ఎత్తిపోతల, చర్లగూడెం పూర్తిచేసి నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బంగారు భూములు ఉన్నా, రాజధానికి అతి సమీపంలో ఉన్న కానీ నీరు లేక ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో వచ్చేందుకు ప్రగల్భాల పలికే నాయకులు ప్రాజెక్టుల విషయంలో వివక్షత చూపుతున్నారన్నారు. రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి సాధించేవరకు వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ధర్నాలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే ప్రాజెక్టులు సాధ్యమన్నారు. సేద్యం చేసుకుంటున్న భూములకు రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ సాధనకు ఉద్యమాలే శరణ్యమని అన్నారు. 2004 సురవరం సుధాకర్ రెడ్డి, పల్లా వెంకటరెడ్డి నాయకత్వన నల్లగొండ నుండి పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టి సాగు జలాలపై ఉమ్మడి జిల్లాగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపటామని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న శాసనసభ్యులు, మంత్రులు ప్రాజెక్టుల విషయంలో వివక్షత వివక్ష చూపడం తగదన్నారు. మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న సాగునీటి విషయంలో ఎంత సమయం పట్టేది కాదని విమర్శించారు. ప్రాజెక్టుల సాధనకు కలిసి వచ్చే పార్టీలతో మరో పోరాటానికి సిద్ధమవుతామన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతానికి సాగునీరు తీసుకువచ్చేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని కోరారు. గ్రౌండ్ వాటర్ కొరకు చిన్న మూసీ ద్వారా రూ.50 కోట్లతో చిన్న ప్రాజెక్టును తయారుచేసి ఇచ్చామని గుర్తుచేశారు. ముఖ్యంగా శివన్నగూడెం నుండి 100 మీటర్ల లిఫ్ట్ పెడితే వాల పెల్లి దగ్గర 460 టిఎంసి నీళ్లు వస్తాయని, ఆ తర్వాత ఆరుట్లకు కూడా వస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు డిపిఆర్ కింది నుంచి వస్తే పదివేల ఎకరాలకు మిగిలిపోతుందని, రాచకొండ ద్వారానే మూడు లిఫ్టులు అవసరం ఉంటుందని, కాకపోతే గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కురుమిద్దె శ్రీనివాస్, పల్లె శేఖర్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, సిపిఐ పట్టణ కార్యదర్శి ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డితో పాటు సిపిఐ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు పేదలకు పంచుతాం



**సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి**

**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను వెలికితీసి అర్హులైన పేదలకు పంచుతామని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అలియాబాద్ రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో ఉంటున్న పేదలతో పార్టీ మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాజారెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అండదండలతో ఆక్రమించిన భూములను చేసుకొని అర్హులయిన పేదలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇల్లులేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇచ్చే వరకు సిపిఐ పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అలియాబాద్ రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో ఉన్న పేదల పక్షాన సిపిఐ పోరాడుతుందన్నారు. వారికి ఇండ్ల పట్టాలు, ఇండ్లు నిర్మించి ఇచ్చే వారికి అండగా ఉంటామన్నారు. అర్హులయిన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పోరాడుతున్న పార్టీ సిపిఐ అన్నారు. ఏప్రిల్ నెల 1 నుంచి జరుగు ఇంటింటికీ సిపిఐ ప్రచార కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో శ్రేయోభిలాషులు, వ్యాపారస్తులు, కార్మికులు, ఉద్యోగస్తులు, రైతులు అన్నివర్గాల ప్రజలు తమ మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఆది సాయన్న, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్, నాయకులు ఎండి యాకూబ్ పాషా, బికెఎంయూ నాయకులు మండల గట్టుమల్లు, మహిళా సమాఖ్య నాయకురాలు ఎండి.నూర్జిశ, వేల్పుల పెద్ద రాములు, రాడపాక సత్తయ్య, ఎండి.జాఫర్, మంద బుచ్చయ్య, వెంకన్న, కుక్కల శోభ, ఎండీ అలీఫా, కలకోట కనకయ్య, మందపురి రజిత, యాదగిరి, నిర్మల, సుధాకర్, ఐలయ్య పాల్గొన్నారు.

# ఆర్‌టిసిని కనుమరుగు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**కరీంనగర్ టూ డిపో ఎదుట అర్ధ నగ్నంగా కార్మికుల ధర్నా, నిరసన**



**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ ఆర్‌టిసి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం కనుమరుగు చేస్తుందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. తెలంగాణలో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక రవాణా సాధనం ఆర్‌టిసి సంస్థను సేవా రంగంగా చూడకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సంస్థగా చూస్తూ ప్రైవేటు పెట్టుబడి వర్గాలకు కట్టబెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందని వారు ఆరోపించారు. ఎనిమిది దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని ఆర్‌టిసి అందిస్తుందని ఆర్‌టిసి జెఎసి నాయకులు అన్నారు. ఆర్‌టిసి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అన్ని వర్గాల ప్రజలు ఆర్‌టిసి ప్రైవేటీకరణ అడ్డుకొని కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరుతూ సోమవారం కరీంనగర్ టూ డిపో ఎదుట రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా ఆర్‌టిసి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు థామస్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ ఆర్‌టిసిలో పనిచేస్తున్న సుమారు 39,000 మంది కార్మికులు మధ్యతరగతి మరియు బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారేనన్నారు. ఆర్‌టిసి సంస్థను ప్రయివేట్ పరం చేస్తే నిరుపేద మధ్యతరగతి ప్రజలతో పాటు విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, పత్రికా విలేకరులు ప్రజా రవాణాకు దూరం అవుతారన్నారు. ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో వీలినం చేయాలని, ట్రేడ్ యూనియన్‌లపై ఆంక్షలు ఎత్తివేయాలని రెండు సంవత్సరాల నుండి పోరాటం చేస్తుంటే కాంగ్రెస్ పాలనలో ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలు ఎక్కడ వేసిన గొంగళి చందంగా ఉన్నది తప్పా ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయలేదన్నారు. కార్మిక సంఘాలతో ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడనప్పటికీ, ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. ఆర్‌టిసిలో యూనియన్లకు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన ఎన్నికలు నిర్వహించకపోవడం కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వెల్ఫర్ కమిటీలను ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్‌టిసి కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలైన జెబిఎం, ఒలెక్ట్రా యజమాన్యాలకు సంస్థను ధారాధత్తం చేయడానికి, ముక్కుమ్మడిగా ఎలక్ట్రిక్ బస్సులను వేలాదిగా ప్రవేశ పెడుతూ ఆర్‌టిసిని ప్రైవేటు చేయడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు బెజ్జంకి కాళిదాస్, కొమురయ్య యాదవ్, ఎంపిరెడ్డి, ఎవిరెడ్డి, శంకర్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు

**ఏప్రిల్ 1 న బ్లాక్‌డే విజయవంతం చేయాలి**

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపు**



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వ్యవసాయ కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. కార్మికుల వ్యతిరేక నాలుగు కోడ్లను కేంద్ర ప్రభుత్వం బరి తెగించి అమలు చేయటానికి పూనుకుందని, కార్మికుల హక్కులను కాలరాసే కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1న దేశవ్యాప్తంగా బ్లాక్‌డే నిర్వహిస్తున్నట్టు, కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక, కర్షక నేతలను కోరారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం వై.రాజిరెడ్డి అధ్యక్షతన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పశ్య పద్మ మాట్లాడుతూ దేశంలో కార్మికుల, రైతులు, వ్యవసాయ కార్మికులు, కష్టజీవులకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తూ, కార్పోరేట్ అనుకూల, అమెరికా ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద కాంక్షలకు గులాంగిరి చేస్తూ పాలన కొనసాగిస్తున్న ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ప్రజలు సమీకృతులై పోరాడాలన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆపాలని ఆదేశాలు పంపుతూ మరోవైపు మహాత్మా గాంధీ పేరు తీసివేసి విబిజీ రాంజీ పథకాన్ని తీసుకవచ్చి రాష్ట్రాలను ఒప్పించలేక అమలు చేయలేక పూర్తిగా వ్యవసాయ కార్మికులకు పని కల్పించకుండా వారి జీవితాలను మరింతగా దుర్భరం చేస్తున్నారన్నారు. వేలాది మంది వ్యవసాయ కార్మికులు రోడ్లపై కొచ్చి గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. భారత అమెరికా వాణిజ్య ఒప్పందంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే మొక్కజొన్న సోయా పంటలకు జీరో పన్ను ఉంటుందని తెలిసి ప్రైవేట్ వ్యాపారస్తులు ఎవరు మొక్కజొన్నను కొనుగోలు చేయడానికి ముందుకు రావటం లేదని, క్వింటాలుకు రూ.24 వేల మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయటానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు కె.భూమయ్య, వై.ఓమయ్య, కె.రాజన్న, ఎ.విఠల్‌గౌడ్, ఎం.స్వరూపరాణి, బి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ నియోజకవర్గం మక్తల్ మండలం సామాన్‌పల్లి, నర్సిరెడ్డిపల్లి మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు నాగర్ కర్నూల్ క్లాస్మేట్ క్లబ్, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాలెండర్ ఇన్‌చార్జి వాస రాఘవేందర్ కుమారుడు వంశీకృష్ణ, కూతురు వందన కమల్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో అలాగే వాసవియన్ చంద్రకళ జక్లేర్ గవర్నమెంట్ హై స్కూల్ జిహెచ్‌ఎం కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు వారి చేయూతతో మక్తల్ వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మక్తల్, ముఖ్యంగా జక్లేర్ గ్రామ ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ జక్లేర్ కార్యవర్గ సభ్యులు సలహాదారులు వారి కోఆర్డినేషన్‌తో మక్తల్ మండలం సామాన్‌పల్లి అలాగే నర్సిరెడ్డిపల్లి (బొందల్ కుంట) గవర్నమెంట్ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వంద మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మక్తల్ వాసవిక్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ పాలుట్ల బాలరాజ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, జక్లేర్ గవర్నమెంట్ ఉన్నత పాఠశాల జిహెచ్‌ఎం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ మేడం, సామాన్‌పల్లి ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, నర్సిరెడ్డిపల్లి ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు నర్మద, పంచాయతీ సెక్రెటరీ, వాసవి క్లబ్ జక్లేర్ కార్యవర్గ సభ్యులు సలహాదారులు ఎర్మల్ నరేందర్ శెట్టి, కందూరి వెంకటయ్య శెట్టి, ఎర్మల్ కృష్ణ మూర్తి, కందూరి విజయ్ భాస్కర్ శెట్టి, కందూరి సంతోష్ శెట్టి, కందూరి అఖిల్ శెట్టి, ఎర్మల్ మహా నందు శెట్టి, ఎర్మల్ లక్ష్మ ణ్ శెట్టి, ఎర్మల్ వెంకటేష్ శెట్టి, ఆర్య వైద్య సంఘం జక్లేర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై 'ఆశాల' ధర్నా

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని కావేరమ్మపేట జాతీయ రహదారిపై ఆశా వర్కర్లు భారీ ఆందోళన చేపట్టారు. సోమవారం నాడు జడ్చర్ల జాతీయ రహదారిపై నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో గత ఆరు నెలలుగా తమకు వేనాలు అందడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వందలాది మంది మహిళలు రోడ్డుపై బైఠాయించారు. గంటకుపైగా సాగిన ఈ ధర్నా వల్ల హైదరాబాద్ కర్నూలు జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా మా జీతాలు మాకు ఇవ్వాలి. సిఎం డౌన్ డౌన్ అంటూ ఆశా వర్కర్లు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆరు నెలల నుంచి జీతాలు లేక తమ కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని, పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కారణంగా హైవే పై సుమారు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసు బలగాలు రంగ ప్రవేశం చేసినా, మహిళల పట్టుదలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండు చేశారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం తంగిడి గ్రామంలోని బిసి కాలనీ కుర్వ వీధిలో పార్లమెంటులో సభ్యురాలు డికె.అరుణమ్మ ప్రత్యేక చొరవతో 5 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచు కంప్లి లింగప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి, మండల అధ్యక్షుడు నల్లే నర్సప్ప మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యురాలుగా ఎన్నికైన రెండు సంవత్సరాలలో మన నియోజక వర్గానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిధులు తెచ్చిన ఘనత డికె అరుణమ్మది అని, భవిష్యత్తులో కృష్ణ మండల అభివృద్ధికి మరిన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తుందన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఈ సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఉపసర్పంచు కీర్లింగ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట్రాములు, మక్తల్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర, స్థానిక నాయకులు మాజీ సర్పంచు గుంతల్ హన్మంత్రాయ, జెంసేర్ నర్సింగప్ప, కంప్లి రాజు, బూత్ అధ్యక్షలు నర్సింగ, వార్డు సభ్యులు హన్మంతు, బీరప్ప, వడ్డె చిన్నప్ప, చిగనూర్ మల్లప్ప, అల్లంపల్లి జుక్కప్ప, రవిగౌడ్, బసవలింగ, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై ఎలక్ట్రికల్ వాహనాలు, సోలార్ యూనిట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన అభ్యర్థులు స్వయం ఉపాధి అవకాశాలు, తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, మహబూబ్‌నగర్ జిల్లా ఎస్.సి యాక్షన్ ప్లాన్ 2025–26 కింద రూ.లక్ష రూపాయల వరకు ఎలక్రిక్టల్ ద్విచక్ర వాహనాలు 90% సబ్సిడీ, రూ.3లక్షల విలువ గల త్రిచక్ర ఎలక్ట్రికల్ ఆటో ప్యాసింజర్/గూడ్స్, వాహనాలు 70% సబ్సిడీ, రూ.3 నుండి రూ.7లక్షల రూ.5లక్షల వరకు 60% సబ్సిడీ విలువ గల సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్, వ్యవసాయ అనుబంధ, పశు సంవర్ధక యూనిట్లకై ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 8వ తేదీ లోగా దరఖాస్తులు నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ చైర్మన్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన బిపిఎల్ కల అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనగలరని ఆమె ఈ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత పత్రాలు ఎస్.సి కార్పొరేషన్ కార్యాలయం, మహబూబ్‌నగర్ జిల్లా, రూ.నెం.105 మొదటి అంతస్తు, సమీకృత జిల్లా ఆఫీసుల కార్యాలయము, కలెక్టరేటు ఐడిఒసి నందు 2 జిరాక్స్ కాపీలు సమర్పించగలరని, ఇతర వివరములకు 9849905996 నందు సంప్రదించవలసినదిగా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## కర్రెమ్మ ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి తన సొంత నిధులతో పట్టణ కేంద్రంలో ఎస్సీ కాలనీలో కర్రెమ్మ దేవాలయ అభివృద్ధికి పది లక్ష రూపాయలు మంజూరు చేశారు. ఎమ్మెల్యే అదేశాల మేరకు పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవరెడ్డి గ్రామ సర్పంచ్ పి. జ్యోతి, ఉపసర్పంచ్ పూజారి నరసింహులు తో కలిసి దేవాలయ అభివృద్ధికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు అఖిలపక్షం నాయకులు అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు డిమాండ్



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ప్రస్తుత దశలో అస్తిత్వ ఉద్యమాలు దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా కొనసాగుతున్నాయని, ఇది ఎంతో ఆహ్వానించదగ్గ పరిణామం అని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు.

సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన బిసి హక్కుల సాధన సమితి జిల్లా స్థాయి ముఖ్యుల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న జన గణనలో కులగణనను చేపట్టి ఏ కులం జనాభా ఎంత ఉందో లెక్కలు తీసి అదేవిధంగా జనాభా దామాషా పద్ధతిలో రాజకీయ ఆర్థిక రిజర్వేషన్లు కేటాయించాలని, దామాషా ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలని, చట్టసభల్లో కూడా జనాభా దామాషా పద్ధతిలో సీట్లు కేటాయించి అన్ని కులాలవారికి చట్టసభల్లో ప్రాతినిధ్యం లభించే విధంగా చర్యలు చేపట్టాలని, దేశంలో 3500 కులాలు ఉంటే ఈనాటికి మూడువేల 400 కులాలు పార్లమెంటు గడప తొక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రివర్గంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని ఏకాభిప్రాయ సాధన పేరుతో గత 11 సంవత్సరాలుగా కులగణన చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందని, ఇప్పుడు గాని కుల గణన చేపట్టకపోతే బిసిలు మరో 10 సంవత్సరాలు పాటు వెనక్కి నెట్టివేయబడతారని అందుకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బిసి సంఘాలను ఐక్యం చేసి ఐక్య ఉద్యమాలు నిర్మించేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి కే.విజయ రాములు మాట్లాడుతూ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన ఇరవై ఒక్క హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని బిసిలను ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూడరాదని, బిసిల అభివృద్ధి కొరకు సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు కేటాయిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించి ఉన్నారని, ఇప్పటికి శాసనసభలో మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టారని కేవలం 11వేల కోట్లు మాత్రమే కేటాయించాలని మిగతా 50వేల రూపాయలు బిసిల అభివృద్ధి కొరకు కేటాయించి అట్టి నిధులను ఖర్చు చేయాలని ఆయన డిమాండు చేశారు.

సమావేశానికి జె.రమేష్ అధ్యక్షత వహించగా కే.లక్ష్మి నారాయణ, కృష్ణ, మైబూస్, కుమార్, గోపాలకృష్ణ, నరేష్, వంశీ, లక్ష్మ ణ్, శిరీష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 167 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరి ప్రియ, డి.ఆర్.ఓ రామ్ రెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ దరఖాస్తు దారులతో మాట్లాడుతూ వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చర్చించి అర్జీలను పరిశీలించి సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నర్సింహులు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## భూమి లేకుండా దళితులకు విముక్తి లేదు

### కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను అమలు చేయాలి

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** దళితులకు నిజమైన సామాజిక న్యాయం భూమి పంపిణీ ద్వారానే సాధ్యమని, భూమి లేకుండా దళితులకు విముక్తి లేదని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. సోమవారం దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) నాగర్ కర్నూల్ జిల్లా రెండో మహాసభను మేకల లక్ష్మీ నారాయణ, తప్పెట కిరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాలక అనిల్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికీ వేలాది దళిత కుటుంబాలు భూమిలేకుండా కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్న దుర్భర పరిస్థితి కొనసాగుతోందని, భూమి లేకపోవడం వల్ల దళితులు ఆర్థికంగా మాత్రమే కాదు, సామాజికంగా కూడా వెనుకబడిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీ పతి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్. ఆనంద్ జి, రైతు సంఘం నాయకులు సూర్యశంకర్ గౌడ్, బిజ్జా శ్రీనివాసులు, రవీందర్, చంద్రమౌళి, కొత్త రామస్వామి, చిన్నపాక శ్రీను, బాల పేరు నరసింహ, గిరి ప్రసాద్ కుమార్, కృష్ణ, సురేష్, బండి శ్రీను, పర్వతాలు, చందు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులదే

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులదేనని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జీవి శ్యాంప్రసాద్ లాల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 41 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపులా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ అన్ని శాకల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌వర్క్ రాక ఉపాధి కూలీలకు తిప్పలు

**ప్రజాపక్షం/అమరచింత :** ఉపాధి పనులను చేస్తున్న కూలీలకు సక్రమంగా నెట్‌వర్క్ రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అజయ్ ఆందోళన చెందారు. సోమవారం అమరచింత మండల పరిధిలోని సింగంపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ కూలీలకు పని ప్రదేశంలో రోజు రెండు పూటలా దింపే ఫోటో క్యాప్చర్‌కు నెట్వర్క్ రాక సర్వర్ సమస్యతో ఫోటోలు రాకపోవడంతో వెనుతిరిగి వెళ్లాల్సిన దుస్థితి కూలీలకు ఏర్పడిందని అజయ్ విచారం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు ప్రతి వారం పేస్లిప్పులు ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడంతో కూలీలకు అనేక ఇబ్బందులు కలుగుతున్నావని ఆయన ఆందోళన చెందారు. గతంలో కేంద్రం 90 శాతం, రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించే విధానాన్ని కూడా సవరణలు చేస్తూ ప్రస్తుతం కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40% నిధులను భరించాలనే కుతంత్రాలతో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

రాష్ట్రాల ఆదాయమే పడిపోతున్న ప్రస్తుత తరుణంలో కేంద్రం ఉపాధిలో శాతాన్ని తగ్గించకపోవడం సరికాదని పాత పద్ధతిలోనే నిధులను కేటాయించాలని ఆయన డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, వెంకటేశ్, అన్నమయ్య, ఆదామ్, సుజాత, అనిత, సత్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభల్లో ప్రగతి వివరాలు ప్రస్తావించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామసభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అన్ని శాఖల్లోని అభివృద్ధి కార్యక్రమాల పూర్తి వివరాలను గ్రామసభల్లో ప్రస్తావించాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా, తదితర పథకాల గ్రామస్థాయి వివరాలను సేకరించి ఆయా గ్రామసభల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను, వసతి గృహాలను సందర్శించాలని, ప్రతి శుక్రవారం అక్కడే భోజనం చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు సైతం సంబంధిత అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ రావు, ఆర్డీవో శ్రీనివాస రావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు పేదలకు ఆత్మగౌరవ ప్రతీక


**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పేదల గృహ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల స్పందనను పొందుతోంది. మండల పరిధిలోని సంగినేనిపల్లిలో ఈ పథకం క్రింద నిర్మాణం చేపట్టిన ఇళ్ల పనులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వనపర్తి జిల్లా ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నారెడ్డి, ధనుంజయ, మీసాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకుడు రాగివేణు పార్థివ దేహానికి నివాళులర్పించిన డా.జిల్లెల చిన్నారెడ్డి

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగి వేణు మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మార్చురీలో ఉన్న రాగి వేణు పార్థివ దేహానికి నివాళులర్పించారు. రాగి వేణు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కాంగ్రెస్ పార్టీకి వివిధ హోదాలో కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. రాగి వేణు మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాగి వేణు కుటుంబానికి ఎల్లవేళలా అండగా నిలబడుతుందని ధైర్యంగా ఉండాలని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ యన్‌ఎస్‌యుఐ నాయకులు రోహిత్, సీనియర్ నాయకులు మన్యం యాదవ్, అబ్దుల్లా, ద్వార పోగు విజయ్‌కుమార్, నందిమల్ల రాము, ఎంట్ల రవి, చీర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఆమోదించాలి

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మ ణ్ డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలో ఇష్టారీతిగా ఫీజులను పెంచకుండా ఫీజుల నియంత్రణ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యా కమిషన్ తెలంగాణ విద్యావిధానం 2026 పేరిట ఇచ్చినటువంటి నివేదికలో పాఠశాలలో, జూనియర్ కళాశాలల ఫీజుల నియంత్రణను కట్టడి చేసేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని సిఫారసు చేసింది. 2023 డిసెంబర్ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ ఫీజులను కట్టడి చేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని ఇప్పటివరకు ఏర్పాటు చేయడం లేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ ఫీజులను నియంత్రణ అరికట్టాలని సిఫారసు చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఒక సర్వే ప్రకారం దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో ఫీజులు ఎక్కువగా ఉన్నాయని సూచించడం జరిగింది. ఫీజులపై నియంత్రణ లేకపోవడంతో కొన్ని పాఠశాలలు పాఠ్యపుస్తకాలు కూడా 15 నుంచి 20 వేలకు పెంచి అమ్ముతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఫీజుల నియంత్రణ చట్టం 2026కు ఆమోదం తెలిపి తక్షణమే అమలు చేసి వచ్చే విద్యా సంవత్సరంలో ఫీజులను అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన కోఆప్షన్ ఎన్నిక

**ప్రజాపక్షం/మక్తల :** మక్తల్ మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబర్లుగా వల్లంపల్లి లక్ష్మ ణ్, బుక్కా శంషుద్దీన్, సరస్వతీ బాయి, హాషియా బేగం ఎన్నికయ్యారు. మక్తల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కోఆప్షన్ ఎన్నికల్లో జనరల్ కేటగిరీ కింద వల్లంపల్లి లక్ష్మ ణ్, సర్వసతీ బాయి ఎన్నిక కాగా, మైనారిటీ కోటా కింద బుక్కా శంషుద్దీన్, హాషియా బేగం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపుననుంచి హజరైన 12 మంది పూర్తి స్థాయిలో మద్దతు పలకడంతో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా ఎన్నికయ్యారు. అనంతరం ఎంపికైన నలుగురు సభ్యులు వల్లంపల్లి లక్ష్మ ణ్, సరస్వతీ బాయి, బుక్కా శంషుద్దీన్, హాషీయా బేగం లకు మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నియామక పత్రాలు అందజేశారు. ఆ తర్వాత మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, వైస్ చైర్ పర్సన్ శైవిరెడ్డితో పాటు మిగతా వార్డు కౌన్సిలర్‌లు అందరూ ఎంపికైనవారికి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కోఆప్షన్ పదవికి ఎంపిక చేసిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తోపాటు సహకరించిన ప్రతి ఒక్కరికి కో ఆప్షన్ మెంబర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నాగశివ, మేనేజర్ ఖాదర్ ఖాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నదిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/కృష్ణ :** నదిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కృష్ణ మండలం గూడెబాల్లూరు గ్రామ శివారులోని వాసునగర్‌లో చోటుచేసుకుంది. కృష్ణ మండల ఎస్సై నవీద్ వివరాల ప్రకారం ముదునూరి సుబ్రహ్మణ్యం తండ్రి రామలింగ రాజు (47), పాల వ్యాపారం చేసే వ్యక్తి సోమవారం తెల్లవారుజామున 3:30 నిమిషాలకు కృష్ణా నది బ్రిడ్జిపై నుంచి పడి తలకు బలమైన గాయమై మృతి చెందాడు. మృతుడి భార్య ముదునూరి సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి



**ప్రజాపక్షం/వంగూరు :** పిడుగు పడి మహిళా మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై పుట్ట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నిజామాద్ గ్రామానికి చెందిన ఇండమోని లక్ష్మ మ్మ (35) సోమవారం కౌలుకు చేస్తున్న వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా అకస్మాత్తుగా ఉరుముల మెరుపులతో పిడుగు పడి లక్ష్మ మ్మ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎసిబి వలలో తిమ్మాజీపేట ఎస్సై హరిప్రసాద్ రెడ్డి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని తిమ్మాజిపేట మండల పోలీస్ స్టేషన్లో సోమవారం మహబూబ్‌నగర్ ఎసిబి అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. మహబూబ్‌నగర్ ఎసిబి డిఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5న తిమ్మాజిపేట మండలంలోని మరికల్ గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే కారణంలో ఒక జెసిబితో పాటు రెండు ట్రాక్టర్లను తిమ్మాజీపేట పోలీసులు పట్టుకొని మైనింగ్ అధికారులకు అప్పగించారు. వాహనాల యజమాని మైనింగ్ అధికారులను సంప్రదించడంతో 60వేల రూపాయల జరిమానా విధించారు. మైనింగ్ అధికారులు జరిమానా చెల్లించి, వాహనాల రిలీజ్ కోసం రిలీజ్ పత్రాలను తీసుకొచ్చి తిమ్మాజిపేట ఎస్సై హరిప్రసాద్ రెడ్డికి అందజేసి వాహనాలను విడుదల చేయాలని కోరగా, వాహనాల విడుదలకు 30వేల రూపాయలు డిమాండ్ చేశారని, అందులో 20000 రూపాయలు ఎస్ఐకి ఇచ్చిన మిగిలిన 10 వేలు ఇచ్చి పట్టుబడిన వాహనాలను తీసుకొని పోవాలని చెప్పడంతో ఆ యాజమాని మహబూబ్‌నగర్‌లోని ఎసిబి అధికారులను సంప్రదించి ఆధారాలను వారికి అందజేశారు. వాహన యజమాని ఇచ్చిన ఆధారాలను పరిశీలించి ఎసిబి మహబూబ్‌నగర్ రేంజ్ డిఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామరి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని డిఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

## పౌర హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యత

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో నిర్వహించిన పౌర హక్కుల పరిరక్షణ సమావేశంలో వివిధ విభాగాలు అధిపతులు పాల్గొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో జీవించినప్పుడే రాజ్యాంగ ఆశయాలు నేరవేరుతాయని, పౌర హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ నగర్ కర్రెమ్మ, గుడి అంబేద్కర్ భవనంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కుల, మత వివక్షలకు తావు లేకుండా ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, స్థానిక ఎస్సై దివ్య, వైస్ చైర్మన్ సుమిత్ర, ఎల్లారెడ్డి, వార్డు కౌన్సిలర్ కర్ణ శ్రీ, సాయినాథ్, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానంలో బదిలీల వేటు

### పాతుకుపోయిన అధికారుల్లో 'వణుకు'!

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఉక్కుపాదం మోపింది. రాజకీయ అండదండలతో దేవస్థానాన్ని అడ్డాగా మార్చుకున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, ప్రక్షాళన పర్వానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే, సుదీర్ఘ కాలంగా ఇక్కడే కొనసాగుతున్న ఉప కార్యనిర్వహణ అధికారి (డిప్యూటీ ఈఓ) డి.భాస్కర్ శర్మను సోమవారం వేములవాడకు బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేయడం ఇప్పుడు ఆలయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది.

**రాజకీయ పలుకుబడికి 'చెక్'..**
కారుణ్య నియామకం ద్వారా విధుల్లోకి చేరిన భాస్కర్ శర్మ, తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని ఏళ్ల తరబడి గుట్టలోనే పాతుకుపోయారనే విమర్శలు ఉన్నాయి. 18 నెలల క్రితం వేములవాడ నుంచి డిప్యూటీ ఈఓగా బదిలీపై వచ్చిన నవీన్ కుమార్ అనే అధికారికి, భాస్కర్ శర్మ తన పరపతితో అడ్డుతగిలినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సీనియర్ అధికారి అయిన నవీన్ కుమార్కు డిప్యూటీ ఈఓ విధులు అప్పగించకుండా, కేవలం ఏఈఓ స్థాయి బాధ్యతలకే పరిమితం చేసిన వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతోనే బదిలీ వేటు పడినట్లు సమాచారం.

**డిప్యూటేషన్ల మాయాజాలం**
రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం దేవాలయాల పరిపాలనను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, కొందరు అధికారులు మాత్రం 'డిప్యూటేషన్' మంత్రాన్ని జపిస్తున్నారు. గతంలో బదిలీ అయినప్పటికీ, వేములవాడ, కొమురవెల్లి వంటి ప్రాంతాల నుంచి తిరిగి యాదగిరిగుట్టకే డిప్యూటేషన్ మీద రావడం గమనార్హం.

గతంలో ఎండోమెంట్ డైరెక్టర్, ఈ దేవస్థానం ఇంచార్జ్ ఈఓగా ఉన్న ఎస్.వెంకట్రావు డిప్యూటేషన్ అధికారులను వెనక్కి పంపుతూ ఉత్తర్వులు ఇచ్చినా, రాజకీయ ఒత్తిళ్లతో కొద్ది రోజుల్లోనే ఆ ఉత్తర్వులను



రద్దు చేయాల్సి వచ్చిందంటే ఇక్కడి అధికారుల ప్రభావం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

**వివిఐపి 'సేవ'లో తరిస్తూ.. తిష్టవేసి!**
ఆలయంలోని కీలక విభాగాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు భక్తుల సేవ కంటే వి.వి.ఐ.పిల సేవకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యమైన పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, ఉన్నత అధికారుల పుట్టినరోజులు, పెళ్లిరోజుల సమయంలో స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేస్తూ వారిని 'ప్రసన్నం' చేసుకుంటున్నారు. ఈ రకమైన సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని ఆలయ పరిపాలనలో తమదే పైచేయిగా వ్యవహరిస్తున్నారు.

**అధికారుల్లో మొదలైన వణుకు**
తాజా బదిలీతో దేవస్థానంలోని వివిధ విభాగాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సహాయ కార్యనిర్వహణ అధికారులు, పర్యవేక్షణ అధికారులకు బదిలీ భయం పట్టుకుంది. ప్రభుత్వం ప్రక్షాళనను ఇలాగే కొనసాగిస్తే ఏళ్ల తరబడి దేవస్థానంలో తిష్ట వేసిన కొందరి అధికారుల సీట్లు కదలడం ఖాయమని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారం

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపాలిటిలో సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం పట్టణంలోని రవి మహాల్ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సంఘం 2025–26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026–27 ముసాయిదా బడ్జెట్ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వార్డు స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పరిష్కరించడం మున్సిపల్ పాలకమండలి బాధ్యతన్నారు. నూతన పాలక మండలి తొలి సమావేశంలోనే రూ.107.30లక్షలతో బడ్జెట్ రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా మున్సిపాలిటి ఆదాయ వనరులను పెంపొందించి పట్టణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్ళాలని సూచించారు. పరిశుభ్రత నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. రోడ్లు, మురిగి కాల్వలు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మున్సిపాలిటికి రావల్సిన ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ఇతర బకాయిల వసూళ్లలో ప్రజలను చైతన్యపరిచి సమయానికి చెల్లించేలా ప్రోత్సహించాలన్నారు. అక్రమ భవన నిర్మాణాలను అరికట్టి, మున్సిపాలిటికి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో సూర్యాపేట మున్సిపాలిటి సాధించిన గుర్తింపును తిరిగి సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, కమీషనర్ హన్మంత రెడ్డి, మున్సిపల్ పాలక మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



## భగ్గుమన్న పాత కక్షలు...

### కర్రలతో ఇరువర్గాల దాడి

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని అడ్లూరు పునరావాస కేంద్రంలో జరిగిన గ్రామసభలో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి గత గ్రామసభలో చర్చించుకున్న విషయాల పురోగతిపై సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ గువ్వల శిరీష అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామంలోని పలు అంశాలపై చర్చిస్తుండగా వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఉపసర్పంచ్ తన అనుమతి లేకుండా నిధులు ఎలా విత్‌డ్రా చేస్తారని ఆరోపించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ జాయింట్ చెక్‌పవర్ అంశం, గ్రామంలోని దేవాలయ నిర్మాణం, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన అంశాలపై ఇరు వర్గాలకు తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలను అదుపు చేసి చెదరగొట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 30 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 25, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, హౌసింగ్ 2, మున్సిపాలిటీ ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి తక్షణ కృషి

### జిల్లా ఎస్పి కె.నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి అవసరమని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పి కె నరసింహ దిశానిర్దేశం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు, సూచనలు చేశారు. సమస్యలపై తక్షణమే స్పందించి బాధితులకు బరోసా కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## తెలంగాణ క్రీడా ప్రాజెక్టులకు కేంద్రం మద్దతునివ్వాలి

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన నిధులు విడుదల చేయాలని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖను ఉద్దేశించి ఆయన పలు కీలక ప్రశ్నలు సంధించారు. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియం ఆధునీకరణ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అత్యాధునిక షూటింగ్ రేంజ్ ఏర్పాటుతో పాటు రాష్ట్రంలో స్పోర్ట్స్ హబ్, స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు అవసరమైన కేంద్ర ఆర్థిక సహాయం అందించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. క్రీడలు అనేది రాష్ట్ర పరిధిలోని అంశమని, ప్రాథమికంగా మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత రాష్ట్రాలదేనని పేర్కొంది. అయితే, 'ఖేలో ఇండియా' వంటి పథకాల కింద రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతిపాదనలను నిబంధనల మేరకు పరిశీలించి, అర్హతను బట్టి తగిన ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అద్భుతమైన క్రీడా నైపుణ్యం కలిగిన యువత ఉన్నారని, వారికి అంతర్జాతీయ స్థాయి వేదికలు కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపైన ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సకాలంలో మద్దతు మరియు నిధులు లభిస్తే, రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి, యువతకు మెరుగైన అవకాశాల కల్పనకు ఎంతో దోహదం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళిక

### పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అన్ని రంగాల్లో ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నామని పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నూతన పాలకవర్గం ఏర్పాటైన మొదటి కౌన్సిల్ సమావేశం ఆయన అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. తెలంగాణ పురపాలక సంఘముల చట్టం ప్రకారం 2026–27 వార్షిక ఫైనాన్షియల్ బడ్జెట్ అంచనా వ్యయాల నివేదికను వివరించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరుల నుండి అంచనా బడ్జెట్ రూ.859.25 లక్షల గాను ఉద్యోగుల జీతభత్యాలు పారిశుద్ధ్య నిర్వహణ పారిశుద్ధ్య నిర్వహణ స్ట్రీట్‌లైటింగ్ సిబ్బంది జీతాలు కార్యాలయ సాధారణ ఖర్చుల వార్డుల వారిగా సాధారణ ఖర్చులకు ఇంకా ఇతర వాటికోసం కోసం అంచనా బడ్జెట్ రూ.859.25 లక్షలుగా నివేదికను రూపొందించి కౌన్సిల్‌లో ఆమోదించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొయ్యడ రాజు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ శ్రీరాము మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, పెద్దల చక్రపాణి, బాత్క లింగస్వామి, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్య వేణు, దేవరాయ కుమార్, జంకల లావణ్య యాదగిరి, సూరేపల్లి రాధిక రమేష్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో సంఘాలు పనిచేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ ఉద్యోగులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని,వారి సేవలు ప్రజలకు చేరువ కావడానికి సంఘాలు సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టిఎస్ ఎంఈఎస్ఏ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఏ.ఏ.ఖాన్ భవిష్యత్తులో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం,సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు కృషి చేస్తోందని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో కలిసి చర్యలు పని చేస్తామన్నిరు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)వై.అశోక్ రెడ్డి, చండూర్ ఆర్‌డిఓశ్రీదేవి, డిఆర్‌డిఓ వై.శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మహ్మద్ మోయిజ్, ప్రొఫసర్ సయ్యద్ అలీ, జనరల్ సెక్రటరీ మహ్మద్ మహమూద్, అసోసియేట్ ప్రెసిడెంట్ సయ్యద్ అన్వరుద్దీన్, ఎండి అతీక్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె అఫ్జల్ బాబా, అబ్దుల్ హాఫీజ్, ఎంఏ గఫార్, ఎండి నజీర్ అలీ, ఎండిఅన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లకు కంటి పరీక్షలు

### నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా ఉంటాం: సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నర్సింహ



**ప్రజాపక్షం/కోదాడ:** రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర పోలీస్, డిజిపి ప్రారంభించిన ఆరవ్ అలైవ్ మహా ఉద్యమం కార్యక్రమం 3వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కోదాడ పబ్లిక్ క్లబ్ పంక్షన్ హాల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచివారికి పోలీస్ మిత్రుడు, ప్రెండ్లీ పోలీస్, నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా ఉంటామని, ప్రజల రక్షణలో అనుక్షణం పని చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు ప్రధాన సమస్యగా మారాయని వీటినివారణకు జాగ్రత్తలు పాటించి అవగాహన చేసుకోవడం ముఖ్యమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీస్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించామన్నారు. ఈ శిబిరంలో కోదాడ పట్టణానికి చెందిన అశోక్ కంటి ఆసుపత్రి, పుల్లూరి కంటి ఆసుపత్రి, సురభి కంటి ఆసుపత్రి, లక్ష్మి కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. రోడ్డు భద్రత అంటే రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, వాహనాలను జాగ్రత్తగా డిఫెన్సివ్‌తో నడిపి ప్రమాదాలను నివారంచడం రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకంగా, ప్రతి వాహనదారుడు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు అపవద్దని, ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడవద్దని, సీటుబెల్టు , ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ఈ శిబిరం ద్వారా 500 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, పట్టణ సిఐ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐ సుధీర్, కంటి డాక్టర్లు అశోక్‌కుమార్, మల్లీశ్వరి, రామతులసి, రామ్‌చరణ్, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## అన్నారంలో పింఛన్ పంపిణీలో అవకతవకలు

### ప్రతి వ్యక్తికి పింఛన్‌లో రూ.16 ఇవ్వడంలో గోల్‌మాల్

### పోస్టుమాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** గత కొన్ని సంవత్సరాలుగా పింఛన్ పంపిణీ ప్రక్రియలో ఇష్టారాజ్యంగా నెలకు వేల రూపాయలు పింఛన్‌దారులు నష్టపోతున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూశాయి. తుంగతుర్తి మండలం, అన్నారం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 800పై చిలుకు పింఛన్‌దారులు ప్రతినెలా పింఛన్లు తీసుకుంటున్నారు. ఒక్కరికి రూ.2,016, రూ.4,016లు పంపిణీ చేయాల్సి ఉండగా సంబంధిత పోస్టల్ అధికారి కొందరికి రూ.16లు ఇవ్వకపోవడం, మరికొందరికి రూ.6 ల చిల్లర ఇవ్వకపోవడం, మరి కొంతమంది నెలనెల దాచుకున్న డబ్బులు ఎఫ్.డి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, పూర్తయినా, నేటి వరకు కూడా వారి కుటుంబానికి డబ్బులు అందించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్నారం గ్రామానికి చెందిన పోస్టుమాస్టర్ కనీసం పింఛన్‌దారుల పాసుబుక్‌లు కూడా ఇవ్వకపోవడం దారుణమని విమర్శిస్తున్నారు. ఒక్క గ్రామంలోనే పింఛన్‌దారుల డబ్బులు వేల రూపాయలు మిగిలిచ్చుకుంటున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనితో మొత్తం మండలంలో ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు పింఛన్‌దారులు నష్టపోతున్నారు. గ్రామాల్లో ఇది ఎందుకు జరుగుతుందని, ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించే వారే లేకపోయారు. మండలంలో వందల మంది



పింఛన్‌దారులకు జరుగుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా పోస్టల్ ఉన్నత శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి పేద పింఛన్ దారులకు న్యాయం చేయాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

**పోస్టల్ జిల్లా ఉన్నతాధికారి బుచ్చిబాబు వివరణ...**
పింఛన్‌దారులకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా పోస్టల్ ఉన్నతాధికారి బుచ్చిబాబును ఫోన్‌లో బాధితులు వివరణ కోరగా తమకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించి నిజమని తేలితే అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాష్ట్రంలో వేలాది మంది పనిచేస్తున్న ఆశ వర్కర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం కనీస కాంట్రాక్ట్ వర్కర్‌గా గుర్తించాలని కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఏఐటియుసి అనుబంధ సంఘమైన ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ తీసి, కొత్తబస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ ఎన్ కవిత, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వెంటనే కల్పించాలని ప్రతి ఆశాకు రూ.10లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం, లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. మెడికల్ డిపార్టుమెంట్‌లో నూతనంగా విడుదల చేసిన నోటిఫికేషన్లు ఆశల అర్హతను బట్టి ఏఎన్ఎం, జిఎన్ఎమ్, ల్యాబ్‌టెక్నిషియన్ తదితర పోస్టులలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. గత కొన్ని ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న సర్వేలు, పోలియో, ఎన్నికల విధులు, పరీక్ష పనికి సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, గౌరవ సలహాదారులు శ్యామల అశోక్, జిల్లా నాయకురాలు ఉమాహుస్సేనీ, సోమక్క, జ్యోతి, సుధా, సరస్వతి, అరుణ, సీత, జయమ్మ, సక్కుబాయి, బైనాబాయి పాల్గొన్నారు.

## రూ.107.30కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం

### అభివృద్ధికి అందరూ సహకరించాలి

### ఆదాయ వనరుల పెంపుతో పట్టణాభివృద్ధి సాధ్యం : మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటి 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది తెలిపారు. నూతన పాలక మండలి ఏర్పడిన తరువాత తొలి సమావేశంగా 2025–26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026–27 ముసాయిదా బడ్జెట్ సమావేశాన్ని సోమవారం పట్టణంలోని రవి మహాల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా సహకరించాలని కోరారు. మున్సిపాలిటి ఆదాయ వనరులను విస్తరించడం ద్వారానే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మున్సిపాలిటికి వచ్చే ఆదాయం ఎక్కువగా సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, పరిశుభ్రత, నీటి సరఫరా, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చువుతోంద



న్నారు. ఈ నేపథ్యంలో అదనపు ఆదాయ వనరులను గుర్తించడం అత్యవసరమని సూచించారు. పట్టణాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇంటి పన్నులు, నీటి బిల్లులు సమయానికి చెల్లించడం ద్వారా మున్సిపాలిటికి సహకరించాలని కోరారు. అక్రమ నిర్మాణాలను నియంత్రించడం, మున్సిపాలిటి ఆస్తులను పరిరక్షించడం ద్వారా కూడా ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను చైర్‌పర్సన్, కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్రభుత్వ భూములు కేటాయించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి, కానీ ఇతరుల కబ్జాలో ఉన్నాయి. గ్రామాల్లోని రైతులు తాము పండించిన పంటను కోసి ఆరబెట్టుకోవడానికి స్థలాలు లేక ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,360 ఉన్నప్పటికీ, అకాల వర్షాలకు భయపడి అతి తక్కువ ధరలకు దళారులకు క్వింటాలుకు రూ.1,700, 1,800లకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. యాసంగి (రబీ) సీజను వరిచేలు కోతకు సిద్ధం అయ్యాయి. ఇప్పటి పరిస్థితులు చూడలేక వరి పంట కోసి దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. పంటలు కోతకు సిద్ధం అయ్యే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం శోచనీయం అని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై అప్పటి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కూడా సానుకూలంగా స్పందించి,ఈ దిశగా ప్రయత్నం చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఊర్లో ఉన్న ప్రభుత్వ భూములను రైతులకు వారి ధాన్యం ఆరబెట్టుకోవడానికి ఎప్పటికీ ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, మండల తహసిల్దార్, ఇతర సంబంధిత అధికారులకు ప్రభుత్వ భూములను వెలికి తీసేలా ఆదేశాలిచ్చి, శ్రద్ధ చూపాలని, ఏదో ఒక శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని, ఇది రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లోని ప్రజలు ఎక్కడ తమ భూములకు వద్దు ఆరబెట్టుకోవడానికి రైతులకు ఇస్తే తమ భూములు సాగు చేస్తలేరని ఎక్కడ రైతుబంధు లాంటివి ఇవ్వకపోవడం వల్ల రైతులకు వారి ధాన్యం ఆరబెట్టుకోవడానికి తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. గతంలో ఇలా రైతులకు తమ భూములు ఇచ్చిన వాళ్ళకు రైతుబంధు ఇవ్వకపోవడం వల్ల ప్రజలు ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులకు తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఆ రైతుబంధు పైసలు తాము ఇస్తామని రైతులు అన్నా కూడా గ్రామప్రజలు ఇవ్వడం లేదు. ముందుగా ప్రతీ గ్రామంలో ఎంత ప్రభుత్వ భూములు ఉన్నాయో లెక్క తీసి, వాటిని ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులకు ఉపయోగపడేలా ఏర్పాట్లు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండలంలోని గ్రామాల ప్రజలు,రైతులు కోరుతున్నారు.

## స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో, కెనరా బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ శిక్షణా సంస్థను సోమవారం భువనగిరి పట్టణంలోని కిసాన్ నగర్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.



ఆర్‌ఎస్‌ఇటిఐ ద్వారా అందిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఫోటోగ్రఫీ & వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోమ్ వైరింగ్, ప్లంబింగ్, టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ వంటి వివిధ కోర్సులు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమములో ఆర్‌ఎస్‌ఇటిఐ డైరెక్టర్ కిషన్ భుక్య, డివిసనల్ మేనేజర్ పంకజ్, యల్‌డియం మాటూరి వంశీ, డి.పి.యం శ్రీనివాస్, జే.డి.యం రాజు, బ్యాంకు ప్రతినిధులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

"డ్రగ్స్ కేసులో తీవ్రంగా మానసికంగా క్రుంగిపోయాను తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటి హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, తన సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు."

రీల్


# వెంకట్ హీరోగా 'హరుడు'

శ్రీ సీతా రాముల కల్యాణం చూదాము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినీ మళ్లీ కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విజర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వెంకట్ హీరో రూపొం దుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ 'హ రుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. సహా నిర్మాతలుగా డాక్టర్ దిక్షల లక్ష్మ ప్రణాసాద్, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. సమ్మర్ స్పెషల్‌గా మే 8న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో హెబ్బపటేల్, సలోని, నాటపా ,అలీ, సుమన్, వీవీ వర్మ, సుభాశ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మణి జిన్న సంగీతం అంది స్తుండగా ఆనంద్ డిఒపిగా పని చేస్తున్నారు. ఉప్పు మారుతి ఎడిటర్.



## రెండు సంవత్సరాల కష్టం ఇది
# బైకర్ హీరో శర్వానంద్

శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం బైకర్ కోసం అద్భుతంగా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. వ్యక్తిగతంగా, క్రియేటివ్‌గా తనను మళ్లీ ఛాలెంజ్ చేసే పాత్ర బైకర్ రూపంలో వచ్చింది. ఇందులో అతను 18 ఏళ్ల రేసర్‌గా కని పించనున్నారు. ఈ పాత్ర కోసం అతను తన శరీ రాన్ని, మనసును పూర్తిగా మార్చుకున్నారు. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించగా, యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఒకసారి కమిట్ అయిన తర్వాత శర్వానంద్ పూర్తిగా తనను డెడికేట్ చేశారు. ఉదయం సూర్యోదయం కంటే ముందే మొదలయ్యే రోజు, అలసటని మునిగిన. లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన స్ట్రెంత్ ట్రైనింగ్, మొబిలిటీ సెషన్స్‌తో అతను తన పరిమితు లను దాటాడు. ఇది కేవలం శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా ఛాలెంజ్‌గా మారింది. ఈ ప్రయాణంలో యోగా అతనికి కీలకంగా నిలిచింది. జిమ్ అతనికి బలం, సహనం ఇచ్చినప్పుడు, యోగా అతని శరీర నలను ప్రశాంతం చేసి, ఫోకస్‌ను పెంచింది. ఈ ఫిరోషన్, ప్రశాంత కలయిక అతని మార్పుకు బలం అయింది. దీంతో అతను బరువు తగ్గి, మరింత షార్ప్ లుక్‌తో పాటు కొత్త కాన్ఫిడెన్స్‌ను పొందారు. ఈ సంద ర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ షూటింగ్ మొదటి రోజు అద్దంలో చూసుకున్నప్పుడు, నేను సిద్ధంగా ఉన్న ప్రశాంతతో ఉన్న అప్‌డేటెడ్ వ్యక్తిని చూశాను. ఏప్రిల్ 3న మీరు స్క్రీన్‌పై చిక్కిన చూస్తే, అది కేవలం నేటన కాదు – రెండు సంవత్సరాల కష్టం, మారాలనే పట్టుదల ఫలితాన్ని చూస్తారు.



# పోస్ట్ ప్రొడక్షన్‌లో 'మా ఇంటి బంగారం'

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత ప్రధాన పాత్రలో నటి స్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దిగంత్, గుల్షన్ దేవయ్య ఇతర పాత్రల్లో నటిస్తు న్నారు. శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ బేబీ వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత మరోసారి సమంత, నందిని రెడ్డి కాంబోలో రానున్న ఈ సినిమాను రాజ్ నిడిమోరు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ



చిత్రాన్ని మే15న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తు న్నారు. యాక్షన్ డ్రామాగా తెరకెక్కి స్తున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. యాక్షన్ డ్రామా మూవీ అందరికీ నచ్చేలా, అన్ని అంశాలతో రూపొం దుతోంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను బలమైన భావోద్వేగాలతో పాటు ఉత్కంఠ తను యాక్షన్ ఎలిమెంట్స్‌ను బ్యాలెన్స్ చేస్తూ డైరెక్టర్ నందిని రెడ్డి డైరెక్ట్ చేస్తు న్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాష్, స్టోరీ, స్క్రీన్‌ప్లే: రాజ్ నిడిమోరు, వసంత్, మారింగంటి, సీతా మీనన్, యాక్షన్: లీ విట్టేకర్, ఎడిటింగ్: ధర్మేంద్ర కాకరాల.

# సల్మాన్ ఖాన్‌తో దిల్ రాజు సినిమా

తెలుగు తెరపై నెంబర్ చిత్ర నిర్మాణ సంస్థ గా పేరు గాంచిన శ్రీవేంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్ అధినేత దిల్ రాజు తాజాగా బాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తున్నారు. ఏకంగా సల్మాన్ ఖాన్ తో సినిమా చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాకు వంశీ పైడిపల్లి దర్శ కత్వం వహిస్తున్నారు. ఇటీవల సల్మాన్ ఖాన్ కు వంశీ చెప్పిన కథ చాలా బాగా నచ్చడంతో షూటింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పక్కా మాస్ కమర్షి యల్ సినిమాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్‌లోనే ప్రారంభం కానుందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. మిగతా నటీ నటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని దిల్ రాజు అన్నారు. ఎస్ వి సి బ్యానర్ పై ఇది 63వ చిత్రంగా నిర్మిస్తున్నా మని దిల్ రాజు పేర్కొ న్నారు.



# ఆ క్షణం చనిపోవాలనుకున్నా: నటి హేమ

## డ్రగ్స్ కేసులో తీవ్రంగా మానసికంగా క్రుంగిపోయాను

తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటి హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, తన సహజమైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే సమయంలో నేరుగా, బహిరంగంగా తన అభిప్రాయా లను చెప్పే స్వభావం వల్ల కూడా తరచూ వార్తల్లో నిలుస్తూ ఉం టారు. టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా దశా బ్దాల పాటు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న న టి హేమ ఫిలిం ఛాంబర్ లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లా డారు. ఆమె ఇటీవల తనపై న మోదైన డ్రగ్స్ కేసు, దాని వల్ల తన కుటుంబం ఎదు ర్కొన్న సమస్య గురించి మీడియా ప్రతినిధులు అడి గిన ప్రశ్నలకు సమాధా నాలు చెప్పా రు. డ్రగ్స్ కేసులో తనపై వచ్చిన ఆరో పణలు తనను తీవ్రంగా మానసికంగా కలచివేశా యని చెప్పారు. ఆ సమయంలో నేను చచ్చిపోవా లనిపించింది. అంతగా మానసికంగా కుం గి పోయాను అని ఆమె ఆవేదన వ్యక్తం చేశా రు. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని, అందుకే చివరకు ని ర్దోషిగా బయటకు వచ్చానని స్పష్టం చేశారు. డ్రగ్స్ వ్యవ హారంలో కొందరు మీ డియా సంస్థలు తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లాయని ఆమె ఆరోపించారు. ఆ వార్తల కారణంగా తన వ్యక్తిగత జీవితం మా త్రమే కాకుండా కుటుంబ సభ్యులు కూడా తీ వ్రంగా బాధపడ్డారని చెప్పారు. నా కుటుంబం చాలా సఫర్ అయింది. మాకు ఇది చాలా కఠినమైన కాలం అని ఆమె పేర్కొన్నారు. అయితే మొత్తం మీడియాను ఒకే తాటిపై వేయలేమని, నిజాయితీగా వ్యవహరించే మీడియా సంస్థలు తనకు మద్దతుగా నిలుస్తాయని తాను నమ్ముతున్నానని హేమ తెలిపారు. భవిష్యత్తులో కూడా మీడియా తనకు న్యాయం చేస్తుం దని ఆశాభావం వ్యక్తం చేశారు.





## ప్రకాష్ రాజ్‌కు మాతృ వియోగం

ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ మాతృమూర్తి సువర్ణలత కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం కన్నుమూశారు. ఈ విషయం తెలిసి చింతిస్తున్నామని నటుడు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. శ్రీమతి సువర్ణలత ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. మాతృ వియోగానికి లోనైన ప్రకాష్ రాజ్ , ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

# సంగీత రంగంలో కొత్త ప్రభంజనం 'కార్మేని సెల్వం'

పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా సంగీతం దర్శకుడు రామానుజన్ ఎం.కె చిత్ర విశేషాల గురించి ఇలా వివరించారు.

ఒక చిత్రానికి సంగీతాన్ని అందించిన ఘనత ఏ ఒక్క వ్యక్తికీ కాకుండా, ఒక సంస్థకు దక్కాలని కోరు కున్నాం. అందుకే 2017లో బెంగళూరులో ప్రారంభించాను. మొదట్లో కార్పొరేట్ ప్రాజెక్టు లను స్వీకరిస్తూ, నెమ్మదిగా నా పనితీరును మెరుగుపరుచుకోవడం మొదలుపె ట్టాను. ఆ తర్వాత మీడియా సంస్థ లతో భాగస్వామ్యాలు కుదు ర్చుకోవడం ప్రారం భించాను.



మేము సౌండ్ డిజైన్, వాయిస్ఓవర్లు మరియు డబ్బింగ్ వంటి అన్ని సేవలను అందించాము. ప్రస్తుతం 'కార్మేని సెల్వం' ప్రాజెక్ట్‌ను విడుదల చేయ డానికి సిద్ధంగా ఉన్నాం. ఈ సినిమాకు సంగీతం దర్శ కుడి పేరు కాకుండా.. (మ్యూజిక్ యాజ్ ఏ సర్వీస్) మ్యూజిక్ క్లౌడ స్టూడియో అండ్ టెక్నాలజీ పేరును ప్రకటించాం. చివరగా, కార్మేని సెల్వం ఒక హృద యానికి హత్తుకునే సినిమా. మన జీవితంలో ఎదు రయ్యే భావోద్వేగాలను ప్రతిబింబిస్తుంది. నా పేరు కంటే నా సంగీతమే ప్రేక్షకుల హృదయాల్లో నిలవా లని కోరుకుంటున్నాను'.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
# సింగరేణి సిరిని దోచుకుంటున్నాయ్

- కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా.కె.నారాయణ
- సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి: తీవ్ర ఉద్రిక్తం
- సింగరేణి నేతలు, కార్మికులు - పోలీసుల మధ్య తోపులాట
- సిపిఐ నేతలు నారాయణ, సాబీర్ పాషా, యూనియన్ నాయకులు అరెస్ట్

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** సింగరేణి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వర్కర్స్ యూనియన్ చేపట్టిన సింగరేణి ప్రధాన కార్యా లయం ముట్టడి తీవ్ర ఉద్రిక్తతగా మారింది. కోల్ బెల్టు ప్రాంతాల నుండి తరలి వచ్చిన వేలాది మంది కార్మికులు, యూనియన్ కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కార్యాలయం చేరుకుని ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. పొర్లు దండాలతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మూడు గంటల పాటు ధర్నా చేపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు నేతలు, కార్మికులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో ప్రధాన కార్యాలయం ఎదుట తీవ్ర ఉద్రిక్త వాతావ రణం చోటు చేసుకుంది. సిపిఐ జాతీయ నాయ కుడు డా.కె.నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో పాటు యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తది తరులను పోలీసులు నిర్భందించి 1టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు ముందు కార్మి కులను ఉద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమి షన్ చైర్మన్ డా.కె.నారాయణ మాట్లాడుతూ సింగ రేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ.50 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని, ఆ నిధులను ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త గనులు ప్రారంభంపై యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్యం సంస్థ మనుగడగే ముప్పని, ఎసిబి విచారణ సాకుతో మెడికల్ బోర్డును నిలిపి వేయడం కార్మికుల ప్రాణాలతో చెలగాటమేమిటని



మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సిరిని దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. కార్మి కుల కష్టంతో మనుగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ కార్మికులను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తోం దని, ఇందులో మితిమీరిన రాజకీయ జోక్యమే కారణం అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీ లను నిలబెట్టుకోకుంటే రాబోయే రోజుల్లో మరిన్ని గట్టి పోరాటాలు చేస్తామని, అవసరమైతే సింగరేణి కార్యాలయాలను స్వాధీనం చేసుకుని తమ సత్తా చాటుతామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మి కులకు హై పవర్ కమిటీ వేతనాలు, సొంతింటి పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లర్క్ పోస్టులకు కోర్టు కేసులతో సంబంధం లేకుండా పరీక్షలు జరపాలని, 350 మంది డిపెం డెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటించాలన్నారు. సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో మెడికల్ బోర్డు వల్ల సింగరేణికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ప్రకటించడం దుర్మార్గం అన్నారు. కొత్త గనులు ఏర్పాటు చేసే క్రమంలో ప్రైవేటు పెత్తనానికి స్వస్తి చెప్పి సింగరేణి కార్మికులతోనే బొగ్గు ఉత్పత్తి చేయాలని, పాత పద్ధ తిలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నాయ కులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కార్మికుల గొంతుకగా నిలుస్తున్నారని కొనియాడారు. సింగరేణి యాజ మాన్య తప్పుడు విధానాలతో కార్మికుల బ్రతుకులు తీవ్ర ఇబ్బందుల్లోకి వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేవ్ సింగరేణి నినాదంతో చేపట్టిన ఈ ముట్టడికి అనూహ్య స్పందన వచ్చిం దని, కార్మికుల సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపకుంటే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంగరేణి కార్మికులతో చెలగాటం ఆడిన ప్రభుత్వాలేవి మనుగడ సాగించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, నాయకులు మిర్యాల రంగయ్య, కే సారయ్య, వీరభద్రం, వైవి రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్. జీ వీరస్వామి, ఎస్ వి రమణమూర్తి, వి మల్లిఖార్జున రావు, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, కంచర్ల జమ లయ్య తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ హోదా ఇవ్వలే
(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పోలవరం ప్రాజె క్టుకు జాతీయ హోదా ఇవ్వడంతో పాటు రెండు లక్షల ఎకరాల గిరిజన, ఆదివాస భూములను కేంద్రం అప్పనంగా అప్పగించిందని విమర్శిం చారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, రాజకీయాలు ముఖ్యం కాదని, అందుకే సిఎం, మంత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధానిని కలుస్తున్నామని వివరించారు. 'పిఎం కుసుమ్' స్కీమ్ అమలు చేసేందుకు తాము ఇది వరకే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసి, దీనిని ఒక కేంద్ర ప్రయోజిత కార్యక్ర మంగా అమలు చేస్తోందని విమర్శించారు. విజి రాంజీ స్కీమ్ ద్వారా ఖమ్మంలోని లేదా ఇతర గ్రామాల్లో ఏమి పనులు చేయాలో ఢిల్లీలో కూర్చొని నిర్ణయిస్తామంటే ఎలా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభను, పంచాయ తీలను కేంద్రం నిర్వీర్యం చేసిందని, వాటిని నియంత్రణలో పెట్టుకుని, తాము చెప్పిన పనే చేయాలనడం దుర్మర్గమన్నారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రభుత్వ ఆలోచిస్తుందని, గిగ్ వర్కర్ల చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. అన్ని కుటుంబాలకు, అన్ని వర్గాలకూ ఉపయోగపడే విధంగా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, ఇది పీపుల్స్ బడ్జెట్ అని, అందుకే రాష్ట్ర బడ్జెట్ విశిష్టతో కూడుకున్నదన్నారు. కేంద్ర ప్రయోజిత కార్యక్ర మాలలో ఏ ఒక్క వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వం వదులుకోవద్దని నిర్ణయించామని, ఇందులో భాగంగానే రాష్ట్ర వాటాలను కూడా చెల్లిస్తున్నా మని వివరించారు.

# దాదాపు నిర్మూలించాం
(మొదటి పేజీ తరువాయి)

రేషన్ దుకాణాలు తెరుస్తామన్నారు.నక్సలిజాన్ని నిర్మూలిస్తామని మోదీ ప్రభుత్వం ప్రతిజ్ఞ చేసింది. దానికొక గడువు తేదీని నిర్ణయించింది. 2026 మార్చి 31వ తేదీతో మోదీ ప్రభుత్వం విధించకు న్న గడువు ముగిసిపోతుంది. అంటే ఈ గడువు ఇంకా కొద్ది గంటల్లో ముగుస్తుంది. కశ్మీరులో, ఈ శాన్య రాష్ట్రాలలో ఉగ్రవాదం కంటే దేశానికి నక్స లిజం అతిపెద్ద సవాలుగా మారిందని నాటి ప్రధా నమంత్రి మన్మోహన్‌సింగ్ చెప్పారని అమిత్ షా గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్‌పార్టీ నక్సలిజం నిర్మూ లనకు ఏమీ చేయలేదని అన్నారు. కానీ నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం దేశంలో ఏ విధమైన ఉగ్ర గవాదాన్నైనా సహించబోదని అన్నారు. దేశంలో నక్సలైట్ ఉద్యమ హింస నిర్మూలనకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని అన్నారు. 12 రాష్ట్రాలు దేశంలో రెడ్ కారిడార్ పాలనలోకి వెళ్ళాయని, ఈ రెడ్ కారిడార్‌లో ఎలాంటి చట్టబద్ధమైన పాలనా లే కుండా పోయిందని, అనేక సంవత్సరాలుగా ఈ రాష్ట్రాలలో 12 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం లో జీవించారని చెప్పారు. నక్సలైట్ల హింసాత్మక చర్యల కారణంగా ఈ రాష్ట్రాలలో అనేక సంవత్స రాలుగా 5,000 మంది భద్రతా సిబ్బందితోపాటు 20,000 మంది ప్రజలు మరణించారని చెప్పారు. "నక్సలిజం అంతం చేసేందుకు మేం బాధ్యత తీసుకున్నాం, 75 ఏళ్ళ స్వతంత్ర్య భారతదేశంలో 60 సంవత్సరాలపాటు మీరు పరిపాలన చేశారు, ఐనాగానీ దేశంలో గిరిజన ప్రజలు ఇంకా ఎందుకు పేదరికంలో ఉన్నారు? గిరిజన ప్రాంతా లలో ఎందుకు పాఠశాలలు నిర్మించలేదు? ఈనాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతున్నారు" అని అమిత్ షా చెప్పుకొచ్చారు. 60 సంవత్సరాల కాంగ్రెస్‌పాల నలో గిరిజనుల నివాసాల అభివృద్ధికి, అభ్యున్న తికి కాంగ్రెస్‌పార్టీ చేసింది ఏమీ లేదన్నారు. వారికి నీరు ఇవ్వలేదని, స్కూలు భవంతులు నిర్మించలే దని, బ్యాంకు సదుపాయాలు కూడా వారికి సమ కూర్చలేదని అమిత్ షా విమర్శించారు. మీ పాల నలో మీరు ఏం చేయలేదు. కానీ మోదీని విమర్శి స్తున్నారన్నారు. అదేవిధంగా లోక్‌సభలో ఎన్‌డిఎ కూటమి పార్టీల ఎంపీలు తీవ్రస్థాయిలో కాంగ్రెస్ పాలకులపై ముఖ్యంగా యుపిఎ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నక్సలిజం నిర్మూలనకు వారేమీ చేయలేదని విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్‌పార్టీ కూడా దీటుగా స్పందిస్తూ నక్సలిజం నిర్మూలనకు దేశంలో తమపార్టీ ఎంతో కృషి చేసిం దని చెప్పింది. శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే మాట్లాడుతూ, బిజెపి పాలనలో దేశంలో రెడ్ కార్నర్ గణనీయంగా క్షీణించిపోయిందన్నారు. గత ఏడాది 317 మంది నక్సలైట్లు హతం కాగా, 862 మంది అరెస్టయ్యారని, 1,900 మంది లొంగిపోయారని చెప్పారు. 2024లో 2025 సంవత్సరాల్లో 28 నక్సలైట్ నాయకులు హతుల య్యారని, వీరిలో ఆరుగురు సెంట్రల్ కమిటీ సభ్యులున్నారని, 2026 లో ఇప్పటివరకూ 630 మంది నక్సలైట్లు భద్రతా దళాల దాడుల్లో హతుల య్యారని, ఇప్పుడు మిగిలినవారు ఆ మార్గం వది లిపెట్టి బయకు వచ్చారన్నారు. తెలుగుదేశంపార్టీ ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, వామపక్ష తీవ్ర వాదం కారణంగా తాను తన కుటుంబాన్ని కోల్పో యానన్నారు. కాంగ్రెస్‌పాలనలో భారీ స్థాయిలో నక్సలైట్ల దాడులు జరిగాయని చెబుతూ మోదీ అనుసరించిన విధానంపట్ల కృతజ్ఞతలు తెలియజే శారు. మోదీ,అమిత్ షా అవిశ్రాంతంగా కృషి చేశా రన్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి సప్తగిరి ఉలేఖ స్పందిస్తూ కాంగ్రెస్‌పాలనలో ఆపరేషన్ గ్రీన్‌హ ంట్ జరిగిందని గుర్తుచేశారు. కమాండో బెటాలి యన్ ఫర్ రిజల్యూషన్ యాక్షన్ (కోబ్రా)ను కా ంగ్రెస్‌పార్టీ సృష్టించిందని చెప్పారు. తృణమూల్ కా ంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా మాట్లాడు తూ, మోదీ ప్రభుత్వం తన వీపు తానే చరుచుకుని అభినందనలు చెప్పుకుంటోందని విమర్శించారు. ప్రజలు యుద్ధం వల్ల గ్యాస్ లభించక ఎన్నో క ష్టాలు పడుతోందని, ఈ సమస్యలను మోదీ ప్రభుత్వం తాను సృష్టించిన సమస్యగా తన సొంతం చేసుకోవాలని అన్నారు.

# టూరిజంలో అక్రమాలు
(మొదటి పేజీ తరువాయి)

కోట్ల ఆదాయం రాగా, 2025లో రూ.13.12 కోట్లకు ఆదాయం పడిపోయింది. హుస్సేన్ సాగర్, దుర్గం చెరువు, నాగార్జున సాగర్, లక్నవరం లాంటి ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ పెరుగుతున్నా ఒక్క ఏడాదిలో రూ.1.48 కోట్ల ఆదాయం పడిపోవ డంతో పర్యాటక శాఖలో అవినీతి జరుగుతున్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు బోటింగ్ కేంద్రాల్లో ఇంచార్జీలు, మేనేజర్లు, సిబ్బందితో కుమ్మక్కయి, టిక్కెట్లు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే తక్కువ ధరలకు బోటింగ్ నిర్వహిస్తు న్నట్లు గుర్తించారు. రూ.500 ఉన్న టికెట్‌ను రూ.200కు విక్రయించడం, టికెట్ లేకుండా బోట్‌లోకి అనుమతించడం, 10 ట్రిప్పులు తిరిగితే 8 ట్రిప్పులు తిరిగినట్లు చూపించి మిగతా 2 ట్రిప్పుల డబ్బులు తీసుకోవడం, ఒక్క ట్రిప్పుకు 3 లీటర్లు డీజిల్ అవసరం ఉండగా అదనంగా 2 లీటర్లు బిల్లులో రాయడం లాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ఉన్నతాధికారులు గుర్తించారు. నాగార్జునసాగర్ బోటింగ్ కేంద్రంలో ఇంచార్జి ఏకంగా నకిలీ టికెట్ బుక్కునే ప్రింట్ చేసి, ప్రభుత్వానికి రావల సిన లక్షల ఆదాయం కొల్లగొట్టాడని, అతన్ని విధుల నుండి అధికారులు తొలగిం చారు. ప్రతీ బోటింగ్ కేంద్రంలో ఇలాంటి అవినీతి జరుగుతుందని, మంత్రి జూపల్లి కృష్ణారావు ఇప్పటికైనా ఇలాంటి అక్రమార్కుల పట్ల చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# నితీశ్ రాజీనామా
(మొదటి పేజీ తరువాయి)

ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయడానికి 14 రోజుల గడు వును రాజ్యాంగం నిర్దేశించింది. కాగా, మార్చి 30తో ఈ గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో రాజ్యసభకు ఎన్నికైన నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి సోమవారం రాజీ నామా చేశారు. సిఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చేయ నున్నారు. ఏప్రిల్ 9న నితీశ్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. మరో వైపు 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్ కుమార్ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2005లో తొలిసారి బిహార్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. పలు రాజకీయ కూటములు మారుతూ రికార్డు స్థాయిలో బిహార్ పదో సిఎంగా ఉన్న నితీశ్ కుమార్ త్వరలో ఆ పదవికి కూడా రాజీనామా చేయ నున్నారు. అయితే బిహార్ చరిత్రలో తొలిసారి బిపిపి నేత సిఎం పదవి చేపట్టనున్నారు. డిప్యూటీ సిఎం, బిజెపి శాసనసభా పక్ష నేత సామ్రాట్ చౌదరి ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com